www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 9-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 23 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 6.21, విదియ తె. 4.18 వరకు; నక్షత్రం: కృత్తిక ఉ. 11.55 తదుపరి రోహిణి; వర్జ్యం: తె. 3.09-4.41; దుర్ముహూర్తం: ఉ. 10.04-10.55, మ. 3.10-4.01; అమృతఘడియలు: ఉ. 9.40-11.10; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎల్ అండ్ టీ లాభంలో వృద్ధి

» ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్

న్యూఢిల్లీ: ఈ మార్చితో ముగిసిన త్రైమాసికానికి లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.2 శాతం పెరిగి రూ.4,396.12 కోట్లకు చేరుకుంది. ఏకీకృత ఆదాయం రూ.68,120.42 కోట్లకు ఎగబాకింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3 లక్షల కోట్లకు పైగా కొత్త ఆర్డర్లను అందుకున్నట్లు, ఆర్డర్ బుక్ రూ.4.75 లక్షల కోట్లకు చేరుకుందని ఎల్ అండ్ టీ పేర్కొంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2023-24) లాభం 24.72 శాతం వృద్ధితో రూ.13,059.11 కోట్లుగా, రాబడి 20.60 శాతం పెరుగుదలతో రూ.2,21,112.91 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు ఎల్ అండ్ టీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు.

హీరో మోటోకార్ప్ ఆదాయం రూ.9,616 కోట్లు

» తుది డివిడెండ్ రూ.40

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ నాలుగో త్రైమాసికానికి రూ.943.46 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి గడించిన రూ.810.8 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 16.7 శాతం అధికం. కాగా, కంపెనీ ఏకీకృత ఆదాయం రూ.8,434.28 కోట్ల స్థాయి నుంచి రూ.9,616.68 కోట్లకు పెరిగింది. మొత్తం ఖర్చులు సైతం రూ.7,508.94 కోట్ల నుంచి రూ.8,427.36 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది జనవరి-మార్చి కాలానికి 13.92 లక్షల మోటార్ సైకిళ్లు, స్కూటర్లను విక్రయించినట్లు కంపెనీ వెల్లడించింది. ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.37,788.62 కోట్ల ఆదాయంపై రూ.3,742.16 కోట్ల ఆదాయం ఆర్జించింది. 2023-24కు గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.40 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇప్పటికే చెల్లించిన రూ.100 తాత్కాలిక, ప్రత్యేక డివిడెండ్‌తో కలిపితే, గత ఆర్థిక సంవత్సరానికి చెల్లించే మొత్తం డివిడెండ్ రూ.140 అవుతుంది.



మిలియనీర్ల అడ్డా ముంబై, ఢిల్లీ

భారత్ నుంచి ఈ రెండింటికి చోటు

» బెంగళూరులో సంపన్నుల సంఖ్య జూమ్

» హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ జాబితా విడుదల

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధికంగా మిలియనీర్లు నివసిస్తున్న 50 నగరాల జాబితాలో భారత్ నుంచి ముంబై, ఢిల్లీకి చోటు దక్కింది. ఈ ఏడాదికి గాను హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ విడుదల చేసిన ప్రపంచ సంపన్న నగరాల నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 58,800 మంది మిలియనీర్లతో ముంబై 24వ స్థానంలో నిలవగా.. 30,700 మంది మిలియనీర్లతో ఢిల్లీ 37వ స్థానంలో ఉంది. అమెరికన్ కరెన్సీలో కనీసం 10 లక్షల కోట్ల డాలర్ల (మన కరెన్సీలో రూ.8.35 కోట్లు) సంపద కలిగిన వారిని మిలియనీర్గా పిలుస్తారు. ముంబై సంపన్నుల్లో 236 మంది సెంటీ మిలియనీర్లు (కనీసం 100 మిలియన్ డాలర్లు= రూ.835 కోట్లు) కాగా, 29 మంది బిలియనీర్లుగా (కనీసం 100 కోట్ల డాలర్లు= రూ.8,350 కోట్లు) ఎదిగారు. ఢిల్లీ సంపన్నుల్లో 123 మంది సెంటీ మిలియనీర్లు, 16 మంది బిలియనీర్లు ఉన్నారు. భారత సిలికాన్ వేలీగా పేరొందిన బెంగళూరు మిలియనీర్ల సంఖ్య శరవేగంగా పెరుగుతున్న ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలిచింది. హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం బెంగళూరులో 13,200 మంది మిలియనీర్లు ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక మంది మిలియనీర్లున్న నగరాల్లో న్యూయార్క్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నగరంలో 3,49,500 మంది మిలియనీర్లున్నారు. ఈ నగర జనాభా 82.6 లక్షలు. అంటే, ప్రతి 24 మందిలో ఒకరు మిలియనీరే. గడిచిన దశాబ్దకాలంలో (2013-2023) న్యూయార్క్ సంపన్నుల సంఖ్య 48 శాతం పెరిగింది. అలాగే, పదేళ్లలో ముంబై మిలియనీర్ల సంఖ్య 82 శాతం వృద్ధి చెందగా.. ఢిల్లీలో 95 శాతం పెరిగింది.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,757 కోట్లు

ఒక్కో షేరుకు రూ.16.10 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ నికర లాభం మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి 18 శాతం వృద్ధితో రూ.3,757 కోట్లకు చేరుకుంది. వడ్డీ ఆదాయం పుంజుకోవడంతో పాటు మొండిబకాయిలు మరింత తగ్గడం ఇందుకు దోహదపడింది. క్యూ4లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,025 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.28,807 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.9,580 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 37 శాతం పెరిగి రూ.14,554 కోట్లకు చేరుకుంది. కాగా, 2023-24కు గాను వాటాదారులకు రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.16.10 (161 శాతం) తుది డివిడెండ్ చెల్లించాలని బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది మార్చి 31 నాటికి కెనరా బ్యాంక్ మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 5.35 శాతం నుంచి 4.23 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.73 శాతం నుంచి 1.27 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి గ్రాస్ ఎన్‌పీఏలు 3.25 శాతానికి, నికర ఎన్‌పీఏలు ఒక శాతానికి తగ్గవచ్చని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు అన్నారు.
- మొండిబకాయిల కోసం కేటాయింపులు కూడా 2,280 కోట్లకు తగ్గాయి. 2022-23 క్యూ4లో మొండిబకాయిల కోసం కేటాయింపులు రూ.2,399 కోట్లుగా నమోదయ్యాయి.
- 2023 మార్చి చివరినాటికి 87.31 శాతంగా నమోదైన ప్రొవిజన్ కవరేజీ రేషియో.. ఈ మార్చి 31 నాటికి 89.10 శాతానికి పెరిగింది.
- నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.95 శాతం నుంచి 3.05 శాతానికి మెరుగుపడింది. అయితే, బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం కొనసాగుతున్న గరిష్ఠ వడ్డీ రేట్ల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఎన్ఐఎం 2.95-3 శాతానికి పరిమితం కావచ్చని సత్యనారాయణ రాజు అన్నారు.
- 2023 మార్చి 31 నాటికి 16.68 శాతంగా నమోదైన మూలధన సమర్థత నిష్పత్తి (సీఆర్ఏఆర్).. ఈ మార్చి చివరి నాటికి 16.28 శాతానికి తగ్గింది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణాల వృద్ధి 11-12 శాతంగా, డిపాజిట్ల వృద్ధి 9 శాతంగా నమోదు కావచ్చని సత్యనారాయణ రాజు అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు, డిపాజిట్ల విస్తరణకు అదనపు మూలధనం అవసరం లేదన్నారు.
- ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్ట్ ఫైనాన్స్ కోసం కేటాయింపులపై ఆర్‌బీఐ విడుదల చేసిన ముసాయిదా సర్క్యులర్‌పై మరింత స్పష్టమైన సమాచారం కోరుతున్నామని ఎండీ పేర్కొన్నారు. బ్యాంక్ ప్రాజెక్ట్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో రూ.1.10 లక్షల కోట్ల స్థాయిలో ఉందన్నారు.
- ప్రస్తుతం కెనరా బ్యాంక్ 9,604 శాఖలను, 10,209 ఏటీఎంలను కలిగి ఉంది. అలాగే, లండన్, న్యూయార్క్, దుబాయ్ తోపాటు గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో అంతర్జాతీయ బ్రాంచ్‌లను నిర్వహిస్తోంది.

ఐపీఓకు అనుబంధ సంస్థలు

కెనరా బ్యాంక్ అనుబంధ విభాగాలైన కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్, కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్‌లో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా కొంత వాటాను ఉపసంహరించుకోవాలని భావిస్తున్నట్లు సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఏదైనా ఒక అనుబంధ విభాగం ఐపీఓకు వచ్చే అవకాశం ఉందన్నారు.

వచ్చేసింది గూగుల్ వ్యాలెట్



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ ఆండ్రాయిడ్ వినియోగదారులకు గూగుల్ వ్యాలెట్ యాప్‌ను బుధవారం విడుదల చేసింది. యూజర్లు ఈ యాప్‌లో తమ బోర్డింగ్ పాస్‌లు, లాయల్టీ కార్డులు, ఈవెంట్ టికెట్లు, ప్రజారవాణా పాస్‌ల వంటివి భద్రంగా దాచుకోవచ్చు. బుధవారం నుంచే ఈ డిజిటల్ వ్యాలెట్ పని చేయడం ప్రారంభించింది. గూగుల్ పే యాప్‌నకు ఇది కాంప్లిమెంటరీగా అందుబాటులోకి వచ్చింది. "గూగుల్ పే యాప్ ఎక్కడికీ పోదు. అది ఎప్పటికీ మా ప్రాథమిక పేమెంట్ యాప్‌గా కొనసాగుతుంది. నాన్ పేమెంట్ కేసుల్లో గూగుల్ వ్యాలెట్ ఉపయోగరకంగా ఉంటుంది" అని గూగుల్ ఆండ్రాయిడ్ జీఎం, ఇండియా ఇంజనీరింగ్ లీడ్ రామ్ పాపట్ల చెప్పారు. ఈ కొత్త సర్వీస్ కోసం ఎయిరిండియా, ఇండిగో, ఫ్లిప్‌కార్ట్, పైన్ లాబ్స్, కోచి మెట్రో, పీవీఆర్, ఐనాక్స్ వంటి 20 భారతీయ బ్రాండ్లతో గూగుల్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని భాగస్వామ్యాలు కుదుర్చుకోవాలని భావిస్తోంది. ఈ వ్యాలెట్ పూర్తిగా సురక్షితమని, కస్టమర్ల గోప్యతను కాపాడుతుందని రామ్ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	88,500 ▲
ముంబై	71,640 ▼	65,630 ▼	81,540 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	485
వరంగల్	492	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	148
వరంగల్	140	విజయవాడ	148
కరీంనగర్	140	గుంటూరు	148
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	148
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	140		

కొనసాగిన అమ్మకాల జోరు

45 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 45.46 పాయింట్ల నష్టంతో 73,466.39 వద్ద ముగిసింది. ఇంట్రా డేలో ఒక దశలో 437.93 పాయింట్ల వరకు నష్టపోయి 73,073.92 పాయింట్లను తాకింది. నిఫ్టీ మాత్రం ఎదుగూ బొదుగూ లేకుండా 22,302.50 పాయింట్ల వద్ద క్లోజైంది. ఐటీ కంపెనీలతో పాటు ప్రైవేటు బ్యాంకుల షేర్లలో అమ్మకాలు, ఎఫ్‌పీఐల అమ్మకాలు బుధవారం మార్కెట్‌ను దెబ్బతీశాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల టర్నౌట్ తక్కువగా ఉండడం, క్యూ4 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడమూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

ఇండిజీన్ ఇష్యూకి అదిరే డిమాండ్: హెల్త్‌కేర్ టెక్ కంపెనీ ఇండిజీన్ ఐపీఓ సూపర్ డూపర్ హిట్టయింది. బుధవారం బిడ్డింగ్ ముగిసే సమయానికి 69.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా 2,88,66,677 షేర్లను రూ.430-452 ప్రైస్ బ్యాండ్‌లో షేర్లు జారీ చేయగా, మదుపరుల నుంచి 201.22 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి.

ఆధార్ హౌసింగ్ ఐపీఓ: ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐపీఓ ప్రారంభమైన తొలి రోజే 43 శాతం సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ 700.80 లక్షల షేర్లు జారీ చేస్తోంది. ఇష్యూ ప్రారంభమైన తొలి రోజే మదుపరుల నుంచి 304.53 లక్షల షేర్లకు బిడ్స్ వచ్చాయి. రూ.300-315 ప్రైస్ బ్యాండ్‌లో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఈ ఐపీఓ జారీ చేస్తోంది.

ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ఐ-వెంచర్ ఇమ్మర్సివ్

హైదరాబాద్: ఔత్సాహిక ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఐ-వెంచర్ ఇమ్మర్సివ్ (ఐవీఐ) పేరిట ఒక ప్రోగ్రామ్ ప్రారంభించింది. 12 తరగతి పైబడి ఎలాంటి వ్యవస్థీకృత విద్య లేకుండానే తమకు ఆసక్తి గల రంగంలో ఇన్నోవేషన్‌కు కృషి చేసేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక శిక్షణకు అడ్మిషన్లు ప్రస్తుతం జరుగుతున్నట్టు ఐఎస్‌బీ ప్రకటించింది. హైదరాబాద్ క్యాంపస్‌లోనే ఇది ఫుల్‌టైమ్ ప్రోగ్రామ్‌గా నిర్వహిస్తారు. ఔత్సాహికులు తమ నవ్య ఆలోచనలను ఆచరణీయం చేయడానికి అవసరం అయిన నిధుల కల్పన కూడా ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉంటుంది.


నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ధర్మశాల

పంజాబ్ X బెంగళూరు

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	11	6	5	0	12	0.700
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
ముంబై	12	4	8	0	8	-0.212
గుజరాత్	11	4	7	0	8	-1.320

ముంబై అవుట్



లఖ్‌నవూపై హైదరాబాద్ విజయంతో..ఈసారి ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేస్‌నుంచి అవుటైన తొలిజట్టుగా ఐదుసార్లు చాంపియన్ ముంబై నిలిచింది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్ (14) మూడో స్థానానికి ఎగబాకింది. ఇక కోల్‌కతా, రాజస్థాన్ చెరో 16 పాయింట్లతో మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు ఈనెల 14న లఖ్‌నవూ-ఢిల్లీ జట్లు పరస్పరం తలపడనున్నాయి. ఈ రెండు జట్లలో ఒకదానికి 12 పాయింట్లు మించి లభించనున్నాయి. కాగా..12 మ్యాచ్‌లు ఆడిన ముంబై నాలుగు విజయాలు సాధించింది. మొత్తం ఎనిమిది పాయింట్లతో ప్రస్తుతం పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్న ఆ జట్టు..రెండింటిలో నెగ్గినా గరిష్ఠంగా 12 పాయింట్లే లభిస్తాయి. అందువల్ల ముంబై టాప్-4లో నిలిచే అవకాశాలు ఏమాత్రం లేవు.

క్వార్టర్స్‌లో మనికా



జెడ్డా: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనికా బత్రా సౌదీ స్మాష్ అంతర్జాతీయ టీటీ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గత మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన మనికా.. బుధవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 11-6, 11-9, 11-7తో ప్రపంచ 14వ ర్యాంకర్ నినా మితెల్హామ్ (జర్మనీ)ను చిత్తుచేసింది.

రైజర్స్‌.. మజాకా!

లక్ష్యం 166
9.4 ఓవర్లలోనే ఛేదన

హెడ్, అభిషేక్ విధ్వంసం

10 వికెట్లతో లఖ్‌నవూపై ఘన విజయం



అభిషేక్ (28 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సలతో 75 నాటౌట్)



హెడ్ (30 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సలతో 89 నాటౌట్)

1 ఐపీఎల్‌లో ఇదే అత్యంత వేగవంతమైన ఛేదన. మిగిలి ఉన్న బంతుల (62) పరంగా ఐపీఎల్‌లో ఇదే అత్యధిక విజయం. 2022లో పంజాబ్‌పై ఢిల్లీ 57 బంతులుండగానే గెలిచింది.

సన్‌రైజర్స్ చేసిన 167 పరుగులే ఐపీఎల్‌లో ఏ జట్టుకైనా తొలి 10 ఓవర్లలో అత్యధిక స్కోరు. ఈ సీజన్‌లోనే హైదరాబాద్ .. ఢిల్లీపై 158/4, ముంబైపై 148/2 స్కోర్లు చేసింది.

2 పవర్‌ప్లేలో అత్యధిక అర్ధ శతకాలు బాదిన రెండో బ్యాటర్‌గా హెడ్ (4). 6 హాఫ్ సెంచరీలతో వార్నర్ టాప్‌లో ఉన్నాడు.

హైదరాబాద్: పవర్ హిట్టింగ్‌తో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఉప్పల్‌లో మరోసారి పరుగుల మోత మోగించింది. కీలక మ్యాచ్‌లో ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సలతో 89 నాటౌట్), అభిషేక్ శర్మ (28 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సలతో 75 నాటౌట్) ఊచకోతతో.. 166 పరుగుల లక్ష్యాన్ని కేవలం 58 బంతుల్లోనే ఛేదించిన సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింతగా మెరుగుపరచుకొంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 10 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)ను మట్టికరిపించింది. తొలుత లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 165/4 స్కోరు చేసింది. ఆయుష్ బదోని (30 బంతుల్లో 9 ఫోర్లతో 55 నాటౌట్), నికోలస్ పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 48 నాటౌట్), కెప్టెన్ కేఎల్ రాహుల్ (29) రాణించారు. పొదుపుగా బౌలింగ్ చేసిన భువనేశ్వర్ (4-0-12-2) రెండు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ 9.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 167 పరుగులు చేసి అలవోకగా నెగ్గింది. ఐపీఎల్‌లో లఖ్‌నవూపై ఆరెంజ్ ఆర్మీకి ఇదే తొలి గెలుపు కావడం విశేషం. మొత్తం 14 పాయింట్లతో సన్‌రైజర్స్ మూడో స్థానానికి దూసుకెళ్లింది. హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

వికెట్ పడకుండా..: ఛేదనలో హెడ్, అభిషేక్ పోటీ పడి మరీ షాట్లు ఆడడంతో.. వార్ వన్‌సైడ్ అయింది. లఖ్‌నవూ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడిన వీరు.. ఫోర్లు, సిక్సలతో స్టేడియాన్ని హోరెత్తించారు. దీంతో హైదరాబాద్ 62 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. రెండో ఓవర్‌లో యశ్ బౌలింగ్‌లో అభిషేక్ నాలుగు ఫోర్లతో విధ్వంసానికి తెరతీయగా.. ఆ తర్వాతి ఓవర్‌లో హెడ్ 6,4,6,6తో ఏకంగా 22 పరుగులు పిండుకొన్నాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో అభిషేక్ సిక్స్ బాదగా.. హెడ్ 4,6తో జోరు చూపాడు. ఇక, 5వ ఓవర్‌లో నవీనుల్ బౌలింగ్‌లో శివాలెత్తిన హెడ్ సిక్స్, 4 ఫోర్లతో 23 పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 16 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. శర్మ కూడా మరో రెండు సిక్సలు బాదడంతో.. పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ 107/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మధ్య ఓవర్లలో కూడా వీరిద్దరూ ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో లఖ్‌నవూ బౌలర్లకు దిక్కుతోచలేదు. సిక్స్‌తో అభిషేక్ కూడా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. 9వ ఓవర్‌లోనే టీమ్ స్కోరు 150 దాటింది. అదే జోరులో శర్మ భారీ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకొన్న బదోని-పూరన్: సన్‌రైజర్స్ బౌలర్ల దెబ్బకు టాపార్డర్ విఫలమైనా.. ఆయుష్ బదోని ధనాధన్ అర్ధ శతకంతో లఖ్‌నవూ మెరుగ్గానే ముగించింది. పూరన్‌తో కలిసి డెత్ ఓవర్లలో చెలరేగిన బదోని.. ఐదో వికెట్‌కు 52 బంతుల్లో 99 పరుగుల అభేద్య భాగస్వామ్యంతో జట్టుకు పోరాడగలిగే స్కోరును అందించాడు. పవర్‌ప్లేలోనే ఓపెనర్ డికాక్ (2), స్టొయినిస్ (3)ను భువనేశ్వర్ అవుట్ చేయడంతో.. లఖ్‌నవూ స్కోరు నత్తనడకన సాగింది. హైదరాబాద్ ఫీల్డర్లు కూడా బౌలర్లకు చక్కని సహకారం అందించారు. బౌండ్రీ రోప్ వద్ద నితీశ్ అందుకొన్న అద్భుత క్యాచ్‌తో డికాక్ వెనుదిరగగా.. సన్వీర్ సింగ్ డైవింగ్ క్యాచ్‌తో స్టొయినిస్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి ఆరు ఓవర్లు ముగిసేసరికి లఖ్‌నవూ 27/2తో ఈ సీజన్‌లోనే అత్యల్ప పవర్‌ప్లే స్కోరు నమోదు చేసింది. అయితే, కెప్టెన్ రాహుల్‌కు జత కలసిన క్రునాల్ పాండ్యా (24) రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. 8వ ఓవర్‌లో ఉనాద్కట్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్సలు బాదిన క్రునాల్.. స్తబ్దుగా ఉన్న స్కోరుబోర్డులో ఊపుతెచ్చాడు. మరోవైపు ఫోర్‌తో గేర్ మార్చేందుకు యత్నిస్తున్న రాహుల్‌ను కమిన్స్ పెవిలియన్ చేర్చి దెబ్బకొట్టాడు. ఎదురుదాడి చేస్తున్న క్రునాల్‌ను కమిన్స్ రనౌట్ చేయడంతో 11.2 ఓవర్లలో లఖ్‌నవూ 66/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో పూరన్, బదోని పరిస్థితిని చక్కదిద్దే బాధ్యత తీసుకొన్నారు. నటరాజన్ వేసిన 14వ ఓవర్‌లో మూడు ఫోర్లు కొట్టిన బదోని 17 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లో విజయ్‌కాంత్ బౌలింగ్‌లో పూరన్ సిక్స్‌తో బ్యాట్‌కు పని చెప్పడంతో టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. ఇక, డెత్ ఓవర్లలో వీరిద్దరూ జోరు పెంచారు. 19వ ఓవర్‌లో బదోని 2 ఫోర్లతో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. చివరి ఓవర్‌లో పూరన్ మూడు బౌండ్రీలతో టీమ్ స్కోరును 160 మార్క్ దాటించాడు.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: రాహుల్ (సి) నటరాజన్ (బి) కమిన్స్ 29, డికాక్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 2, స్టొయినిస్ (సి) సన్వీర్ (బి) భువనేశ్వర్ 3, క్రునాల్ (రనౌట్) 24, పూరన్ (నాటౌట్) 48, బదోని (నాటౌట్) 55, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 165/4; వికెట్ల పతనం:** 1-13, 2-21, 3-57, 4-66; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-12-2, కమిన్స్ 4-0-47-1, షాబాజ్ 2-0-9-0, విజయ్‌కాంత్ 4-0-27-0, ఉనాద్కట్ 2-0-19-0, నటరాజన్ 4-0-50-0.

సన్‌రైజర్స్: అభిషేక్ (నాటౌట్) 75, హెడ్ (నాటౌట్) 89, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 9.4 ఓవర్లలో 167/0; బౌలింగ్:** కృష్ణప్ప 2-0-29-0, యశ్ ఠాకూర్ 2.4-0-47-0, రవి బిష్ణోయ్ 2-0-34-0, నవీనుల్ 2-0-37-0, బదోని 1-0-19-0.

మూడేళ్ల తర్వాత..



స్వదేశీ టోర్నీ బరిలో నీరజ్
ఫెడరేషన్ కప్‌లో ఒలింపిక్ చాంప్

న్యూఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా మూడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్వదేశంలో ఓ టోర్నీ బరిలో దిగుతున్నాడు. ఈనెల 12 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లో జరిగే ఫెడరేషన్ కప్‌లో వరల్డ్ చాంపియన్ నీరజ్ తలపడుతున్నట్టు నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. ఈమేరకు తన ఎంట్రీని చోప్రా ఖరారు చేసినట్టు తెలిపారు. ఈనెల 10న దోహాలో ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ సిరీస్ తొలి అంచె జరగనుంది. అందులో పోటీపడుతున్న స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్..అక్కడ నుంచి భారత్ రానున్నట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. 26 ఏళ్ల చోప్రా..2021లో భువనేశ్వర్‌లోనే జరిగిన ఫెడరేషన్ కప్‌లో చివరిసారి స్వదేశంలో తలపడ్డాడు. అప్పట్లో ఈటెను 87.80 మీ. దూరం విసిరిన అతడు స్వర్ణ పతకం సాధించాడు.

12 పరుగులకే ఆలౌట్

టీ20ల్లో మంగోలియా చెత్త రికార్డు

సనో (జపాన్): టీ20 క్రికెట్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా పసికూన మంగోలియా చెత్త రికార్డును మూటగట్టుకొంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జపాన్ నిర్దేశించిన 218 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. మంగోలియా 8.2 ఓవర్లలో 12 పరుగులకే కుప్పకూలింది. టుర్ సుమాయా (11 బంతుల్లో 4) టాప్ స్కోరర్. గతేడాది ఫిబ్రవరిలో స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగులకే ఆలౌటైన ఐజల్ ఆఫ్ మెన్స్ జట్టు టీ20 క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు నమోదు చేసింది.

శాంసన్‌కు జరిమానా



న్యూఢిల్లీ: ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌కు మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత పడింది. మంగళవారం ఢిల్లీతో మ్యాచ్‌లో 222 పరుగుల ఛేదనలో రాజస్థాన్ 20 పరుగులతో ఓడింది. అయితే ఈ మ్యాచ్‌లో శాంసన్ (86) ధాటిగా ఆడుతున్న సమయంలో 16వ ఓవర్‌లో బౌండ్రీ రోప్ వద్ద షాయ్ హోప్ తీసుకొన్న వివాదాస్పద క్యాచ్‌తో అతడు అవుటయ్యాడు. క్యాచ్ అందుకొంటున్నప్పుడు హోప్ కాళ్లు బౌండ్రీ రోప్‌ను తాకినట్టుగా కనిపించింది. కానీ, థర్డ్ అంపైర్ మాత్రం తనను అవుట్‌గా ప్రకటించడంపై సంజూ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఫీల్డ్ అంపైర్‌తో వాగ్వాదానికి కూడా దిగాడు. లెవల్-1 ఉల్లంఘన కింద అతడి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తూ రిఫెరీ నిర్ణయం తీసుకొన్నాడు.

టీ20 వరల్డ్ కప్

ఐర్లాండ్ కెప్టెన్ స్టిర్లింగ్

డబ్లిన్: వరల్డ్ కప్‌లో తలపడే ఐర్లాండ్ జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది సభ్యుల జట్టుకు వెటరన్ ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. వచ్చే నెల ఒకటి నుంచి వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న మెగా టోర్నీ గ్రూప్ 'ఎ'లో ఐర్లాండ్ తలపడనుంది. జూన్ ఐదున న్యూయార్క్‌లో జరిగే తమ తొలి మ్యాచ్‌లో భారత జట్టును ఐర్లాండ్ ఢీకొననుంది. ఇక మెగా టోర్నమెంట్‌కు న్యూగినీ జట్టును కూడా ప్రకటించారు. అసడోలా వాలా సారథ్యంలో న్యూగినీ కప్పు బరిలో దిగనుంది.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అప్పుల కుప్ప

జగన్ పాలనలో రాష్ట్రం రుణాల ఊబిలోకి

ఫీజుల కోసం 'తల్లు'డిల్లేలా!

అమ్మలకు ముడిపెట్టి ముంచేశారు

కడప బాద్‌షా ఎవరో?



12 13

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

గురువారం | 9-5-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ఇలా అనుకుంటే..

అప్పుడు హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నది నా కోరిక. ఇప్పుడు అమరావతిని, పోలవరాన్ని, పరిశ్రమల్ని అభివృద్ధి చేస్తే వాటి ఫలితాలు వస్తాయని అనుకున్నాం. దాన్ని వాళ్లు (ప్రజలు) అర్థం చేసుకోలేకపోయారా? నేను సరిగా చెప్పలేకపోయానా? తెలుగు వారిని ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలనేది నా అభిలాష. పేదరికంలేని తెలుగు సమాజాన్ని నిర్మించాలి. నా జీవితంలో చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకూ దీనికోసమే కృషి చేస్తాను.

అప్పుడు చెబితే నమ్మలేదు

జగన్ సైకో అని 2019 ఎన్నికల సమయంలోనే నేను చెప్పాను. అప్పుడు ఎవరూ పట్టించుకోలేదు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు నరసింహారావు జగన్ మనస్తత్వం మీద చాలా వ్యాసాలు రాశారు. అప్పుడు ప్రజలు విశ్వసించలేదు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ సైకో అంటున్నారు. -చంద్రబాబు

జయం మాదే!

వంద శాతం అధికారంలోకి వస్తున్నాం

జగన్ గెలిచే చాన్స్ 0.0001% కూడా లేదు

రాష్ట్రం కోసం పట్టుదలతో కృషి చేస్తా

అది నా బ్రాండ్, నా ట్రాక్ రికార్డ్

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ కాదు

జగన్ వ్యక్తిత్వం భయానకం!

2019లో చెప్పినా ఎవరూ నమ్మలేదు

సీరియల్ కిల్లర్ మనుషులను చంపితే.. జగన్ వ్యవస్థలను చంపేశాడు

హిట్లర్, తాలిబన్ల సరసన నిలిచే వ్యక్తి

రాష్ట్రంలో భయానక వాతావరణం

వేధింపులు, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి

అభివృద్ధి, సంక్షేమం సమతుల్యత.. ఇదే మా మోడల్

రాజకీయ రౌడీల తాట తీస్తా

జైలులోనే నన్ను చంపాలనుకున్నారు

ఏదేమైనా కానీ అనే ధైర్యంతో ఉన్నా

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' 'బిగ్ డిబేట్'లో చంద్రబాబు

నిద్రలేని రాత్రులు

నా మీద పెట్టిన ఒత్తిడి అంతా ఇంతా కాదు! ఐదేళ్లు కంటి మీద సరిగా కునుకులేదు. నేను ఎన్‌ఎస్‌జీ రక్షణలో ఉన్నా. అయినా నా ఇంటిపైన డ్రోన్స్ ఎగరేశారు. ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించారు. రాత్రిళ్లు జాగారం చేసిన రోజులు ఉన్నాయి. ఎవరినో ఒకరిని అరెస్టు చేశారని వార్త రావడం.. వారిని కాపాడుకోవడం.. వాళ్లను చంపకుండా, హింసించకుండా చూసుకోవడం! ఇలా నిద్రలేని రాత్రులు గడిపాను.

"నా రాజకీయ జీవితంలో ఎంతో పట్టుదలగా పని చేశా. ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అంతకుమించిన పట్టుదలతో కృషి చేస్తా" అని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు ఉద్ఘాటించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో పాల్గొన్నారు. తాజా రాజకీయ పరిస్థితులు, జగన్ వ్యవహార శైలి తదితర అంశాలపై స్పందించారు.

పూర్తి విశేషాలు 11లో..







బుధవారం రాత్రి విజయవాడలో జరిగిన రోడ్‌షోలో మోదీ, చంద్రబాబు, పవన్ అభివాదం

వైసీపీకి కౌంట్‌డౌన్

రాష్ట్రంలో ప్రజారాజ్యం లేదు.. మాఫియా రాజ్యమే: ప్రధాని

ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయింది

39 మంది చనిపోయారు.. 26 గ్రామాలు దెబ్బతిన్నాయి

ఈ మాఫియాలకు ప్రభుత్వ దన్ను.. ఎన్డీయే బుద్ధి చెబుతుంది

మంత్రులు రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నారు

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి.. కలికిరిలో భారీ సభ

అనంతరం విజయవాడలో 1.8 కిలోమీటర్ల అపూర్వ రోడ్‌షో

వాహనంపై ఆయనతో బాబు, పవన్.. భారీగా తరలివచ్చిన జనం

14

మన గెలుపును ఎవరూ ఆపలేరు!

జనంలో అవధుల్లేని ఉత్సాహం

ప్రభుత్వాన్ని మార్చాలని వారిలో బలమైన కోరిక: ప్రధాని

రోడ్‌షో ముగిశాక చంద్రబాబు, పవన్‌తో భేటీ

కూటమి వైపే ప్రజల మొగ్గు.. అత్యద్భుత విజయం సాధిస్తున్నాం

ఇక పోలింగ్‌పై దృష్టి సారించండి.. ఓటింగ్ బాగా పెరగాలి

ఉదయం 10లోపే ఎక్కువ జరగాలి.. ఇద్దరికీ మోదీ సూచనలు

ఆదివారం కుట్రలు

సెలవైనా బ్యాంకులు పనిచేయాలని ఆదేశం

ఎస్‌బీఐకి రాష్ట్ర ఆర్థిక శాఖ లేఖ

బటన్ నొక్కుడు డబ్బులు వేసేందుకేనా?

ఇన్నాళ్లూ ఉద్దేశపూర్వకంగానే నిలిపివేత

పోలింగ్ ముందురోజు జమ చేసేలా వ్యూహం!?

కోర్టులో తీర్పు, ఈసీ అనుమతి లేకున్నా పావులు

'హైలెస్సో హైలెస్స' చర్చలు దీనిపైనేనా?



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ ఎప్పుడో బటన్ నొక్కిన పథకాలకు ఇప్పటికీ డబ్బులు పడలేదు. సరిగ్గా ఎన్నికల సమయంలో డబ్బులు వేసి.. రాజకీయ లబ్ధి పొందే దిశగా వ్యూహం రచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఈ వ్యూహం ఫలించలేదు. అయినా సరే.. సర్కారు పెద్దలు 'ఆదివారం కుట్ర'లకు తెరలేపారు. సోమవారం ఎన్నికలు జరగనుండగా, ఒక్క రోజు ముందుగా ఆదివారం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం తమకోసం పనిచేయాలంటూ ఎస్‌బీఐకి ఆర్థిక శాఖ బుధవారం లేఖ రాసింది. మద్యం వ్యాపారంపై వచ్చిన డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేయాలని, దాదాపు రూ.200 కోట్లు ఉంటాయని లేఖలో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ లావాదేవీలు ఈ బ్యాంకు ద్వారానే జరుగుతాయి. ప్రస్తుతానికి ఎస్‌బీఐకి లేఖ రాసినా... మిగిలిన బ్యాంకులకు కూడా ఇదే విధమైన లేఖలు రాస్తారని తెలుస్తోంది. మద్యం డబ్బులు డిపాజిట్ చేయాలని పైకి చెబుతున్నా.. ప్రభుత్వ ఉద్దేశం వేరుగా ఉన్నట్టు తెలుస్తోంది. పోలింగ్ ముందు రోజు ఖాతాల్లో డబ్బులేసి ఓటర్లను ప్రభావితం చేయడం కోసమే ఈ ఎత్తుగడ వేసిందన్న సందేహాలొస్తున్నాయి. ఎందుకంటే.. బ్యాంకులకు వరుస సెలవులు రావడం కొత్తేమీ కాదు. ఎన్నికల ముందు రోజు, ఆదివారం పని చేయాల్సిన అవసరమూ లేదు. ఐదేళ్ల నుంచి లిక్కర్ వ్యాపారం ఇలాగే జరుగుతోంది. ఎన్నో రెండో శనివారాలు, ఆదివారాలు, వరుస సెలవులు వచ్చాయి. కానీ ఎప్పుడూ మద్యం డబ్బు డిపాజిట్ చేయడానికి ఆదివారం బ్యాంకులు పనిచేయాలని కోరలేదు. మరి... పోలింగ్‌కు ముందు రోజు మాత్రం పని చేయాలని కోరడంలో ఆంతర్యం ఏమిటి? ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రజల ఖాతాల్లోకి డబ్బులు వేయడాన్ని

మిగతా 2వ పేజీలో...

ఎన్నికల ముందే అత్యవసరంగా నిధుల పంపిణీ ఎందుకు?

కారణాలతో ఈసీకి తాజాగా వినతిని సమర్పించండి

దానిపై కోడ్ మేరకు నిర్ణయం.. ఈసీకి హైకోర్టు ఆదేశం



2

వేటు పడినా వీరభక్తుడే!

ఈసీ బదిలీ చేసినా జిల్లా ఎస్పీలపై జులుం

మేం చెప్పిందేంటి.. మీరు చేస్తున్నదేంటి?

మళ్లీ జగనే సీఎం.. కెరీర్ కోల్పోవద్దు

డీజీ ర్యాంకువారి దుస్థితి చూస్తున్నారుగా..

ఎస్పీలకు సీనియర్ ఐపీఎస్ బెదిరింపు

జగన్‌కు అనుకూలంగా ఉండాలని ఒత్తిడి

అందుకు కొందరు ఎస్పీలు ససేమిరా

'సారీ'.. హద్దు మీరలేం అని స్పష్టీకరణ

ఈసీ రిమార్క్ ఓసారి పడితే కష్టమని వెల్లడి

10

డీజీపీపై తాడేపల్లి 'నేత్రం'

పోలీస్ బాస్ ఆఫీస్‌లో ముగ్గురు వేగులు!

ప్రతి కదలికా స్కాన్.. ప్యాలెస్‌కు చేరవేత

పల్నాడులో నలుగురు పోలీసులపై వేటు

ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ బదిలీ.. మరో ఎస్ఐ సస్పెన్షన్

గొడ్డలితో అందరినీ నరికేయండి

అప్పుడు మీరొక్కరే బరిలో ఉండొచ్చు

జగన్ సతీమణి భారతిపై షర్మిల ధ్వజం

విదేశాలకు పారిపోయేందుకు అవినాశ్ రెడ్డి

పాస్‌పోర్టులు రెడీ చేసుకుంటున్నారని ఎద్దేవా

14



ఏపీ ప్రజల 'మన్‌కీబాత్' వినండి

మోదీకి రేడియో పంపిన పీసీసీ చీఫ్ షర్మిల

17న విదేశాలకు జగన్!

1 దాకా లండన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లో సీఎం దంపతుల పర్యటన

సీబీఐ కోర్టు అనుమతి కోరిన సీఎం.. ఈ నెల 6న పిటిషన్ దాఖలు

కౌంటర్ వేయాలని దర్యాప్తు సంస్థకు న్యాయస్థానం ఆదేశం

బుధవారం రోజంతా విశ్రాంతి తీసుకున్న జగన్!

14

ఏబీవీ సస్పెన్షన్ కొట్టివేత

వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్న క్యాట్

బకాయిలతో సహా జీత భత్యాలు చెల్లించాలని ఆదేశం



3



అబ్ కీ బార్?

ఐదో దశలో 695 మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఐదో దశ ఎన్నికలలో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల సంఘం బుధవారం తెలిపింది. 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 49 లోక్‌సభ స్థానాలకు ఐదో దశలో మే 20న ఎన్నికలు జరుగనున్నాయి. తొలుత 749 మంది అభ్యర్థుల నామినేషన్లను ఈసీ ఆమోదించింది. అయితే, పలువురు అభ్యర్థుల నామినేషన్ల విత్‌డ్రా తర్వాత తుదిపోరులో 695 మంది అభ్యర్థులున్నారని పేర్కొంది. ఐదో దశలో అత్యధికంగా యూపీలో 14, మహారాష్ట్రలో 13 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. పశ్చిమబెంగాల్(7), ఒడిశా, బిహార్(5), జార్ఖండ్(3), జమ్ముకశ్మీర్, లడఖ్‌లలో ఒక్కో స్థానానికి పోలింగ్ జరుగుతుంది.

అంబానీ, అదానీలపైకి
సీబీఐ, ఈడీని పంపండి!

- వారు డబ్బులు టెంపోల్లో పంపుతారన్నది.. మీ స్వీయానుభవమా మోదీజీ?: రాహుల్

న్యూఢిల్లీ, మే 8: కాంగ్రెస్ పార్టీకి అంబానీ, అదానీల నుంచి డబ్బులు అందాయని, అందుకే వారి పేర్లు ఎత్తడం మానేసిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ అంతే స్థాయిలో బదులిచ్చారు. ఆ ఇద్దరు వ్యాపారవేత్తలపై సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని ప్రధానికి సూచించారు. ఈ మేరకు రాహుల్ బుధవారం ఓ వీడియో మెసేజ్‌ను 'ఎక్స్'లో పోస్టు చేశారు. "మోదీజీ.. భయపడ్డారా? అంబానీ, అదానీల గురించి సాధారణంగా మీరు గడియ వేసుకొని మాట్లాడతారు. మొట్టమొదటిసారి వారి గురించి బహిరంగంగా మాట్లాడారు. వారు వాహనాల్లో (టెంపోల్లో) డబ్బు పంపిస్తారని కూడా మీకు తెలుసునన్నమాట! ఇది మీ స్వీయానుభవమా?" అని రాహుల్ వ్యాఖ్యానించారు. బీజేపీ 22 మంది కోటీశ్వరులను చేస్తే.. తాము కోట్ల మందిని కోటీశ్వరులను చేస్తామన్నారు. మరోవైపు మోదీకి ఓటమి కళ్లముందు కనిపిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దీంతో మోదీ తన నీడను చూసుకుని కూడా భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. కాగా, మోదీ ప్రధాని పీఠం కదులుతోందని అందుకే ఆయన తన సొంత స్నేహితులపై కూడా మాటల దాడి చేయడం మొదలుపెట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యానించారు. దేశంలో మూడు దశల పోలింగ్ ముగిసిన తర్వాత మోదీలో భయం మొదలైందని అన్నారు.

పల్నాడులో నలుగురు పోలీసులపై వేటు

- ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐని విధుల నుంచి తప్పించిన ఈసీ
- బల్లికురవ ఎస్ఐ సస్పెన్షన్



నాగశివారెడ్డి, ఎస్ఐ (ఫైల్)

బల్లికురవ, గుంటూరు, మే 8: ప్రతిపక్ష నేతలు ఇచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎన్నికల సంఘం నలుగురు పోలీసులపై వేటు వేసింది. ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐని తక్షణమే విధుల నుంచి తప్పించాలని ఈసీ ఆదేశించింది. మరొక ఎస్ఐని అధికారులు సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల తనిఖీ చెక్‌పోస్టు విధులకు అటాచ్‌కు వెళ్లిన ఎస్ఐ నాగశివారెడ్డిపై బుధవారం వేటు పడింది. బల్లికురవలో మార్చిలో చిరు దుకాణం వద్ద ఉన్న వృద్ధుడిపై ఎస్ఐ అకారణంగా దాడి చేశారు. గాయపడిన వృద్ధుడు ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చేరి ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా పోలీసు స్టేషన్‌లోనే ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వైసీపీ నేతతో ఎస్ఐ సన్మానం చేయించుకోగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల కమిషన్‌కు, గుంటూరు ఐజీకి ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై విచారణకు ఆదేశించిన ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్ఐను పర్చూరు మండలం అన్నంబొట్లపాలెం చెక్‌పోస్ట్ డ్యూటీకి ఆటాచ్ చేశారు. గత నెల 23న ఎస్ఐ నాగ శివారెడ్డి పర్చూరులో నామినేషన్ల డ్యూటీలో ఉండగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అనుచరుడిపై దుర్భాషలాడారు. ఈ సంఘటనపై ఏలూరి... ఎస్పీకి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వరుస ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అనంతరం ఎస్ఐని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మాచర్ల పోలీస్‌పై వేటు

రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో ఒకటైన పల్నాడులోని మాచర్ల నియోజకవర్గంలో ముగ్గురు పోలీసులపై ఎన్నికల కమిషన్ వేటువేసింది. ఖాకీ ముసుగులో వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నందుకు పర్యవసానంగా మాచర్ల టౌన్ సీఐ శరత్‌బాబు, కారంపూడి సీఐ చిన్నమల్లయ్య, వెల్దుర్తి ఎస్ఐ వంగా శ్రీహరిలు విధుల నుంచి తక్షణం తప్పుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

అత్యవసరంగా నిధుల పంపిణీ ఎందుకు?

- కారణాలతో ఈసీకి తాజాగా వినతిని సమర్పించండి: హైకోర్టు

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధులను ఎన్నికల ముందే అత్యవసరంగా ఎందుకు పంపిణీ చేయాలనుకుంటున్నారో కారణాలు పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తాజాగా వినతి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల కోడ్‌ను అనుసరించి ఆ వినతిపై నిర్ణయాన్ని వెల్లడించాలని ఈసీకి సూచించింది. వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ బుధవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికలు ముగిసేవరకు ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధుల పంపిణీని ఆపాలంటూ ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల అభ్యర్థన మేరకు ఆ వ్యాజ్యాలను న్యాయస్థానం లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. గత మూడేళ్లుగా ఆసరా, ఈబీసీ నేస్తం పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. నిధులు విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సీనుమన్ స్పందిస్తూ... పథకాల నిధుల పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయిందని పేర్కొన్నారు. పథకాల నిధులను ఎన్నికల ముందే అత్యవసరంగా ఎందుకు పంపిణీ చేయాలనుకుంటున్నారో కారణాలు పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వినతులు సమర్పిస్తే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ఈసీ తరఫు న్యాయవాది తెలిపారు.

దక్షిణాదివారు
ఆఫ్రికన్లలా కనిపిస్తారు

ఉత్తరాదివారు శ్వేతజాతీయుల్లా.. ఈశాన్యంలో చైనీయుల్లా.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా ఉంటారు

- కాంగ్రెస్ నేత శామ్‌పిట్రోడా వ్యాఖ్యలు
- శరీర వర్ణం ఆధారంగా అవమానిస్తే సహించేది లేదు: ప్రధాని మోదీ
- పార్టీ పదవికి పిట్రోడా రాజీనామా

న్యూఢిల్లీ, మే 8: ఎన్నికల వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత శామ్‌పిట్రోడా ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారారు! వారసత్వ పన్ను వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు ఇప్పటికే ఒకసారి తిప్పలు తెచ్చిపెట్టిన ఆయన.. తాజగా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశాన్ని ఎన్నో వైవిధ్యాలున్న దేశంగా అభివర్ణించే క్రమంలో.. దక్షిణభారతీయులు ఆఫ్రికన్లలా కనిపిస్తారని.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా, ఈశాన్య రాష్ట్రాల వారు చైనీయుల్లా, ఉత్తరాది వారు తెల్లవారిలా ఉంటారని వ్యాఖ్యానించారు. 'ద స్టేట్స్‌మన్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన.. "మన స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్‌వారితో పోట్లాడింది హిందూ దేశం కోసం కాదు.. లౌకిక దేశం కోసం. మతం ఆధారంగా ఏర్పడిన పాకిస్థాన్ పరిస్థితి ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం. మన మేమో ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్యానికి ఉదాహరణగా నిలిచాం. చిన్నచిన్న విభేదాలున్నా మనం ఈ 75 ఏళ్లూ చాలా సంతోషకరమైన వాతావరణంలో మనగలిగాం. ఎన్ని తేడాలున్నా మనందరం సహోదరులం. విభిన్న భాషలు, మతాలు, ఆచారాలు, ఆహారాన్ని పరస్పరం గౌరవించుకుంటాం" అని పేర్కొంటూ.. దేశ వైవిధ్యం గురించి చెప్పే క్రమంలో ఆఫ్రికన్లు, చైనీయులతో భారతీయులను పోల్చారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. భారతదేశ భిన్నత్వం గురించి చెప్పడానికి శామ్‌పిట్రోడా పోల్చిన తీరు పూర్తిగా తప్పు అని, ఆ పోలికలు ఆమోదయోగ్యం కానివని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు. ఆయన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. శరీర వర్ణం ఆధారంగా అవమానించడాన్ని ఈ దేశం సహించదని.. తాను అస్సలు సహించబోనని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రౌపది ముర్ము శరీర వర్ణం కారణంగానే.. కాంగ్రెస్ పార్టీ అప్పట్లో రాష్ట్రపతి పదవికి ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిందనే విషయం తనకు ఇప్పుడు అర్థమవుతోందని... ముర్ము చర్మం రంగు నల్లగా ఉంది కాబట్టి కాంగ్రెస్ నేతలు ఆమెను ఆఫ్రికన్‌గా భావించారని వ్యాఖ్యానించారు.



ఆలోచన విధానాన్ని బయటపెట్టుకొన్నారు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ఎక్స్'లో శామ్ పిట్రోడా వ్యాఖ్యల వీడియోను పోస్టు చేసి.. "నేను దక్షిణాదికి చెందిన దాన్నే. నేను ఇండియన్‌లాగానే కనపడతాను. మా బృందంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారున్నారు. వాళ్లూ భారతీయుల్లాగానే ఉంటారు. పశ్చిమభారతదేశానికి చెందిన నా కొలీగ్స్ కూడా భారతీయుల్లాగానే ఉంటారు. కానీ.. రాహుల్‌గాంధీ సలహాదారు, జాత్యహంకారి అయిన వ్యక్తికి మాత్రం మేమందరం ఆఫ్రికన్లలా, చైనీయుల్లా, అరబ్బుల్లా, తెల్లవారిలా కనపడతాం. మీ ఆలోచనాధోరణిని, వ్యక్తిత్వాన్ని బయటపెట్టుకున్నందుకు కృతజ్ఞతలు. ఇండీ కూటమీ.. సిగ్గుచేటు" అని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. అసోం సీఎం హిమంత ట్విటర్‌లో శామ్‌పిట్రోడాను ఉద్దేశించి.. "శామ్ భాయ్, నేను ఈశాన్య రాష్ట్రానికి చెందినవాడినే. నేను భారతీయుడిలాగానే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. కొందరు నెటిజన్లేమో.. 'దక్షిణాది ప్రజలు నల్లగా ఉంటారు' అంటూ గతంలో బీజేపీ నేత తరుణ్ విజయ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నారు. అయితే.. తన వ్యాఖ్యలు ఎన్నికల వేళ పార్టీకి ఇబ్బందికరంగా మారడంతో 'ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్' ఛైర్మన్ పదవికి పిట్రోడా రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆమోదించినట్టు జైరామ్ రమేశ్ తెలిపారు.

బీజేపీ పోస్టుపై వివాదం

బెంగళూరు, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఇటీవల బీజేపీ పెట్టిన ఓ పోస్టు వివాదాస్పదమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లను ముస్లింలకు అనుకూలంగా కాంగ్రెస్ మార్చనుందని అందులో పేర్కొన్నారు. ఆ పోస్టును తక్షణమే తొలగించాలని కర్ణాటక బీజేపీని రాష్ట్ర చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ మీనా ఆదేశించారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు, పార్టీ ఐటీసెల్ హెడ్ అమిత్ మాలవీయకు పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో పెట్టిన వివాదాస్పద పోస్టుపై హైగ్రౌండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ పోస్టును తొలగించాలని ఎన్నికల కమిషన్ సూచించినా కర్ణాటక బీజేపీ స్పందించలేదు. దీంతో 'ఎక్స్' సంస్థకు ఎన్నికల కమిషన్ మంగళవారం నోటీస్ ఇచ్చింది. ఐటీ యాక్ట్ 79(3)(బీ) ప్రకారం వివాదాస్పద పోస్టును తొలగించాలని ఈ నెల 5న ఈసీ సూచించింది.

మోదీపై ఆరేళ్లపాటు
అనర్హత వేటు వేయాలి

- సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ/చెన్నై, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రజలను రెచ్చగొట్టేలా, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉద్విగ్న, ఉద్రేగపూరిత ప్రసంగాలు చేస్తున్న మోదీపై ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టులో బుధవారం రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిని ఫాతిమా అనే మహిళ దఖలు చేశారు. మతం, దేవుళ్లు, ప్రార్థనా స్థలాల పేర్లు చెప్పి మోదీ ఓట్లు అడుగుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి గత నెల 9న యూపీలోని ఫిల్బిత్‌లో, 21న రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో మోదీ చేసిన ప్రసంగాలను ఆమె ఉదాహరణగా చూపారు. దీనిపై విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. మోదీపై ఎన్నికల కమిషన్ కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎన్నికల ప్రచారంలో మోదీ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఉపన్యాసాలిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

రెండేళ్లలో పలు పార్టీలు
కాంగ్రెస్‌లో విలీనం: పవార్

న్యూఢిల్లీ, మే 8: రాబోయే రెండేళ్లలో పలు ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌లో విలీనమవుతాయని లేదా ఆ పార్టీకి మరింత దగ్గరవుతాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ కూడా అదే బాటలో ఉందా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ తమ పార్టీకి, కాంగ్రెస్‌కు ఎలాంటి తేడా లేదని వ్యాఖ్యానించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు ఒకటేనని, రెండూ గాంధీ-నెహ్రూ సూత్రాలను ఆచరించేవేనని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కూడా భావ సారూప్య పార్టీలతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉన్నారని చెప్పారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవార్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీనిపై విపక్షమైన శివసేన (యూబీటీ) ఆచితూచి స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొంది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన ఆప్, సీపీఐ స్పందిస్తూ అది ఆయన సొంత అంచనా మాత్రమేనని వ్యాఖ్యానించాయి.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై
రేపు తీర్పు..

- జైలు నుంచి పాలన సాగించేందుకు సౌకర్యాలు కల్పించాలన్న పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ, మే 8: మద్యం కుంభకోణానికి సంబంధించి మనీ ల్యాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారానికి రిజర్వ్ చేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ధర్మాసనం.. ఇరు పక్షాల వాదనలు నమోదు చేసింది. 'ఈ నెల 10వ తేదీన మధ్యంతర ఉత్తర్వులను వెలువరిస్తాం. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా అదే రోజు విచారిస్తాం' అని ధర్మాసనం బుధవారం వెల్లడించింది. ఒకవేళ ఈ కేసులో మధ్యంతర బెయిల్ ఇస్తే ప్రభుత్వ అధికారిక విధులు నిర్వర్తించేందుకు అనుమతించబోమని.. ఫైళ్లపై సంతకాలు చేయకూడదని మంగళవారం విచారణ సందర్భంగా కోర్టు తెలిపింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓ పార్టీ అధినేతగా ప్రచారం చేసుకోవచ్చని సూచించింది. ఇదిలా ఉండగా, తిహాడ్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపేందుకు సీఎం కేజ్రీవాల్‌కు సౌకర్యాలు కల్పించాలంటూ వేసిన పిల్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. అంతేకాకుండా పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా కూడా విధించింది. న్యాయవాది శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం.. 'మేం ఎమర్జెన్సీ విధించాలా? సెన్సార్‌షిప్ లేదా మార్షల్ చట్టాన్ని అమలు చేయాలా? మీడియాకు, రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా మేమేలా ఆదేశాలిస్తాం?' అంటూ పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది.

మోదీ ఒక్క పథకమైనా తీసుకొచ్చారా?

- పదేళ్లలో ఒక్క సంస్థనైనా ప్రారంభించారా?
- బీజేపీ అంచనాలు తలకిందులవుతున్నాయి
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రియాంకాగాంధీ



రాయ్‌బరేలీలో ప్రియాంక ఎన్నికల ప్రచారం

రాయ్‌బరేలీ, మే 8: ప్రధాని మోదీ తన పదేళ్ల హయాంలో ఒక్క పథకాన్నైనా ప్రారంభించారా, ఒక్క సంస్థనైనా నెలకొల్పారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించిన వాటిని పేరు మార్చి అమలు పరిచినవి కాకుండా, మోదీ స్వయంగా మొదలుపెట్టిన ఒక్క పథకమైనా ఉంటే అదేమిటో చెప్పాలని ప్రధానికి సవాల్ విసిరారు. మూడు దశల ఎన్నికల తర్వాత దేశంలో మార్పు పవనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. బుధవారం ఆమె పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తొలగించి వాటిని ముస్లింలకు ఇస్తుందని, అయోధ్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తిరగరాస్తుందని మోదీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. వాస్తవాలను పట్టించుకోకుండా, ఊహాలోకంలో విహరిస్తూ ఆయన మాట్లాడుతున్నట్లు ఉందన్నారు. 'గత పది రోజులుగా గమనిస్తున్నా.. ఆయన ప్రసంగాలు ఊహాజనిత అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. దేశ ప్రజలంటే అతడికి గౌరవం లేదు. అందుకనే వాస్తవాలతో సంబంధం లేకుండా మాట్లాడుతున్నారు. మేం ప్రజల్నించి బర్రెలను గుంజుకుంటామని, వారి ఇళ్లలో ఆభరణాలు, సంపదను గుర్తించటానికి ఎక్స్‌రే మిషన్లను పెడతామని ఏదేదో చెబుతున్నారు. ప్రధాన మంత్రి అంతటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి కాకుండా మరెవరైనా ఇటువంటి మాటాలు మాట్లాడితే నవ్వుకుంటాం. కానీ, స్వయంగా ప్రధానే ఈ అబద్ధాలను నిజాలుగా ప్రజల్ని నమ్మించాలని చూస్తున్నారు' అని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని మారుస్తామని వారే చెప్పారు

బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని మీరట్ బీజేపీ అభ్యర్థి, కొందరు కేంద్రమంత్రులు బహిరంగంగా చెప్పారని ప్రియాంక గుర్తు చేశారు. 'రాజ్యాంగం వల్లనే దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. రిజర్వేషన్లు ఉన్నాయి. ఓటు హక్కు ఉంది. అటువంటి రాజ్యాంగాన్ని మార్చి ప్రజల హక్కులను బీజేపీ బలహీనపరచాలని చూస్తే ఊరుకోబోము. బీజేపీని ఆ పని చేయనివ్వం' అని ప్రియాంక స్పష్టం చేశారు. దేశంలో మార్పు పవనాలు కనిపిస్తున్నాయని.. అందుకనే 400 సీట్లకుపైగా అనే బీజేపీ అంచనాలు క్రమేణా తగ్గుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజానుకూల గ్యారెంటీలతో సాధారణ ప్రజలు ఎలా లబ్ధి పొందుతున్నారో చెప్పటానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలే ఉదాహరణ అని ప్రియాంక పేర్కొన్నారు.

బ్రిటిష్ రాజ్‌ను తలపిస్తున్న మోదీ పాలన

కేంద్రంలో బీజేపీ పాలన 'బ్రిటిష్ రాజ్'ను తలపిస్తోందని ప్రియాంక గాంధీ అన్నారు. మోదీ పాలనతో ప్రభుత్వ విధానాలను కేవలం కోటీశ్వరులను దృష్టిలో పెట్టుకొని రూపొందిస్తున్నారని, పేదలను, రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం ప్రియాంక రాయ్‌బరేలీలో తన సోదరుడు రాహుల్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. "ఐదేళ్లుగా అదానీ, అంబానీల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ.. ఎన్నికల ప్రచారంలో మాత్రం వారి పేర్లు తీయడం లేదు" అన్న మోదీ వ్యాఖ్యలపైనా ప్రియాంక స్పందించారు. "బడా పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కై వారి రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందే బీజేపీ" అంటూ ఎదురుదాడి చేశారు. బీజేపీ పరివారమంతా రాహుల్‌పై అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉందన్నారు.

'ఆదివారం' కుట్రలు!

(మొదటి పేజీ తరువాయి)

ఈసీ తప్పుబట్టింది. దీనిపై ఏపీ ప్రభుత్వం కోర్టుకెళ్లింది. ఆ కేసు ఇంకా కోర్టులోనే ఉంది. దానిపై గురువారం జరిగే విచారణ ఒక కొలిక్కి రాకముందే ప్రభుత్వం తమ సొంత రాజ్యాంగం ప్రకారం నిర్ణయాలు తీసుకుంటోంది. ఒకవేళ కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే, ఖాతాల్లో డబ్బులేయడానికి గురు, శుక్ర, శనివారం వరకు సమయం ఉంది. కానీ సరిగ్గా పోలింగ్‌కి ఒక్కరోజు ముందు సెలవు రోజైన ఆదివారం, కుదిరితే పోలింగ్ రోజు సోమవారం కూడా ఖాతాల్లో డబ్బులేయడం ఓటర్లను ప్రభావితం చేయడం కాదా? అనే విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ పంపిణీ ప్రక్రియ ఆగిపోతే ఇందుకు టీడీపీయే కారణమని బురదజల్లేందుకు కుట్ర పన్నినట్టు తెలుస్తోంది. పింఛన్ల విషయంలోనూ వైసీపీ ఇలాగే వ్యవహరించిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

ఈసీని సంప్రదించారా ?

పోలింగ్‌కి ఒక్కరోజు ముందు రాష్ట్రంలో బ్యాంకులు పనిచేయాలంటూ ఆదేశాలిచ్చేముందు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ప్రభుత్వం సంప్రదించిందా? అనే సందేహం వ్యక్తమవుతోంది. ఎన్నికల కోడ్ రాకముందు బటన్ నొక్కిన పథకాలకు నెలన్నర తర్వాత డబ్బులేసేందుకు అనుమతివ్వండంటూ సీఎస్ జవహర్ రెడ్డి ఈసీని సంప్రదించారు. మరి పోలింగ్‌కు ఒక్కరోజు ముందు ప్రజల ఖాతాలో డబ్బులేసేందుకు అనుకూలంగా బ్యాంకులను పనిచేయమని అడుగుతున్న ప్రతిపాదనను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారా? ఈసీ అనుమతితోనే బ్యాంకులకు ఆ రకమైన ఆదేశాలు జారీ చేశారా? లేదా జగన్ సర్కార్ సొంత రాజ్యాంగం అమలు చేయడానికే బరితెగించిందా?

ఆ 7,000 కోట్లు విదేశీ అప్పేనా?

పోలింగ్‌కు ఒక్కరోజు ముందు ఖాతాల్లో డబ్బులేయడానికి ప్రభుత్వం అప్పుల ద్వారా నిధులు సమీకరించుకోవడానికి సర్వం సిద్ధం చేసుకుంది. అధికారంలో ఉన్న ఐదేళ్లు అడ్డగోలు అప్పులతో రాష్ట్రాన్ని నిండా ముంచేసిన జగన్ సర్కార్ ఇప్పుడు కూడా పరిమితికి మించి అప్పులు చేస్తోంది. 37 రోజుల్లో రూ.13,000 కోట్ల అప్పులు తెచ్చింది. మరో రూ.7,000 కోట్ల అప్పులు తెస్తోంది. ఏపీఎండీసీలో వాటాలు విదేశీ ఇన్వెస్టర్‌కు అమ్మడం ద్వారా ఈ రుణం తీసుకురానుంది. ఈ నెల 2వ తేదీన స్టాక్‌మార్కెట్లో ఏపీఎండీసీ ద్వారా నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు జారీ చేసి రూ.7,000 కోట్లు విదేశీ అప్పు తెచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ అప్పు ఒకట్రెండు రోజుల్లో ఏపీఎండీసీ ఖాతాకు చేరుతుందని ప్రభుత్వ అంచనా. మంగళవారం ఆర్‌బీఐ ద్వారా రూ.3,000 కోట్ల అప్పులు తెచ్చారు. ఈ రూ.10,000 కోట్లను పోలింగ్‌కు ముందురోజు బ్యాంకుల ద్వారా ఖాతాల్లో వేయడానికి సీఎస్ జవహర్ రెడ్డి, ఆర్థిక శాఖ అధికారులు రావత్, సత్యనారాయణ బరితెగించారు. మంగళవారం కృష్ణానదిలో వీఐపీ బోటులో షికారు చేస్తూ జరిపిన రహస్య మంతనాలు కూడా ఇవే.

పింఛన్లపై ఈ శ్రద్ధ లేదెందుకో?

సెలవు రోజైనా సరే బ్యాంకులు పనిచేయించేలా ఆదేశాలిచ్చిన ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లపై ఈ శ్రద్ధ ఎందుకు చూపలేదు? ఏప్రిల్‌లో వృద్ధులను సచివాలయాల చుట్టూ తిప్పి 32 మంది ప్రాణాలు బలిగొన్నారు. మేలో బ్యాంకుల చుట్టూ తిప్పి వారిని ముప్పుతిప్పలు పెట్టారు. వృద్ధాప్య పింఛన్లను మొదటిప్రాధాన్యంగా తీసుకొని ఇవ్వాలని బ్యాంకులను ఎందుకు ఆదేశించలేదు? వృద్ధులు ఎదుర్కొన్న ఇబ్బందులన్నింటికీ కారణం చంద్రబాబే అని చెప్పడం కోసమే జగన్ ప్రభుత్వం అలా వ్యవహరించింది. కోడ్‌కు ముందే జగన్ బటన్ నొక్కినా లబ్ధిదారులకు ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయకుండా వారిని ఇబ్బందులకు గురి చేసి, ఇప్పుడు పోలింగ్ ముందురోజు ఖాతాల్లో వేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. అంటే.. జనం ఎన్ని ఇబ్బందులు పడినా జగన్‌కు రాజకీయ ప్రయోజనమే ముఖ్యం. ఏదైనా కారణంతో డబ్బుల పంపిణీ ఆగిపోతే ఇందుకు చంద్రబాబే కారణమని నిందించడానికి కుట్ర పన్నినట్టు తెలుస్తోంది.

హిందూ జనాభా తగ్గుముఖం

- 1950-2015 మధ్య 8% తగ్గుదల
- మైనారిటీల జనాభాలో పెరుగుదల
- ప్రధాని సలహామండలి అధ్యయనం

న్యూఢిల్లీ, మే 8: దేశంలో మెజారిటీ జనాభాగా ఉన్న హిందువుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించింది. 1950-2015 మధ్యకాలంలో 7.8% హిందువులు తగ్గిపోయినట్టు తెలిపింది. కానీ, మైనారిటీ జనాభా పెరిగినట్టు పేర్కొంది. పెరిగిన వారిలో ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కుల జనాభా ఉన్నట్టు తెలిపింది. జైనులు, పార్సీల జనాభా తగ్గుముఖం పట్టినట్టు పేర్కొంది. ఇదే సమయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో అక్కడి మెజారిటీ జనాభా పెరిగినట్టు తమ అధ్యయనంలో తెలిపింది. 1950-2015 మధ్య ముస్లిం జనాభా వాటా 43.15% పెరగ్గా, క్రిస్టియన్ జనాభా5.38%, సిక్కులు6.58% పెరిగినట్టు పేర్కొంది. బౌద్ధుల జనాభాలోనూ కొంత పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. హిందూ జనాభా విషయానికివస్తే 1950లో 84శాతం ఉన్న వీరు 2015నాటికి 78శాతానికి చేరినట్టు పీఎం సలహా మండలి పేర్కొంది. గత 65ఏళ్లలో 9.84% నుంచి 14.09శాతానికి ముస్లిం జనాభా పెరిగినట్టు తెలిపింది. మెజారిటీ జనాభా తగ్గుదలలో మయన్మార్ తొలి స్థానంలో ఉందని, ఇక్కడ 10% మెజారిటీ జనాభా తగ్గిందని, తర్వాత స్థానంలో భారత్ ఉందని తెలిపింది. మూడో స్థానంలో ఉన్న నేపాల్‌లో మెజారిటీ హిందూ జనాభా 3.6% తగ్గినట్టు పేర్కొంది. 167 దేశాల్లోని మెజారిటీ జనాభాపై చేసిన అధ్యయన వివరాలను పీఎం సలహా మండలి ఈ నెలలో విడుదల చేసింది. "భారత్‌లో మైనారిటీలకు రక్షణే కాకుండా వారి అభివృద్ధికీ ప్రభుత్వాలు దోహదపడుతున్నాయి"అని నివేదిక పేర్కొంది. భారత్‌లో హిందూ జనాభా తగ్గడం, మైనారిటీ జనాభా పెరగడానికి కారణాలు తెలియదని, కేవలం సంఖ్యాపరంగానే అధ్యయనం చేసినట్టు తెలిపింది.

మూకుమ్మడి సెలవులతో 90 విమానాలు రద్దు

- ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో 300 మంది సిక్‌లీవ్.. వివరణ కోరిన డీజీసీఏ

న్యూఢిల్లీ, మే 8: టాటాగ్రూప్ టేకోవర్ చేసిన విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది మూకుమ్మడి సెలవులు పెట్టడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా 90కిపైగా విమానాలు రద్దయ్యాయి. వీటిలో అంతర్జాతీయ విమానాలూ ఉన్నాయి. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాలన్నీ రద్దవడంతో మళయాలీలు విమానాశ్రయాల్లో ఆందోళన చేశారు. అక్కడి ప్రయాణికులతో తమ సిబ్బంది సమ్మెలో ఉండడంవల్ల ఈ పరిస్థితి నెలకొందని అధికారికంగా చెప్పిన ఎయిరిండియా.. ఆ తర్వాత ఓ పత్రికా ప్రకటనలో సిబ్బంది మూకుమ్మడి సెలవులే కారణమని పేర్కొంది. "విమానాల్లో ప్రయాణికులకు సేవలందించే 300మంది వరకు సిబ్బంది మూకుమ్మడిగా సిక్‌లీవ్‌లు పెట్టారు. దీంతో పలు సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. ప్రయాణికుల టికెట్ ధరను పూర్తిగా రిఫండ్ చేస్తాం. లేదా వారు కోరుకున్న తేదీకి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తాం" అని ఎయిరిండియా అధికార ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రద్దు ప్రభావం కేరళీయులపై ఎక్కువగా పడింది. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే విమానాలన్నీ రద్దవడంతో ప్రయాణికులు గగ్గోలు పెట్టా రు. "సెక్యూరిటీ, బ్యాగేజ్ చెక్ఇన్, ఇమిగ్రేషన్ పూర్తయ్యాక.. విమానం రద్దు సందేశం వచ్చింది. నేను గురువారమే నా ఉద్యోగంలో చేరాలి. లేకుంటే నా కొలువు ఊడిపోతుంది" అని కన్నూరుకు చెందిన ఓ మహిళ వాపోయారు. కొందరు ప్రయాణికులకు ఈ నెల 14 నుంచి 17 తేదీల్లో విమాన ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది. సిబ్బంది సమ్మెకు వెళ్తున్న విషయం తమకు 2 గంటల ముందే తెలిసిందని పేర్కొంది. కాగా ఆ తేదీల్లోగా తమ వర్క్‌వీసా గడువు ముగిసిపోతుందని, అదే జరిగితే తమకు ఆత్మహత్య తప్ప మరో మార్గం ఉండదని పలువురు ప్రయాణికులు వాపోయారు. ప్రయాణికుల అవస్థలు చూసిన కేరళ సర్కారు, విపక్ష పార్టీలు కేంద్ర విమానయాన మంత్రికి లేఖలు రాశాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాయి.

లోకం తీరు



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏబీవీ సస్పెన్షన్ కొట్టివేత

- వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్న క్యాట్
- బకాయిలతో సహా జీతభత్యాలు చెల్లించాలని ఆదేశం
- వైసీపీ ప్రభుత్వ ఉత్తర్వులు అక్రమమని తీర్పు
- సీనియర్ ఐపీఎస్ అధికారికి భారీ ఊరట



హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్, అదనపు డీజీ ఏబీ వెంకటేశ్వరరావుకు హైదరాబాద్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్(క్యాట్)లో భారీ ఊరట లభించింది. ఆయనపై రెండోసారి సస్పెన్షన్ విధిస్తూ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అక్రమమని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఆయన్ను వెంటనే సర్వీసులోకి తీసుకోవడంతోపాటు బకాయిలతో సహా జీతభత్యాలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. ఒకేరకమైన ఆరోపణలతో రెండోసారి సస్పెండ్ చేయడం చెల్లదని.. ఏపీ ప్రభుత్వం జారీచేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టేయాలని కోరుతూ ఏబీ వెంకటేశ్వరరావు క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు వాదనలు వినిపిస్తూ.. రక్షణ పరికరాల కొనుగోళ్లలో అవినీతి అంటూ 2020 ఫిబ్రవరి 8న ఏపీ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ విధించిందన్నారు. అంతుకుముందు జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 8 నెలలపాటు వేతనం, పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. 33 ఏళ్లపాటు మచ్చలేని ఉద్యోగ జీవితంలో మొదటిసారి అవినీతి ఆరోపణలు సృష్టించి సస్పెండ్ చేశారని, ఈ సస్పెన్షన్ అక్రమమని ఏపీ హైకోర్టు కొట్టేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సైతం పిటిషనర్‌కే అనుకూలంగా తీర్పు ఇచ్చిందని.. ఆయన సస్పెన్షన్ చెల్లదని 2022 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రెండునెలలకు(జూన్ 14న) ప్రాధాన్యం లేని పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత కేవలం 14 రోజుల్లోనే మళ్లీ రెండోసారి సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని, ఈసారి అఖిలభారత సర్వీసుల్లోని రూల్ 3(3)ను సాకుగా చూపారని పేర్కొన్నారు. 'నిబంధనల ప్రకారం సస్పెన్షన్‌పై టైం టు టైం అధికారుల కమిటీ రివ్యూ చేయాల్సి ఉన్నప్పటికీ 21 నెలలుగా ఎలాంటి రివ్యూ చేయలేదు. ఏపీ ప్రభుత్వ అనైతిక విధానాలపైనా, రెండోసారి సస్పెన్షన్‌పైనా మళ్లీ క్యాట్ లో పిటిషన్ దాఖలు చేశాం. ఈ కేసును సైతం ఆలస్యం చేయడానికి ఏపీ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేసింది. సస్పెన్షన్ చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత మళ్లీ అవే ఆరోపణలతో రెండోసారి సస్పెండ్ చేయడం చెల్లదు. సర్వీస్ రూల్స్‌లో పేర్కొన్న ప్రకారం రివ్యూ చేయలేదు కాబట్టి ఆ సస్పెన్షన్ చెల్లదు. సస్పెన్షన్ ఏకపక్షంగా కొనసాగించడానికి వీలుండదు' అన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. 'ఏబీ వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టు తీర్పు తర్వాత విధుల్లో చేరేముందు ప్రెస్‌మీట్ పెట్టి బెదిరించేలా మాట్లాడారు. దర్యాప్తును ప్రభావితం చేసే విధంగా వ్యవహరించారు. క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్న పిటిషనర్‌పై దర్యాప్తు ముగిసే వరకు సస్పెన్షన్‌లో ఉంచే అధికారం ఉంది. మొదటిసారి రూల్ 3(1) కింద.. రెండోసారి రూల్ 3(3) కింద సస్పెండ్ చేశాం' అని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న క్యాట్.. ఏప్రిల్ 29న తీర్పును రిజర్వు చేసి.. బుధవారం తుది తీర్పు వెలువరించింది.

తోట త్రిమూర్తులు 'జైలుశిక్ష నిలుపుదల' పొడిగింపు

- విచారణ జూన్ 20కి వాయిదా

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): దళిత యువకులకు శిరోముండనం చేయడంతో పాటు మీసాలు-కనుబొమ్మలు తీయించిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మందికి ఏడాదిన్నర పాటు జైలుశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేస్తూ విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు జూన్ 20 వరకు పొడిగించింది. కౌంటర్లు దాఖలు చేయాలని బాధితులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మందిని దోషులుగా నిర్ధారించి విశాఖపట్నం ఎస్సీ-ఎస్టీ ప్రత్యేక కోర్టు ఏడాదిన్నరపాటు జైలుశిక్ష తో పాటు రూ.42 వేలు జరిమానా విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో ఎనిమిది మంది హైకోర్టులో అప్పీల్ వేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా అప్పీళ్లపై ఏమైనా అభ్యంతరాలుంటే దాఖలు చేసుకోవాలని బాధితులకు హైకోర్టు సూచించింది. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది చిదంబరం వాదనలు వినిపిస్తూ.. జైలుశిక్ష అమలును నిలుపుదల చేస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఈ నెల 15తో ముగుస్తాయన్నారు. ఆ తరువాత పిటిషనర్లను అరెస్ట్ చేసే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో జైలు శిక్ష అమలును నిలుపుదల చేస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జూన్ 20వరకు పొడిగిస్తామని న్యాయమూర్తి ప్రతిపాదించారు. దీనిపై బాధితుల తరఫు న్యాయవాదులు జవ్వాజి శరత్‌చంద్ర, వై.కోటేశ్వరరావు, పిచ్చుక శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. తామ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయవద్దని కోరారు. ఈ వాదనలను న్యాయమూర్తి తోసిపుచ్చారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించడం వల్ల నష్టమేమీ ఉండదన్నారు. బాధిత యువకుల వాదనలు విన్న తరువాతే వ్యాజ్యాల పై తుది నిర్ణయం వెల్లడిస్తామన్నారు. శిక్ష అమలును నిలుపుదల చేస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జూన్ 20 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.

పాలిసెట్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- అర్హులు 87.61% .. ఆరుగురికి మొదటి ర్యాంకు

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్-2024లో బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,42,035 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కాగా.. వారిలో 1,24,430 మంది (87.61 శాతం) అర్హత సాధించారు. బాలికలు 56,464 మంది పరీక్ష రాయగా వారిలో 50,710 మంది (89.81 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 85,561 మందికి గాను 73,720 మంది (86.16) శాతం అర్హత సాధించారు. పాలిసెట్‌లో 120 కి 120 మార్కులు సాధించి ఆరుగురు విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చల్లా నాగవెంకట సత్యశ్రీవర్ధిని, జొన్నలగడ్డ యశ్వంత్‌సాయి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పులఖందం మోహిత్ కృష్ణసాయి, కుమ్మరపురుగు లోకేష్ శ్రీహర్ష, విశాఖ జిల్లాకు చెందిన శీలం శ్రీరామ్ భావదీప్, పోతుల జ్ఞానహర్షిత మొదటి ర్యాంకు సాధించారు. జిల్లాలవారీగా చూస్తే.. విశాఖపట్నం జిల్లా నుంచి అత్యధికంగా 87.17 శాతం మంది అర్హత పొందగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 70.46 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాలను బుధవారం అమరావతిలోని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఛైర్‌పర్సన్ చదలవాడ నాగరాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ర్యాంకు కార్డులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు.



తొడలోకి చొచ్చుకుపోయిన చెట్టుకొమ్మ

కర్నూలు(హాస్పిటల్), మే 8: రోడ్డు ప్రమాదంలో చెట్టుకొమ్మ తొడలోకి చొచ్చుకుపోయి తీవ్రరక్తస్రావానికి గురైన యువకుడికి కర్నూలు ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి చెట్టు కొమ్మను తొలగించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామ శివారులో ఈ నెల 2వ తేదీన ఇసుక ట్రాక్టర్ తిరగబడడంతో అదే గ్రామానికి చెందిన మాలిక్‌బాషా(19) కుడి తొడలోకి చెట్టు కొమ్మ చొచ్చుకుని పోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడిని బంధువులు గద్వాల సమీపంలోని మానవపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా జనరల్ సర్జరీ యూనిట్-4 చీఫ్ ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి నేతృత్వంలో వైద్య బృందం ఆపరేషన్ చేశారు. మూడున్నర గంటల పాటు శ్రమించి తొడలోకి చొచ్చుకుపోయిన చెట్టుకొమ్మను తొలగించారు. శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ హరిచరణ్ అభినందించారు.

మందుబాబులను వారించబోతే

గొంతు కోసేశారు

- ప్రాణాపాయ స్థితిలో యువకుడు
- నంద్యాలలో పట్టపగలే దారుణం



యువకుడి గొంతుకోసి ఆపై దాడికి పాల్పడుతున్న నిందితుడు

నంద్యాల (నూనెపల్లె), మే 8: నంద్యాల జిల్లా కేంద్రంలో పట్టపగలే దుండగులు రెచ్చిపోయారు. నంద్యాల పట్టణం ప్రతాప్ థియేటర్ సమీపంలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు హల్‌చల్ చేశారు. బార్‌లో మద్యం సేవించి గొడవకు దిగడంతో అక్కడే ఉన్న మరో యువకుడు వారించడంతో అతనిపై నిందితులు దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నంద్యాల పట్టణంలోని గుడిపాటిగడ్డ వీధికి చెందిన బాబాఫక్రుద్దీన్ అనే యువకుడు భవననిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో గొడవకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న బాబాఫక్రుద్దీన్ వారిని నిలువరించే ప్రయత్నం చేయగా ఆ ముగ్గురు బాబాఫక్రుద్దీన్‌పై దాడికి తెగబడ్డారు. వారిలో ఒకరు బీరుసీసాతో దాడిచేసి గొంతుకోయడంతో బాబాఫక్రుద్దీన్ తీవ్ర రక్తస్రావంతో నడిరోడ్డుపై స్పృహకోల్పోయా డు. మరో యువకుడు అతనిపై అందరూ చూస్తుండగానే కాలితో గొంతుపై తొక్కాడు. స్థానికులు వారిస్తున్నా మద్యం మత్తులో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో దాడి చేసి నిందితులు పరారయ్యారు. వారిలో రౌడీషీటర్ మధురాజు ఉన్నట్టు స్థానికులు తెలిపారు. గాయపడిన బాబాఫక్రుద్దీన్‌ను స్థానికులు నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి కర్నూలుకు తరలించగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పిడుగుపాటుకు 40 గొర్రెలు మృతి

- నేడూ సీమ, ఉత్తరాంధ్రలో వర్షాలు



(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): తమిళనాడు పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మీదుగా కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. సీతారామపురం మండలం పడమటి రొంపిదొడ్ల గ్రామంలో పిడుగుపాటుకు 40 గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లాలోని వరికుంటపాడులో అత్యధికంగా 90.2 మి.మీ వర్షం కురిసింది. రాష్ట్రంలో అనేకచోట్ల ఎండతీవ్రత కొనసాగినా వడగాడ్పుల ప్రభావం లేకపోవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. కాగా, గురువారం అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా.. సోమవారం దాకా 259 మిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ మంగళవారం 215.027 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. డిమాండ్‌ను తట్టుకునేందుకు రూ.28.967 కోట్లతో 7.679 మిలియన్ యూనిట్ల కరెంటును బహిరంగ మార్కెట్లో డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి.

పింఛన్‌కు వెళ్లి తిరిగిరాని లోకాలకు.!

- నెల్లూరు, అనకాపల్లి జిల్లాల్లో ఇద్దరు మృతి

నెల్లూరు (వైద్యం)/చోడవరం, మే 8: వృద్ధాప్య పింఛను కోసమని తిరుగుతూ ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. నెల్లూరులోని ఏసీ నగర్‌కు చెందిన ఎల్లోజి వెంకయ్య (75) ఈ నెల నాలుగో తేదీన పింఛను డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లి ఎండతీవ్రతకు స్పృహ కోల్పోయి, మృతి చెందారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన తోలేటి పద్మావతి (64) పింఛను కోసం బ్యాంకుకు వెళ్లగా భర్త చనిపోయినట్టు సర్టిఫికెట్ ఇవ్వాలని సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె కొద్దిరోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఇంటి వద్దే ఆమె మృతిచెందారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్లాస్టిక్‌పై విఫలపోరు

ప్లాస్టిక్‌ని భూతం అంటాం కానీ, దాన్ని అంతం చేయడానికి మాత్రం మనసొప్పడం లేదు. ప్లాస్టిక్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయాలన్న సదాశయంతో రెండేళ్ళక్రితం ప్రపంచదేశాల మధ్య ఒక ప్రయత్నం ఆరంభమైంది. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఉన్న 175దేశాల ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పడి, ఈ ఏడాది చివరకల్లా ప్లాస్టిక్ విషయంలో ఒక విధాన నిర్ణయానికి రావాలని సంకల్పించాయి. ఇప్పటివరకూ మూడువిడతల చర్చలు జరిగినప్పటికీ ఈ భూతాన్ని అంతం చేసి భవిష్యత్తును కాపాడుకొనే విషయంలో ఈ దేశాలు ఒకేతాటిపైకి రాలేకపోయాయి. గతవారం కెనడాలో నాలుగోవిడత చర్చలు కూడా విఫలం కావడాన్ని బట్టి ప్లాస్టిక్ పరిశ్రమకు రాజకీయంగా,ఆర్థికంగా ఎంతబలం ఉన్నదో అర్థమవుతుంది.

దక్షిణకొరియాలో ఈ నవంబరులో మరోవిడత చర్చలు జరగబోతున్నప్పటికీ, ఈ ఏడాది ముగిసేలోగా 'గ్లోబల్ ప్లాస్టిక్స్ ట్రీటీ' సాధ్యమయ్యే అవకాశాలైతే లేవు. ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం, భారీ వ్యర్థాలను మిగల్చే చోట్ల తయారీని పూర్తిగా మానివేయడం, ఉత్పత్తిలో భాగంగా హానికర రసాయనాల వాడకాన్ని ఆపివేయడం, హెచ్చుస్థాయిలో రీసైక్లింగ్ లక్ష్యాలను నిర్ణయించుకోవడం ఇత్యాది అంశాల్లో నిర్దిష్టమైన గడువులను విధించుకోవాలన్నది ఈ దేశాల తాపత్రయం. ఏయే లక్ష్యాలను ఎప్పటిలోగా సాధించాలో తెలియచెబుతున్న ఒక ఆచరణసాధ్యమైన ఒప్పందాన్ని అన్నిదేశాలు కలసికట్టుగా సాధించగలిగితే అంతకంటే అద్భుతం మరొకటి లేదు. కానీ, సహజంగానే ఆర్థికం దీనికి అడ్డుపడింది. చమురు ఉత్పత్తి దేశాలతో పాటు దానిని భారీగా శుద్ధిచేస్తూ లాభపడుతున్న దేశాలు ఒక అవగాహనకు రాకుండా మోకాలడ్డుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తిని నిలిపివేసే విషయంలో గడువులు విధించడాన్ని మిగతా కొన్ని దేశాలతో పాటు భారత్ కూడా వ్యతిరేకిస్తోందని వార్తలు వచ్చాయి. 2040ను లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటినుంచే ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించడం, లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందని ఆఫ్రికన్ దేశాలతోపాటు, అనేక యూరోపియన్ దేశాలు కూడా భావించాయట. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలంటే ప్రత్యామ్నాయాలను అభివృద్ధిపరచాలని, అవి తక్కువ ఖర్చుతో కూడుకున్నవై సులభంగా అందుబాటులో రావాలని భారత్ భావిస్తోంది. సదరు ప్రత్యామ్నాయాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడంతో పాటు అది సులభంగా మిగతాదేశాలకు బదిలీకావాలని కూడా భారత్ అంటోంది. ఉమ్మడి లక్ష్యమే అయినప్పటికీ ధనికదేశాలు, అధిక ఉత్పత్తిదేశాలు ఎక్కువ బాధ్యతలను పంచుకోవాలన్నది ప్రతిపాదన.

ప్లాస్టిక్ కాలుష్యం మీద అన్ని దేశాలదీ ఒకే అభిప్రాయం. మానవ మనుగడను ప్రమాదంలో పడేస్తున్న దీనిని పూర్తిగా నిషేధించుకోవాలన్న విషయంలోనూ భేదాభిప్రాయాలు లేవు. కానీ, లక్ష్యసాధన దిశగా అడుగులు ఎలావేయాలన్న విషయంలో ఒక్కమాట సాధ్యపడటం లేదు. పెట్రో కెమికల్ పరిశ్రమ బలంగా ఉన్నదేశాలు ప్లాస్టిక్ తయారీమీద నియంత్రణలు విధించాలన్న ప్రతిపాదనను ఏమాత్రం పడనీయడం లేదు. అభివృద్ధి చెందుతున్నదేశాలకంటే ధనికదేశాల్లో ప్లాస్టిక్ పరిశ్రమ వెలిగిపోతున్నది కనుక అవి ప్రతీ ఆలోచనకూ అడ్డుపడుతున్నాయి. పేద దేశాలతో పోల్చితే అభివృద్ధిచెందిన దేశాల్లో మరిన్ని వందల రకాల ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉంటూ, అక్కడి జనజీవనంతో మిళితమైపోయాయి. వినియోగరంగాన్ని, ఆర్థికాన్ని ప్లాస్టిక్ శాసిస్తోంది.

ప్లాస్టిక్స్ ఒప్పందం ప్రతిపాదన ముందుకు కదిలిన 2022లో భారతదేశం 19రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. మరిన్నింటిని కూడా చేర్చవలసిన అవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శించిందని అప్పట్లోనే పర్యావరణ ఉద్యమకారులు విమర్శించారు. ఆ తరువాత కాలంలో ఈ నిషేధం కూడా దేశవ్యాప్తంగా ప్రభావవంతంగా అమలుజరగలేదు. మట్టిలో కలవదనీ, మనిషిప్రాణానికి మహాప్రమాదకారనీ, పర్యావరణాన్ని నాశనం చేస్తోందనీ ప్లాస్టిక్ గురించి భయపడని క్షణం లేదు, తిట్టుకోనిరోజు ఉండదు. దాని తయారీ భూతాపాన్ని తీవ్రంగా హెచ్చిస్తోంది. ప్లాస్టిక్ ఉత్పత్తి ఏయేటికాయేడు పెరిగిపోతూ, ఏటా మరింత చెత్త చేరుతూంటే, మొత్తం ప్లాస్టిక్స్‌లో పదోవంతు కూడా రీసైకిల్ కావడం లేదు. ఈ విషవలయంనుంచి ప్రజలను రక్షించి ఒడ్డునపడేయాల్సిన ప్రభుత్వాలు ఇలా నిమ్మకునీరెత్తినట్టు ఉండటం విషాదం.


వికసిత్ ఆంధ్రను సాకారం చేసే మేనిఫెస్టో!

మద్రాసు నుంచి తరిమి వేయబడ్డ ఆంధ్రులు, కర్నూలులో గుడారాలలో కొన్నాళ్ళ పాలన సాగిన తర్వాత, హైదరాబాదుకు మూటాముల్లె సర్దుకుని వెళ్లారు, తెలంగాణ నుంచి మరో మారు తరిమివేయబడ్డారు. 2014 నుంచి 2019 ఆంధ్ర పునర్నిర్మాణానికి కేంద్రం సహకారంతో పునాదులు పడి అవి సౌధాలుగా మారాయి. కానీ ఈ సౌధాలకు తుదిమెరుగులు దిద్దే సమయానికి 2019లో ప్రజలు మార్పు కోరుకున్నారు. అక్కడ తప్పటడుగు పడింది. వినాశకర పాలన ఫలితంగా రాష్ట్రానికి 10లక్షల కోట్ల రూపాయల అప్పులు మిగిలాయి.

తాగు సాగు నీటి ప్రాజెక్టులు, కొత్త రోడ్లు, పాత రోడ్ల మరమ్మత్తులు, కొత్త కాలువలు, పాత కాలువల పూడికతీతలు... ఇవేవీ లేవు. ఉపాధి ఊసు లేదు. వలస కూలీలకు వెసులుబాటు లేదు. కొత్త పరిశ్రమలు లేవు. ఇసుక, మట్టి తవ్వకాలు, సారాయి, గంజాయి అమ్మకాలు ప్రభుత్వ ఆదాయ మార్గాలయ్యాయి. ఇసుక, మట్టి దందాలతో నిర్మాణరంగం స్తంభించింది. రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలింది. రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆదాయం కోసం భూమి విలువ పెంచడంతో రిజిస్ట్రేషన్ల చార్జీలు, ఇంటి పన్నులు, ఇంటి అద్దెలు, నీటి పన్ను, చెత్త పన్ను, కరెంటు బిల్లులు తారాస్థాయికి చేరాయి. వ్యవసాయం దెబ్బతినడంతో నిత్యావసరాల ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే ఉచితాలతో బిడుగులు బతకాల్సిన పరిస్థితి. ప్రజల ఆదాయ మార్గాలు తగ్గిపోవడంతో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వైసీపీ పాలన వల్ల దిగజారిన దీనహీన స్థితి నుంచి తెలుగుజాతి బయటపడే అవకాశం 2024 ఎన్నికల రూపంలో తలుపు తట్టింది.

వైసీపీ ప్రభుత్వాన్ని రాజ్యాంగబద్ధంగా సాగనంపడానికి, నిర్దిష్టమైన ప్రణాళికతో అభివృద్ధి సాధించడానికి, జగన్మోహన్ రెడ్డి వ్యతిరేక ఓటు చీలకుండా ఉండటానికి బీజేపీ, తెలుగుదేశం, జనసేన జతకట్టాయి. ప్రస్తుతం ప్రజలు ఆర్థికంగా అధమ స్థాయిలో ఉన్నారు. వారు జవసత్వాలు పుంజుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి కూటమి తయారు చేసిన ఐదేళ్ల ఆర్థిక ప్రణాళిక – మేనిఫెస్టో.

మేనిఫెస్టోలో పేర్కొన్న చర్యలన్నీ అప్పుల భారంతో కుంగిపోయిన రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టేందుకు, అసమర్థ పాలనతో ఎన్నో విధాలుగా నష్టపోయిన ప్రజలకు ఆసరాగా నిలబడేందుకు ఉద్దేశించబడినవి. బియ్యం, కూరగాయలు, పప్పు ధాన్యాలు వంటి నిత్యావసరాల ధరలు తగ్గటానికి తక్షణ కర్తవ్యంగా కేంద్ర గోడౌన్లలో ఉన్న నిత్యావసరాల నిల్వలను కేంద్రం సహకారంతో, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో సరసమైన ధరలకు సరఫరా చేస్తారు. రైతులకు ఆర్థిక వెసులుబాటుగా ప్రతి ఏడాది రూ.20వేల పెట్టుబడి సాయం చేస్తారు. తాగు, సాగునీటి ఎద్దడి లేకుండా ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపడతారు. అలాగే కాలువలలో పూడిక తీసే కార్యక్రమాలతో కూలీలకు ఉపాధి కల్పిస్తారు. కౌలు రైతులకు కార్డులు ఇస్తారు. తొమ్మిది గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు ఇస్తారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, సబ్సిడీ ధరలపై విత్తనాలు, ఎరువులు, రైతులకు, పంటలకు బీమా, వెంటనే జగన్మోహన్ రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉద్యాన పంటలకు, సేంద్రీయ పద్ధతులకు ప్రోత్సాహం... ఇవన్నీ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరల కోసం శీతల గిడ్డంగులలో రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునే సదుపాయం, సముద్ర తీరం ఎక్కువగా ఉన్నందున చేపల వేటే వృత్తిగా గల మత్స్యకారులకు ప్రోత్సాహకాలు కల్పిస్తారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమా అమలు అమలయ్యేలా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు ప్రత్యేక శ్రద్ధ పెడతారు. వాలంటీర్ల వ్యవస్థలోని వారికి ఉద్యోగ భద్రత కల్పించడమే గాక వారు గౌరవంగా, సంతృప్తికరంగా బతకడానికి వారి వేతనాలను ఐదువేల నుంచి పదివేల వరకు పెంచుతారు.



వైసీపీ ప్రభుత్వాన్ని రాజ్యాంగబద్ధంగా సాగనంపడానికి, నిర్దిష్టమైన ప్రణాళికతో అభివృద్ధి సాధించడానికి, జగన్మోహన్ రెడ్డి వ్యతిరేక ఓటు చీలకుండా ఉండటానికే బీజేపీ, తెలుగుదేశం, జనసేన జతకట్టాయి. ప్రస్తుతం ప్రజలు ఆర్థికంగా అధమ స్థాయిలో ఉన్నారు. వారు జవసత్వాలు పుంజుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి కూటమి తయారు చేసిన ఐదేళ్ల ఆర్థిక ప్రణాళిక – మేనిఫెస్టో.

23 సంస్థలకు చెందిన దాదాపు 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు వారి సర్వీస్, వేతనాలు, పెన్షన్లకు సంబంధించిన సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వారు గౌరవంగా వారి ఉద్యోగం చేసుకునే పరిస్థితి మళ్లీ తీసుకువస్తారు. ప్రతినెలా ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు అందజేస్తారు. సిపిఎస్ లేదా జిపిఎస్ విధానాన్ని పునసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకువస్తారు. తక్కువ జీతాలు పొందుతున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు బేషరతుగా వర్తింపజేస్తారు.

రాష్ట్ర జనాభాలో దాదాపుగా కాపు, బలిజలు, ఉత్తరాంధ్ర కాపులు 70 లక్షల మంది. యాదవులు 26 లక్షలు, గౌడలు 20 లక్షలు, వడ్డెరలు 6 లక్షల మంది ఉన్నారు. వీరిలో ఎక్కువమంది చేతి వృత్తులు, కార్మికులు, కూలీలు ఉన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి వీలుగా వారి ఉత్పత్తులకు జీఎస్టీ చెల్లిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడటానికి వారికి ఉచితంగా తర్ఫీదు ఇస్తూ పనిముట్లు, పెట్టుబడులు, పరిమితులకు లోబడి ఉచిత విద్యుత్తు, విద్యా ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు, అంబేడ్కర్ విదేశీ విద్యా దీవెన పథకం పునరుద్ధరణ, గౌరవ వేతనాలను ఏర్పాటు చేస్తారు. గీత కార్మికులకు మద్యం దుకాణాలలో 10 శాతం రిజర్వేషన్లు, వడ్డెరలకు క్వారీలలో 15శాతం రిజర్వేషన్లు–రాయల్టీ/ సీనరేజ్ చార్జీల మినహాయింపు కల్పిస్తారు.

రాష్ట్రంలో 24 లక్షల జనాభా ఉన్న ముస్లిం సోదర సోదరీమణులకు సామాజికంగా, ఆర్థికంగా విద్యా, వృత్తి, వ్యాపార రంగాలలో పరిపూర్ణ సహకారం అందిస్తారు. 50 ఏళ్లకే పింఛను, ఇమామ్లకు ప్రతినెలా పదివేలు, మౌజములకు గౌరవ వేతనం, మసీదు నిర్వాహకులకు నెలకు రూ.5వేలు, హజ్ యాత్రికులకు లక్ష ఆర్థిక సహకారం కల్పిస్తారు.

ఆంధ్ర రాష్ట్రంలోని ప్రతి మహిళకు వారి సామర్థ్యానికి తగినట్లుగా విద్య ఉపాధి, పారిశ్రామిక రంగాలలో అభివృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాల అమలు చేస్తారు. మారుమూల గ్రామం నుంచి తెలుగు మహిళ ప్రపంచ దేశాలతో వ్యాపారం చేసే స్థాయికి వేదిక కల్పిస్తారు.

నిరుద్యోగ సమస్య పరిష్కార దిశగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తారు. తెలుగు బిడ్డలు ఉద్యోగులుగా కాక ఉద్యోగాలిచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగడమే ప్రభుత్వం లక్ష్యం.

రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగుపడాలంటే దీక్షా దక్షతతో అందరూ భాగస్వాములు కావాలి. ఆర్థికంగా నష్టపోయినవారికి సంక్షేమ పథకాలు అవశ్యం. సంక్షేమ పథకాల పాలన ఖర్చులకు సారాయి, గంజాయి అమ్మకం, ఇసుక, మట్టి దందాలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, కరెంటు బిల్లుల పెంపు ఆదాయ మార్గాలు కానే కాదు. తెలంగాణకు ఐటీ కారిడార్ అనే పాడి ఆవుని ఇచ్చింది చంద్రబాబే. మొన్న గుజరాత్ ముఖ్యమంత్రిగా, నేడు భారత ప్రధానిగా భారత్‌ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారు మోదీ. తనను తాను తగ్గించుకొని రాష్ట్రాభివృద్ధికి తహతహలాడుతున్నారు పవన్ కళ్యాణ్. నేడు ఈ ముగ్గురు విజనరీ లెజెండ్స్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖచిత్రంగా నిలబడ్డారు. ఈ ముగ్గురి కలయికలో కూటమి రాష్ట్రానికి మంచి రోజులు మళ్ళీ తెచ్చేందుకు శ్రమిస్తున్నది. ఈ కూటమి మేనిఫెస్టో వికసిత్ ఆంధ్ర, వికసిత్ భారత్!

• పాతూరి నాగభూషణం
బీజేపీ మీడియా ఇన్‌ఛార్జ్, గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్

గ్రహిస్తారు, అనుగ్రహిస్తారు, ఆగ్రహిస్తారు

మేరేరామ్ అన్న నాటకం చూశాను. అందులో రావణుడు చనిపోతూ అన్న ఈ మాటలు కదిలించాయి. "నా పతనానికి కారణం ఏమిటంటే, నాకు నా జ్ఞానం గురించి అహంకారం ఉంది. రాముడికేమో అహంకారానికి సంబంధించిన జ్ఞానం ఉంది...". ఈ విషయం అర్థంచేసుకుని మనం మన పనితీరులో మార్పు చేసుకుంటేనే ఉపయోగం. జై భారత్... ఇది జీగ్రూప్ అధినేత సుభాష్ చంద్ర ఈ మధ్య చేసిన ట్వీట్. అంతకు ముందు రోజే ఆయన పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో స్వతంత్ర పత్రికారంగానికి ఉన్న శక్తిని స్మరించుకున్నారు.

ఈ మధ్య భారతదేశంలో కొన్ని అనూహ్యమైన ఆశ్చర్యాలు కూడా ఎదురవుతున్నాయి. ఈ సుభాష్ చంద్ర, జీటీవీ చానెళ్ల మీడియా సంస్థ ఎస్సెల్ గ్రూప్ అధినేత. గోదీ మీడియా అని విమర్శకులు పిలిచే మోదీ సన్నిహిత మీడియాలో ఈ జీటీవీ ది ప్రధానపాత్ర. బీజేపీ సహాయంతో రాజ్యసభకు ఒకసారి సుభాష్ చంద్ర ఎన్నికయ్యారు కూడా. ఇంతకూ ఆయన తన ఇటీవలి ట్వీట్‌లో చెప్పిన రావణాసురుడు ఎవరు? అహంకారం ఎవరిది? జీ మీడియా కార్పొరేషన్ సీఈవో అభయ్ ఓఝాతో సహా కొందరు ముఖ్యుల నిష్క్రమణ, ప్రభుత్వ అనుకూల విధానాన్ని విరమించుకుంటున్నందువల్లనే అని వినిపిస్తున్న వార్తల నేపథ్యంలో, సుభాష్ చంద్రకు పత్రికాస్వేచ్ఛ గుర్తు వచ్చిందా? లేదా, దేశంలో గాలి మళ్లుతున్నదని ముందుగానే గ్రహించి, ఎన్నికల ప్రక్రియ మధ్యలోనే అధికార శిబిరానికి వీడ్కోలు చెప్పారా? వార్తాప్రసారకులలోనే కాదు, వీక్షకులలో కూడా మార్పు వచ్చిందని, ప్రభుత్వంపై విమర్శలకు కూడా కోట్లాది వీక్షణలు దొరుకుతున్నాయని ధ్రువ్ రాఠీ, రవీశ్ కుమార్ వంటి వారి విజృంభణ తెలియజేస్తోంది. అయితే, స్వేచ్ఛాభాషణ పెరిగినంత మాత్రాన, పెను రాజకీయమార్పులు జరుగుతాయని అనుకోనక్కరలేదు.

అహంకారపు వేడి ఆస్మదీయులకు కూడా సోకి, అంతిమంగా అధికార మార్పిడికే కారణమయిన అనుభవం తెలంగాణ రాష్ట్రంలో జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం మీద సవాలక్ష ఫిర్యాదులు ఉండవచ్చు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి సమస్యలు అనేకం ఉండి ఉండవచ్చు కానీ, వాటన్నిటికి ఎగువన, ప్రజల అభిమతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన అంశం మాత్రం 'అహంకారమే'. కేసీఆర్ వ్యవహార సరళిలోని ఆభిజాత్యం, అధికారస్వరం మొన్నటి ఎన్నికల నాటికి ప్రజలు భరించలేని స్థాయికి చేరుకున్నాయి. మరి నరేంద్రమోదీ తీరులో కూడా పతనానికి దారితీసే అవలక్షణం కనిపిస్తున్నదని సుభాష్ చంద్ర చెబుతున్నారా? ప్రజల ఎంపికల మీద నిజంగా ఇటువంటి వ్యక్తిత్వ అంశాలు ప్రభావం వేస్తాయా? అసలు ఎన్నికల తీర్పు వెనుక ఉండే చలనసూత్రాలు, తర్కం ఏమిటి?

రాజకీయవాదులు ప్రజలను ఆకర్షించడానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. వాటిలో ముఖ్యమైనది, అభినయం. తమ స్వభావాలు, అభిప్రాయాలు ఎటువంటివైనా ప్రజల ముందుకు వెళ్లినప్పుడు, ముఖ్యంగా ఎన్నికల వేళ, గౌరవంగా, ప్రేమగా, సానుభూతిగా మాట్లాడడానికి ప్రయత్నం చేస్తారు. చనువుగా ఉండడానికి చూస్తారు. అధికారంలోకి వచ్చాక కూడా, ఆ నటనను కొనసాగించాలనే అనుకుంటారు కానీ, క్రమంగా స్వభావానిదీ, పదవుల దర్పానిదీ పైచేయి అవుతుంది. స్వరం మారుతుంది. జనాన్ని విదిలించి దూరం పెడతారు. ప్రజలకు కూడా ఇది తెలుసు. కొంతవరకు అర్థం చేసుకుని, సహిస్తారు. అది ఒక నిర్ణయంగా మారడానికి సమయం పడుతుంది. తాము గమనిస్తున్న ప్రతికూల అంశం ఒక నిష్పత్తి దాటిన తరువాత, జనం ఇక లెక్కపెట్టుకోవడం మొదలుపెడతారు. అవకాశం వచ్చినప్పుడు తమ చేతిలో ఉన్న ఆయుధాన్ని ఉపయోగించుకుంటారు. పూర్తి అక్షరాస్యత ఉండి, రాజకీయచైతన్యం అధికంగా ఉండే పశ్చిమదేశాలలో సైతం అన్నీ తెలిసి ఓటు చేయగలిగే వివేకం లేదు. ఇక, భారత్ వంటి ఎదుగుతున్న దేశంలో, పూర్తి అవగాహనతో, విచక్షణతో ఓటు చేయగలిగే పరిస్థితి ఎక్కడ? అందుకని, సులభ సంకేతాల నుంచే ప్రజల సమ్మతి కానీ, అసమ్మతి కానీ రూపొందుతుంది. మనసు పడడమో, మనసు విరగడమో!



ఇందిర నుంచి జగన్ దాకా అన్ని సన్నివేశాలలోనూ, ప్రజలు ఏదో ఒక అనుకూలతను లేదా ప్రతికూల అంశాన్ని పూర్తి అనుభవ జ్ఞానంతో లేదా సహజాత శక్తితో గ్రహించారు. పత్రికల్లోనూ టీవీ చర్చల్లోనూ సిద్ధాంత చర్చల్లోనూ వినిపించే విశ్లేషణలతో, రాజకీయ కథనాలతో వారికి పెద్దగా నిమిత్తం ఉండదు. తాము కనెక్ట్ అయ్యే ఒక సంకేతం వారికి అందితే చాలు. ఉష్ణోగ్రతో శీతలత్వమో వారికి తాకితే చాలు. అట్లాగని, ప్రజాపక్ష మేధావులు, ఉద్యమకారులు కల్పించే భావ వాతావరణం అవసరం లేదని కాదు. ప్రజల గ్రహింపును అది ఉద్దీపింపజేస్తుంది. ఆ పౌరసమాజం తమ ఆలోచనలతో చర్చలతో కల్పించే వాదనా, సాధారణ ప్రజ గ్రహించే సంకేతమూ ఒకటే అయినప్పుడు, వాటి ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో అయితే, అది ప్రభంజన ఫలితంగా ఉంటుంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

అయితే, ఓటు ఆయుధానికి పెద్ద పదును లేదు. ఒకరిని తీసి మరొకరిని ఎక్కించడానికి తప్ప ఓటరుకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. ముప్పాతిక సంవత్సరాల భారత ప్రజాస్వామ్యంలో చాలా గొప్పగా సాధించామని ప్రశంసకులు అంటుంటారు. సాధించింది శూన్యమని విమర్శకులూ అంటారు. ప్రజలు తమ అభిమతాన్ని ఎన్నికలలో స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితులు లేవని, అధికారం ఇమ్మని జనం ముందుకు వచ్చే అభ్యర్థుల మధ్య, పార్టీల మధ్య పెద్ద వ్యత్యాసమే లేదని, చట్టసభల ద్వారా కాక, వీధుల్లోనే ప్రజలు ఎక్కువ పోరాటాలు చేసి సాధించుకున్నారని రాజకీయ చరిత్రకారులు చెబుతుంటారు. ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి, గందరగోళపరచి, ప్రలోభపరచి జరిగే ఎన్నికల ప్రచారం ఏ విధంగా అవగాహనాయుత ఓటింగ్ సాధిస్తుందన్న ప్రశ్న సహేతుకమైనదే. ప్రజల తరఫున పనిచేయవలసిన ప్రజాప్రతినిధులు సామాజిక వనరులను, సంపదను ప్రైవేటు లాభార్జనాపరులకు కట్టబెట్టే కమిషన్ ఏజెంట్లుగా పని చేస్తున్నారన్నది కూడా చాలావరకు నిజమే. అట్లాగని, ఇంతకాలంగా జరుగుతూ వచ్చిన ఎన్నికలలోని ప్రజల తీర్పుల్లో ఒక క్రమంకానీ, అంతస్సూత్రం కానీ, మార్పు కానీ లేదని అనగలమా? భారతదేశంలోని వివిధ ప్రజావర్గాలు అవకాశాలకు, అధికారానికి దగ్గర కాలేదని చెప్పగలమా? ప్రాంతాలు, లింగ, కుల తదితర సామాజిక వర్గాలు తమ సాధికారతాస్థలాన్ని విస్తరించుకోవడాన్ని విస్మరించగలమా? అదే సమయంలో, పారిశ్రామిక, కార్పొరేట్ సంపన్నులు, భూస్వామ్యవర్గాలు తమ తమ ప్రయోజనాలను రక్షించుకోవడానికి, తమ ఆస్తులను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడానికి, ఆర్థిక అంతరాలను అగాధాలుగా మార్చడానికి ఆయా ప్రభుత్వాలే ప్రత్యక్షంగానో పరోక్షంగానో కారణమని చెప్పకుండా ఉండగలమా?

ప్రజల అభిమతాన్ని సాధించడానికి చేసే రకరకాల విన్యాసాలు, ఆ సమ్మతి పొందిన తరువాత పొందిన అధికారంతో చేసే దాష్టీకాలూ భారత ప్రజాస్వామ్య చరిత్ర పొడవునా చూడవచ్చు. అయితే, ప్రజలు ఈ క్రమంలో కేవలం మభ్యపడేవారిగానూ, మాయకు లోబడేవాళ్లుగాను లేరు. వారు కూడా పరిస్థితులను ఓట్ల ద్వారానో, ఉద్యమాల ద్వారానో మారుస్తూ వచ్చారు. చాయిస్ లేకపోవడం వల్లా, తీవ్ర ఉద్వేగాల ప్రభావం వల్లా ప్రజలు కొన్ని సందర్భాలలో గాలివాటంలో కొట్టుకుపోయిన మాట నిజమే. అందుకు కూడా కొన్ని నిగూఢ రాజకీయార్థిక, ఉద్వేగ కారణాలు ఉండవచ్చు. కానీ, ఎక్కువ కాలం అహంకారాన్ని, ఉన్మాద రాజకీయాలను భారత ప్రజలు సహించిన ఉదాహరణలు లేవు. 1970 దశకం మొదట్లో విజయేందిరగా జయజయధ్వానాలు అందుకున్న ఇందిర, అయిదేళ్లు గడిచేసరికి నియంతగా నిలబడ్డారు, మరో రెండేళ్లకు ఘోరపరాజయం పొందారు. కలహాల జనతా పాలన తిరిగి ఇందిరకే దారి ఇచ్చింది. కార్గిల్ నేపథ్యంలో అవతరించిన మొదటి ఎన్డీయే ప్రభుత్వం, ఐదేళ్లకే దేశం మెరిసిపోతున్నదన్న ఆభాస నినాదంతో పరాజయం పాలయింది. రాజీవ్ ప్రభంజనాన్ని ఎదుర్కొని ఘన విజయం సాధించిన ఎన్టీయార్ తరువాతి దఫాకు ఘోరంగా ఓడిపోయారు. తరువాత అధికారం పొందిన కాంగ్రెస్ ఏడాదికో ముఖ్యమంత్రిని మార్చి, సకల రంగాలలో విధ్వంసపాలన అమలుజరిపి, తిరిగి జనం అదే ఎన్టీయార్‌కు ఘనవిజయం ఇచ్చేట్టు చేసింది. వ్యవసాయానికి, గ్రామీణరంగాలకు వ్యతిరేకమన్న ముద్ర 2004లో చంద్రబాబుకు ప్రతికూలంగా పనిచేసింది. కానీ, నగరాభివృద్ధిలోను, పాలనలోను ఉన్న అనుభవం కారణంగా విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆయనను మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఒక అవకాశం ఇద్దామని జగన్మోహన్ రెడ్డికి ఇచ్చిన అవకాశం దుష్పరిపాలనకు దారితీయడంతో, ఇప్పుడు తిరిగి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు వేటు వేసి తీరతారన్న వాతావరణం వ్యాపించి ఉంది. ఈ అన్ని సన్నివేశాలలోనూ, ప్రజలు ఏదో ఒక అనుకూలతను లేదా ప్రతికూల అంశాన్ని పూర్తి అనుభవ జ్ఞానంతో లేదా సహజాత శక్తితో గ్రహించారు. పత్రికల్లోనూ టీవీ చర్చల్లోనూ సిద్ధాంత చర్చల్లోనూ వినిపించే విశ్లేషణలతో, రాజకీయ కథనాలతో వారికి పెద్దగా నిమిత్తం ఉండదు.

పూర్తి అక్షరాస్యత ఉండి, రాజకీయ చైతన్యం అధికంగా ఉండే పశ్చిమదేశాలలో సైతం అన్నీ తెలిసి ఓటు చేయగలిగే వివేకం లేదు. ఇక, భారత్ వంటి ఎదుగుతున్న దేశంలో, పూర్తి అవగాహనతో, విచక్షణతో ఓటుచేయగలిగే పరిస్థితి ఎక్కడ? అందుకని, సులభ సంకేతాల నుంచే ప్రజల సమ్మతి కానీ, అసమ్మతి కానీ రూపొందుతుంది. మనసు పడడమో, మనసు విరగడమో!

తాము కనెక్ట్ అయ్యే ఒక సంకేతం వారికి అందితే చాలు. ఉష్ణోగ్రతో శీతలత్వమో వారికి తాకితే చాలు. అట్లాగని, ప్రజాపక్ష మేధావులు, ఉద్యమకారులు కల్పించే భావ వాతావరణం అవసరం లేదని కాదు. ప్రజల గ్రహింపును అది ఉద్దీపింపజేస్తుంది. ఆ పౌరసమాజం తమ ఆలోచనలతో చర్చలతో కల్పించే వాదనా, సాధారణ ప్రజ గ్రహించే సంకేతమూ ఒకటే అయినప్పుడు, వాటి ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో అయితే, అది ప్రభంజన ఫలితంగా ఉంటుంది.

2014 నుంచి రెండు దఫాలు నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడడానికి ప్రాథమికంగా ప్రజలు కనెక్ట్ అయిన సంకేతాలే కారణం. యూపీఏ ప్రభుత్వం అవినీతో, విధాన వైకల్యమో, బీజేపీ అచ్ఛేదిన్ వాగ్దానమో ఏదో మొగ్గను సృష్టించింది. 2019లో తీవ్ర జాతీయభావాల దగ్గర నుంచి మతభావోద్వేగాల దాకా ప్రజల మనస్సులను ఆవరించాయి. ప్రతిపక్షం అత్యంత బలహీనంగా ఉండడం మరో కారణం. సాధించినవాటిని గొప్పగా చెప్పుకోవడం కంటె, బలహీనంగా కనిపిస్తున్న ప్రత్యర్థి విధానాంశాలే ప్రస్తుత ఎన్నికల్లో ఎందుకు చర్చలో ఉంటున్నాయి? రాముడికి ఉన్న అహంకార జ్ఞానం రామ ప్రతినిధులమని చెప్పే రాజకీయవాదులకు ఉండడం లేదా? సుభాష్ చంద్ర 'అహంకారం' అని గుర్తించిన దాన్ని, సాధారణ ప్రజలు నియంతృత్వంగానో, పరమాధికారంగానో గుర్తిస్తున్నారా? 2024లో ఓటర్లకు అందవలసిన సంకేతం అందిందా?

ఎదురుచూస్తున్నారు!

'ప్రజావేదిక' కూల్చి వేయటాలు
'అన్నక్యాంటీన్లు' మూసివేయటాలు
విపక్షనాయకుల నిర్బంధాలు
ఆధారాలు లేని అక్రమ కేసులు
అంతులేని ధనదాహాలు
అక్రమ కట్టడ నిర్మాణాలు
భూములిచ్చిన మహిళలకు అవమానాలు
ఇతర పత్రికలపై విద్వేషాలు
పర చానళ్లపై విషం చిమ్మడాలు
మితిమీరిన అధికార దుర్వినియోగాలు
ఆశావర్కర్ల ఆందోళనలు
అంగన్‌వాడీల ఆక్రందనలు
నిరాశలో పింఛన్‌దారులు
పరితపిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
షాక్ కొడుతున్న కరెంట్ చార్జీలు
పెరిగిపోతున్న అరాచకాలు
కొనసాగుతున్న వలసకూలీల వెతలు
ఉద్యోగులకు సకాలంలో అందని జీతాలు
పారిపోయిన పరిశ్రమలు
ఆకాశాన్నంటే అధిక ధరలు
ఎక్కడ చూచినా గంజాయి స్థావరాలు
ప్రజల స్థిరాస్తులకు లేని రక్షణలు
వ్యక్తుల ఆస్తులపై ప్రభుత్వ పెత్తనాలు
సమాధులుగా మారుతున్న పునాదులు
అధికారుల అండతో ఇసుక దోపిడీలు
ఇవన్నీ చూస్తున్న ఆంధ్రాజనాలు
ఎన్నికల తీర్పుతోనన్నా
వస్తాయని మార్పులు
కసితో కోరుకుంటున్నారు
విసుగుచెందిన ప్రజలు
ఎందరెందరో ఎదురుచూస్తున్నారు
సిద్ధంగా నీ పాలిక పోక కోసం

– నన్నపనేని రాజకుమారి
మాజీ మంత్రి

హలో ఏపీ... బై బై వైసీపీ!

2024 సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడింది. అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమిదే అధికారం అని అన్ని సర్వే సంస్థలు తేల్చి చెప్పాయి. అయినా కూడా వైనాట్ 175 అంటూ వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బీరాలు పలుకుతూనే ఉన్నారు. మరోసారి అధికారం ఇస్తే తామేం చేస్తామో అన్నది స్పష్టత లేకుండా 2019 మేనిఫెస్టోనే కొంచెం అటూ ఇటూ మార్చి కొత్తసీసాలో పాత సారానే అన్నట్టుగా 2024 మేనిఫెస్టోను రిలీజ్ చేశారు జగన్‌రెడ్డి. గత మేనిఫెస్టోలోని అంశాలలో ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చకపోయినా 99 శాతం అన్నీ అమలు చేసేశామని కళ్ళార్పకుండా ఆయన పదేపదే చెపుతున్న అబద్ధాలని విని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

తమకు మెజారిటీ ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. కేంద్రం సహకరించకపోతే పోలవరం పూర్తి చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాదా అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించిన జగన్ అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిగా అటకెక్కించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. పోలవరం నిర్వాసితులను గాలికొదిలేశారు. రాజధాని అమరావతి విషయంలోనూ అంతే. మూడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఇష్టం లేదని, అందుకే రాష్ట్రం మధ్యలో ఉన్న అమరావతినే రాజధానిగా అంగీకరిస్తున్నామని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో చెప్పిన జగన్‌రెడ్డి అధికారం చేపట్టిన మొదటిరోజు నుండే రాజధానికి భూములిచ్చిన రైతులపై కక్ష సాధింపు చేపట్టారు. పైగా విశాఖ, అమరావతి, కర్నూలులలో మూడు రాజధానులు నిర్మిస్తామని ఊదరగొట్టారు. మూడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు. విశాఖను పాలనా రాజధానిగా చేస్తామని చెప్పి విశాఖలో భూ దోపిడీకి తెర లేపారు. పర్యావరణ విధ్వంసం చేసి రుషికొండను బోడిగుండు చేసి కోట్ల రూపాయలు వెచ్చించి అక్కడ రాజసౌధం కట్టుకున్నారు. సాధ్యం కాదని తెలిసినా కర్నూలును న్యాయ రాజధాని చేస్తానని ఆ ప్రాంత ప్రజలను మోసం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్వయానా తన పినతండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంలో సీబీఐ ఎంక్వైరీ కావాలని డిమాండ్ చేసిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట మార్చి ఆ అవసరం లేదని చెప్పడమే కాకుండా నిందితులకు కాపు కాస్తున్నారు. ఈ విషయంలో అలుపెరగని పోరాటం చేస్తున్న వివేకా కూతురు సునీత పైనే నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారు. మూడు వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి తాను అధికారంలోకి రావడానికి కారణమైన సొంత చెల్లెలు షర్మిలపై కూడా వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. తన నిజస్వరూపం ప్రజలకు వివరిస్తుందనే కోపంతో షర్మిల వైఎస్ వారసురాలు కాదు, చంద్రబాబు వారసురాలు అని దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు.

ప్రతీ ఏడాది జనవరి 1వ తేదీన జాబ్ కేలండర్ రిలీజ్ చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని,



రైతులను, ఉద్యోగులను, నిరుద్యోగులను, మహిళలను, యువతను, ఆశా వర్కర్లను, అంగన్‌వాడీ కార్యకర్తలను... ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలోని అన్ని రంగాలను, అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన జగన్‌రెడ్డి మరోసారి అధికారం ఇవ్వమని అడగడం సిగ్గుచేటు. జాలిపడి ఓటేస్తే తమ బ్రతుకులే కాదు, తమ బిడ్డల భవిష్యత్తు కూడా ఏ విధంగా నాశనం అవుతుందో ప్రజలు గ్రహించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎప్పుడు గద్దె దించుదామా అని ఎదురుచూస్తున్నారు.

మూడు దశల్లో మద్యపాన నిషేధం విధిస్తామని, పూర్తి నిషేధం చేశాకే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని గొప్పలు పోయిన జగన్‌రెడ్డి అవన్నీ గాలికొదిలేశారు. రెండున్నర లక్షల ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన జగన్‌రెడ్డి తమ పార్టీ కార్యకర్తలను వాలంటీరులుగా నియమించి వారినే లక్షల ఉద్యోగాలు కల్పించామని చెప్పుకుంటున్నారు. అంతే కాకుండా తాను అధికారంలోకి రావడానికి ఎంతో కారణమైన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారు. మాట్లాడితే నా ఎస్సీలు, నా ఎస్టీలు అని గొంతు చించుకునే జగన్‌రెడ్డి దళితులు, గిరిజనులను ఓటుబ్యాంకుగా వాడుకుని వదిలేశారు. తొలి నాలుగేళ్లలోనే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.23 వేల కోట్లకు పైగా, ఎస్టీ ఉప ప్రణాళికలో రూ.6,547 కోట్ల కోతలు కోశారు. అరకొర కేటాయింపులన్నీ నవరత్నాలు మళ్లించి దళిత, గిరిజన వర్గాలను దారుణంగా మోసం చేశారు. ఎప్పటినుంచో అమలులో ఉన్న 27 పథకాలను రద్దుచేసి ఎస్సీ, ఎస్టీల నడ్డి విరిచారు. అదేవిధంగా ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని ముస్లింలను మోసం చేశారు.

పిల్లల్ని బడికి పంపండి చాలు అన్నారు... అందరికీ అమ్మ ఒడి సాయం అందిస్తామన్నారు. ఇద్దరు పిల్లలుంటే ఇద్దరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. తల్లులలో ఆశలు రేకెత్తించి, అధికారంలోకి వచ్చాక అనేక నిబంధనలు పెట్టడమే కాకుండా ఒక్క బిడ్డకే సాయం అంటూ నాలిక మడతపెట్టారు. వైద్య రంగాన్ని కూడా జగన్‌రెడ్డి అటకెక్కించారు. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో సరైన వైద్యం అందక... ప్రాణభయంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆరోగ్యశ్రీ వార్షిక పరిమితిని రూ. 25 లక్షలకు పెంచామన్న జగన్... ఆసుపత్రులకు తరచూ బిల్లులు బకాయి పెట్టడంతో పరోక్షంగా రోగులపై భారం పడుతోంది. ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని కరోనా సమయంలో చెప్పిన జగన్ ప్రభుత్వం ఇప్పటివరకూ చేసిన దాఖలాలు లేవు. రూ.13 లక్షల కోట్లకు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశారు. ప్రతీ మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చేశారు. ఐదేళ్ళలో ఒకే ఒక్కసారి పారిశ్రామిక సదస్సు నిర్వహించిన ఈ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, భారీ పరిశ్రమలు వస్తున్నాయని, లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని ఊదరగొట్టారేగాని... వాస్తవానికి రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఈ అధికార వైసీపీ నాయకుల ఒత్తిళ్లు, దందాలు తట్టుకోలేక పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి.

2019లో అధికారంలోకి వచ్చాక ప్రజావేదిక కూల్చివేతతో తన పరిపాలన మొదలు పెట్టిన జగన్‌రెడ్డి నూతన ఇసుక విధానం అంటూ ఇసుక దోపిడీకి తెరలేపడమే కాకుండా సామాన్యులకు ఇసుక అందనంత ఎత్తులో పెట్టి నిర్మాణ రంగాన్ని కుప్ప కూల్చి దాదాపు 60 మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు కల్పించారు. రాష్ట్రంలో ఇసుక దోపిడీకి తెరలేపారు. ఆఖరికి సుప్రీంకోర్టు ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశించినా లెక్కచేయకుండా తమ పార్టీ ఇసుకాసురులకు అండగా నిలబడుతున్నారు. రైతులను కూడా మోసం చేశారు. రైతు భరోసా పేరుతో రూ. 12,500 ఇస్తానని చెప్పి కేంద్రం ఇచ్చే రూ. 6 వేలు కలిపి రూ. 18,500 ఇవ్వకుండా రూ.13,500 ఇచ్చి ఐదు వేలు కోత పెట్టారు. ఆ విధంగా ఈ ఐదేళ్ళలో జగన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టింది అక్షరాలా రూ. 9,800 కోట్లు.

రైతులను, ఉద్యోగులను, నిరుద్యోగులను, మహిళలను, యువతను, ఆశా వర్కర్లను, అంగన్‌వాడీ కార్యకర్తలను... ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలోని అన్ని రంగాలను, అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన జగన్‌రెడ్డి మరోసారి అధికారం ఇవ్వమని అడగడం సిగ్గుచేటు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన పథకాలు నవరత్నాలు కాదు రంగురాళ్లు అని ప్రజలు గమనించారు. జాలిపడి ఓటేస్తే తమ బ్రతుకులే కాదు, తమ బిడ్డల భవిష్యత్తు కూడా ఏ విధంగా నాశనం అవుతుందో ప్రజలు గ్రహించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎప్పుడు గద్దెదించుదామా అని ఎదురుచూస్తున్నారు. అందుకే హలో ఏపీ... బైబై వైసీపీ అనే నినాదానికి అండగా నిలబడుతున్నారు.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

మాట మారింది!

ఒకప్పుడు 'నా వెంట్రుక కూడ పీక లేరు' అన్న జగన్ టోన్ మారింది. నిజం కళ్ళ ముందు కదలాడసాగింది. నవ రత్నాలను నలుగురికి వేసి, మిగతాదంతా మింగేసి, అందరినీ తనకు ఓటు వెయ్యమంటే ఎలా వేస్తారు? అంతా దేవుని దయ అనే జగనన్న, ఇది కూడా దేవుని దయేనన్న విషయం గమనించాలి. తానొక్కడే మనిషి కాదు అందరూ దేవుడు చేసిన మనుషులే అని తెలుసుకోవాలి. ఎవరేం అడిగారు.. ఏం చేసారు... అనేది పక్కన పెడితే, జగనన్న దోచింది కక్కించినప్పుడే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. టీడీపీ అధికారంలోకి రాగానే ఆయన దోపిడీని లెక్కలతో ప్రజల ముందు పెట్టి పరిపాలనకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే తెలుగుదేశం మరో నాలుగు దశాబ్దాల పాటు ఆంధ్రలో మనుగడ సాగిస్తుంది.

–వి.ఎల్.రాఘవరావు
విశాఖపట్నం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు

గురువారం 9 మే 2024

అరుదైన అపూర్వ ఘట్టానికి బెజవాడ వేదికైంది. మూడు ప్రధాన పార్టీల అధినేతల ప్రచార రథానికి బందరురోడ్డు బ్రహ్మరథం పట్టింది. బుధవారం రాత్రి నగరంలో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్ షోకు జనం పోటెత్తారు. ప్రధాని మధ్యలో నిలబడగా, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెరోపక్క నిలబడి అశేష జనానికి అభివాదాలు చేశారు. కనులపండువగా సాగిన ఈ కలయికను చూసేందుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో బందరురోడ్డు కిక్కిరిసిపోయింది. రోడ్ షో మొత్తంలో ముగ్గురు నేతలు ఎలాంటి ప్రసంగం చేయకపోయినా.. జనాల జయజయధ్వానాలతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.



రోడ్ షోలో పాల్గొన్న అమరావతి రైతులు



ప్లకార్డుతో పాల్గొన్న ఓ వృద్ధురాలు

రథసారథులకు బ్రహ్మరథం



బందరురోడ్డులో రోడ్ షోకు హాజరైన జనానికి అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రభంజనంలా ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షో

- బందరురోడ్డుకు భారీగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- ప్రధానితో కలిసి చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభివాదం
- ఐజీఎంసీ నుంచి బెంజిసర్కిల్ వరకు సాగిన రోడ్ షో
- అడుగడుగునా పండుగ వాతావరణంలా ఏర్పాట్లు
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య ముందుకు సాగిన నేతలు
- అణువణువూ జల్లెడ పట్టిన భద్రతా సిబ్బంది



బందరురోడ్డులో జనం కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలు

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : బందరురోడ్డు జనసంద్రాన్ని తలపించింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు రెపరెపలాడాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన రోడ్ షోకు భారీ సంఖ్యలో జనం హాజరయ్యారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి మొదలైన రోడ్ షోలో ప్రధానితో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. రోడ్ షో.. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ప్రారంభమైనప్పటికీ జనం నిలబడే గ్యాలరీలు మాత్రం పీవీపీ మాల్ నుంచి ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జనానికి అభివాదాలు చేసుకుంటూ ముగ్గురు నేతలు ముందుకుసాగారు. కాగా, రోడ్డుకు కుడివైపున బీజేపీ నేతలు పది రకాల వేదికలను ఏర్పాటు చేశారు. ఒక్కో వేదికపై ఒక్కో మతంవారు స్వాగతం పలికేలా వినూత్నంగా ఏర్పాట్లు చేశారు. రోడ్డు మొత్తాన్ని బ్లాక్‌లుగా, గ్యాలరీలుగా విభజించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మూడు పార్టీల కార్యకర్తలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత ఆయా గ్యాలరీల్లోకి పంపారు. మంచినీళ్ల సీసాలను కూడా అనుమతించలేదు. ఎంజీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలపైకి ఎవరూ వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గంటపాటు రోడ్ షో సాగగా, ముగ్గురు నేతలకు జనం జేజేలు పలికారు. రోడ్డు షో ముగిసే సమయంలో బెంజిసర్కిల్ వద్ద ఉన్న వేదిక దగ్గర తోపులాట జరిగింది. గ్యాలరీల్లో ఉన్న వారంతా బారికేడ్లను ధ్వంసం చేసుకుంటూ ప్రధాని వాహనం వెంట వచ్చారు. దీంతో అప్పటికే ఎండ్ పాయింట్ వద్ద జనం ఎక్కువగా ఉన్నారు. ముందున్న వారంతా ఒక్కసారిగా రావడంతో తోపులాట జరిగింది. షో ముగిసిన తర్వాత జనం బయటకు వెళ్లడానికి ప్రయత్నించారు. అప్పటికే ముగ్గురు నేతలు విశ్రాంతి గదిలో ఉండటంతో పోలీసులు ఎవరినీ బయటకు పంపలేదు. చివరికి బారికేడ్లను తొక్కుకుంటూ జనం బయటకు వచ్చారు. దీంతో పోలీసులు చేతులెత్తేశారు.

మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక ప్రదర్శన

మోదీ రోడ్ షో సందర్భంగా కొంతమంది క్రీడాకారులు మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక ప్రదర్శన చేశారు. బెంజిసర్కిల్ పెట్రోలు బంకు వద్ద ఈ ప్రదర్శన నిర్వహించారు. ఆపద సమయంలో యువతులు ఎలా ఎదుర్కోవాలో క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ ప్రదర్శనను మహిళలు ఆసక్తిగా తిలకించారు.







అభిమానులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయిన బందరురోడ్డు

జంక్షన్‌లో జనమే జనం



హనుమాన్ జంక్షన్ బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ బహిరంగ సభ విజయవంతం

- మండుటెండలో వేచి ఉన్న అభిమానులు, కార్యకర్తలు
- సౌమ్యంగా మాట్లాడి ఆకట్టుకున్న జనసేనాని
- ప్రధాన సమస్యల పరిష్కారానికి అభయం

హనుమాన్ జంక్షన్/హనుమాన్ జంక్షన్ రూరల్, మే 8 : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున ద్విచక్రవాహనాలు, ఆటోల్లో జనం హాజరయ్యారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా సభా వేదిక సమీపంలోని భవనాలపైకి ఎక్కి పవన్ కోసం వేచి చూశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పవన్ సభాస్థలి వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 2.20 గంటల వరకూ సభ జరిగింది. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు ప్రారంభోపన్యాసం చేశారు. తరువాత గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, మచిలీపట్నం కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి కొద్దిసేపు మాట్లాడారు. ఆ తర్వాత పవన్ ప్రసంగించారు. రహదారిపై ప్రత్యేక వాహనం మీద వారాహి విజయభేరి పేరుతో వేదిక ఏర్పాటు చేశారు. మూలకొట్టు సెంటర్ నుంచి హెచ్ మార్ట్ వరకు రహదారి రెండు మార్గాల్లోనూ భారీ ఎత్తున జనం నిండిపోయారు. విజయవాడ నుంచి జంక్షన్ చేరుకునే వరకు దారి పొడవునా అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, వీరమహిళలు నీరాజనాలు పలికారు.

టీ గ్లాసుతో ఉత్సాహం

మచిలీపట్నం కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ఉదయం 10 గంటలకే సభావేదిక వద్దకు చేరుకున్నారు. పవన్ రావడం ఆలస్యం అవుతుందని తెలిసి కాలక్షేపం కోసం వేదిక సమీపంలో ఉన్న టీ దుకాణంలోకి వెళ్లి టీ తాగారు. తనతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు కూడా టీ ఇప్పించారు. తాగుతున్న టీ గ్లాసును పైకి చూపిస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. పవన్ వచ్చేంత వరకు సమయం వృథా చేయకుండా బాపులపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

నేడు లేదా రేపు నగరంలో పవన్ పర్యటన

బెజవాడలో ప్రచారం చేయాలన్న చంద్రబాబు

సానుకూలంగా స్పందించిన జనసేనాని

వివరాలు లోపలి పేజీలో...

మల్లవల్లి రైతులకు న్యాయం చేస్తాం..

రాష్ట్ర భవిష్యత్తు కోసం పారిశ్రామికవాడ అభివృద్ధికి (ఏపీఐఐసీ) భూములిచ్చి నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. వారాహి విజయభేరి సభలో ఆయన మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామికవాడలో పూర్తిస్థాయిలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కాగా, పవన్ ప్రసంగం ఆద్యంతం సౌమ్యంగా సాగింది. ఎమ్మెల్యే వంశీని కూడా గారు అంటూ సంబోధిస్తూ మాట్లాడారు. కాగా, పలు ప్రధాన సమస్యలపై స్థానిక రైతులతో కలిసి నేతలు వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, తుమ్మల ఉదయ్ వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలోని ప్రతి విషయాన్ని చదివిన పవన్ అరాచక పాలన పోయి అభివృద్ధి జరగాలంటే బాలశౌరి, వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బాలశౌరి చిన్నగా మాట్లాడినా సమస్యలపై అవగాహనతో ఉంటారని, పగిలిన గాజు ఎంత పదునుగా ఉంటుందో అంత పదునుగా పార్లమెంటులో ప్రజావాణి వినిపించగలడని పవన్ పేర్కొన్నారు. సంవత్సరం పాటు కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేసిన యార్లగడ్డ వెంకట్రావు వినూత్న పథకాల ద్వారా రైతులకు సేవలందించారని, ఆయన్ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతారన్నారు. వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ మాయమాటలు నమ్మి, క్రాస్ ఓటింగ్ వేసి కూటమి ధర్మానికి విఘాతం కలిగించొద్దని జనసేనాని పవన్ కల్యాణ్ తన పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను కోరారు. మచిలీపట్నం ఎంపీ ఓటు జనసేన పార్టీకి వేసి, ఎమ్మెల్యే ఓటు వైసీపీకి వేయించుకోవాలని చూస్తున్నారని, కార్యకర్తలు జాగ్రత్త వహించాలన్నారు. వంశీ చెప్పే మాయమాటలకు, ఆయనిచ్చే రూ.2 వేలకు ప్రలోభపడి టీడీపీ అభ్యర్థికి అన్యాయం చేయకూడదన్నారు. సోదరి లాంటి నారా భువనేశ్వరిపై అమానుషంగా ప్రవర్తించిన వంశీకి బుద్ధి చెప్పాలన్నారు. పెనమలూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్, నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌ను గెలిపించాలన్నారు. వేదికపై మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన యువనేత గరికపాటి శివశంకర్, బీజేపీ గన్నవరం నాయకులు డాక్టర్ ఫణి తదితరులు ఉన్నారు. టీడీపీ, జనసేన నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, వడ్డి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, వడ్రాణం హరిబాబు, ఆళ్ల గోపాలకృష్ణ, వీరమాచనేని సత్యప్రసాద్, వేముపల్లి శ్రీనివాసరావు తదితరులు సభా కార్యక్రమాలను పర్యవేక్షించారు. సినీనటుడు వడ్డి మహేశ్ కూడా సభా వేదిక వద్ద సందడి చేశారు.

నీటికుంటలో పడి ఇద్దరు బాలికలు మృతి

దొనబండ రాతిక్వారీ వద్ద ఘటన

- మృతులిద్దరూ అక్కాచెల్లెలు
- బట్టలు ఉతికేందుకు వెళ్లి దుర్మరణం

కంచికచర్ల రూరల్, మే 8 : పరిటాల శివారు దొనబండ రాతిక్వారీ వద్ద ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఎస్సై సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం రాతిక్వారీలో పని చేసుకుని జీవించే లివన్‌జానీ-సావిత్రికి నలుగురు పిల్లలు. వారిలో ముగ్గురు పాపలు, ఒక బాబు. వీరిలో లక్ష్మీజానీ (13), రాధాజానీ (12) బుధవారం ఉదయం క్వారీ నీటి కుంటలో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. వారిలో ఒకరు ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయారు. కాపాడేందుకు మరొకరు ప్రయత్నించడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. వారితో పాటు తోడు వెళ్లిన బంధువుల పిల్లాడు చంటి ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన బంధువులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే బాలికలిద్దరూ మృతిచెందారు. లక్ష్మీజానీ తొమ్మిదో తరగతి, రాధాజానీ ఎనిమిదో తరగతి పూర్తిచేశారు. వేసవి సెలవులకు ఇంటి వద్దే తల్లిదండ్రులతో ఉంటున్నారు. ఒడిశాకు చెందిన ఈ కుటుంబం 30 ఏళ్ల క్రితమే దొనబండకు వచ్చి క్వారీల్లో కూలి చేసుకుంటూ జీవిస్తోంది. కష్టపడి పనిచేసుకుంటూ ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నామని, కాలం ఇలా ఒకేసారి ఇద్దరినీ తమ నుంచి దూరం చేసిందని తల్లిదండ్రులు బోరుమన్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు నీటికుంటలో ఉన్న ఇద్దరు బాలికల మృతదేహాలను బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి పంపి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం : వల్లూరు భార్గవ్

ధర్నాచౌక్, మే 8 : ప్రజా సంక్షేమం, అభివృద్ధే తమ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి వల్లూరు భార్గవ్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన "మీట్ ది ప్రెస్"లో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి, యువత ఉపాధి కోసం కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోకు ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. ఈనెల 10న స్థానిక జింఖాన గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కమ్యూనిస్టులు బలపడాలి : వి.శ్రీనివాసరావు

ధర్నాచౌక్, మే 8 : రాష్ట్రాభివృద్ధి కమ్యూనిస్టులు బలపడటం ద్వారానే సాధ్యమని, వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించి అసెంబ్లీకి పంపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన "మీట్ ది ప్రెస్"లో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఆదరణ పెరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ ప్రత్యేక హోదా, విభజన హామీల, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశాలపై మాట్లాడకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, విజయవాడ అర్బన్ అధ్యక్షుడు చావా రవి, ఐజేయూ సభ్యుడు ఎస్‌కే.బాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితులకు రక్షణ : పేరుపోగు

ధర్నాచౌక్, మే 8 : టీడీపీ విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని)తో పాటు ఏడు నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని మాదిగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన, దళితులపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలపై నోరుమెదపని సీఎం జగన్‌ను ఓడించి ఇంటికి పంపించాలన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవసరం

రైల్వేస్టేషన్, మే 8 : ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడానికి క్రీడలు ఎంతో అవసరమని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర పాటిల్ అన్నారు. బుధవారం రైల్వే మినీ స్టేడియంలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. వేసవి శిబిరంలో పాల్గొనడం ద్వారా పిల్లలు మంచి ఆరోగ్యం కోసం జీవితకాలం నిబద్ధత వైపు మొదటి అడుగు వేయాలని ఆయన సూచించారు.

సంయుక్త పరిశోధనలు

- పీబీ సిద్ధార్థ కళాశాల, ఆగిరిపల్లి ఎస్ఆర్ఐ కళాశాల మధ్య ఒప్పందం

మొగల్రాజపురం, మే 8 : పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగం, ఆగిరిపల్లిలోని ఎస్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల మధ్య ఒప్పందం జరిగినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు కళాశాలలు సంయుక్తంగా పరిశోధనలు చేయడంలో, సాంకేతిక సదస్సులు నిర్వహించడం, శిక్షణా కార్యక్రమాలు రూపొందించడం, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం వంటి అంశాలలో కలిసి పనిచేయాలని ఈ ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు.

'ఏపీఎల్'లో నమోదుకు రేపే ఆఖరు

విజయవాడ స్పోర్ట్సు, మే 8 : ప్రతిభ కలిగి గుర్తింపు లేని క్రికెటర్లకు ఏపీఎల్ రైజింగ్ స్టార్స్ పేరుతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ చక్కటి అవకాశం కల్పిస్తోందని, ట్రయల్స్ కోసం పేర్ల నమోదుకు ఈనెల 10వ తేదీతో గడువు ముగుస్తుందని కేడీసీఏ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన 12 మందితో ఏపీఎల్ రైజింగ్ స్టార్స్‌గా నమోదు కావచ్చునన్నారు.

నేటి నుంచి ఐటీఐ ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, మే 8 : ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-2025కిగాను ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిలాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో చేరగల అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మే 9వ తేదీ నుంచి జూన్ 10వ తేదీలోపు తమ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని తెలిపారు.





హిట్ షో!

ఎన్డీఏ కూటమి రోడ్‌షో అదిరింది. ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి ఒకే వాహనంపై రోడ్డుషోలో వస్తుంటే ఇనుప బారికేడ్ల వెంట జనం ఈలలు, కేరింతలు, సెల్ఫీలు, డాన్సులతో బుధవారం సాయంత్రం ఎంజీ రోడ్డు దద్దరిల్లింది. ముగ్గురు నేతలు అభివాదం చేసుకుంటూ ముందుకు కదులుతుండగా బీజేపీ, టీడీపీ, జనసేన జెండాలతో యవతీ యువకులు సంబరాలు చేసుకున్నారు. పటిష్టమైన బందోబస్తు మధ్య భారీగా వచ్చిన జనంతో బుధవారం జరిగిన రోడ్‌షో హిట్ షోగా నిలిచింది.



బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, రామినేని ధర్మప్రచారక్‌తో పాటు కోమటి జయరామ్, వందమంది ఎన్నారైలతో రోడ్‌షోలో డబుల్ ఇంజిన్ సర్కారు ప్లకార్డులు చూపుతూ..











నేడు లేదా రేపు నగరంలో పవన్ పర్యటన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ విజయవాడ నగరంలో పర్యటించనున్నారు. గురు లేదా శుక్రవారాల్లో ఆయన పర్యటన ఉండొచ్చని టీడీపీ నాయకులు చెబుతున్నారు. బుధవారం నగరంలో ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో చంద్రబాబు, పవన్ కూడా పాల్గొన్నారు. రోడ్ షో అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను కలిసిన విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, విజయవాడ తూర్పు టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్.. నగరంలో పవన్ అభిమానులు ఎక్కువగా ఉన్నారని, ఆయన పర్యటిస్తే బాగుంటుందని చంద్రబాబును కోరారు. వారి అభ్యర్థన మేరకు చంద్రబాబు అక్కడే ఉన్న పవన్‌ను కోరారు. అవకాశముంటే నగరంలో మూడు నియోజకవర్గాలను కవర్ చేస్తూ పర్యటించాలన్నారు. చంద్రబాబు సూచనకు సానుకూలత వ్యక్తం చేసిన పవన్ తప్పకుండా విజయవాడలో పర్యటిస్తానన్నారు. గురువారం సాయంత్రం లేదా శుక్రవారం ఆయన పర్యటనకు ఏర్పాట్లు చేస్తామని టీడీపీ, జనసేన నాయకులు తెలిపారు.

విజయవాడ కేంద్రంగా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ల రాకెట్

ఏలూరు క్రైం, మే 8: జిల్లా రెవెన్యూ అధికారి పోస్టింగ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని వచ్చిన ఓ యువకుడితోపాటు అతడిని ఉద్యోగంలో చేర్పించడానికి వచ్చిన మరో వ్యక్తిపై ఏలూరు జిల్లా ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. నెల్లూరు జిల్లా కొండయ్యపాలేనికి చెందిన నాటకరాణి వెంకట్ ఈనెల 6వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌కు వచ్చి అక్కడ ఉన్న కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు వద్దకు వెళ్లాడు. తాను జిల్లా రెవెన్యూ అధికారిగా జాయిన్ కావడానికి వచ్చానని పోస్టింగ్ ఆర్డర్ చూపించాడు. సంబంధిత సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. బుధవారం వెంకట్‌తోపాటు గుంటూరు జిల్లా గుంటూరులోని రామాబిల్డింగ్ సెంటర్‌కు చెందిన పందిటి నాగార్జున అనే వ్యక్తిని తీసుకుని బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ ఆఫీస్‌కు వచ్చారు. తాను పంచాయతీరాజ్ కమిషనర్‌ను అంటూ ఐడీ కార్డును పందిటి నాగార్జున కలెక్టరేట్‌లో ఉన్న ఏవోకు పంపించాడు. ఆ కార్డు చూసి అవాక్కయిన ఏవో నకిలీ అని గుర్తించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ పేరు మీద ఎవరు ఏ పోటీ పరీక్షల్లో సెలెక్ట్ కాలేదని ధ్రువీకరించుకున్న తరువాత అది నకిలీ అపాయింట్‌మెంట్ అని గుర్తించి బుధవారం రాత్రి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఏఏవో విశ్వేశ్వరరావు ఫిర్యాదు చేశారు. త్రీ టౌన్ సీఐ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు రామారావు, ప్రసాద్ విచారణ చేపట్టారు. వెంకట్, నాగార్జునలను అదుపులోకి తీసుకుని వారిద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకట్‌తో పాటు అనేక మంది బాధితులు ఉన్నట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. విజయవాడ కేంద్రంగా ఒక ముఠా లక్షలాది రూపాయలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్నట్టుగా ప్రాథమికంగా గుర్తించారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల విధుల్లో అధికారులు.. చెలరేగిపోతున్న ఇసుకాసురులు!

కంచికచర్ల, మే 8 : అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండగా, అక్రమార్కులు ఇసుక దందాకు పాల్పడుతున్నారు. కంచికచర్ల మండలం మున్నలూరు రీచ్ పరిధిలో కృష్ణానదిలో యంత్రాలతో ఇసుక తవ్వేస్తున్నారు. ఇటీవల పోలీస్, రెవెన్యూ అధికారులు మున్నలూరు రీచ్‌లోకి వెళ్లకుండా రోడ్డుకు గండి కొట్టిన సంగతి విదితమే.



ఇసుక లారీ.. జీసీకేసీ పేరుతో వేబిల్లు(ఇన్‌సెట్)

మూడు రోజులు మిన్నకుండిన అక్రమార్కులు సిండికేట్‌గా ఏర్పడి ఇసుక దోపిడీ ప్రారంభించారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమార్కులు బరితెగిస్తూ నిర్భయంగా ఇసుక తవ్వి, లారీలకు లోడ్‌చేసి పంపుతున్నారు. దీనికి చెల్లుబాటుకాని 'జీసీకేసీ ప్రాజెక్టు అండ్ వర్క్సు ప్రైవేట్ లిమిటెడ్' వేబిల్లులు ఇస్తుండటం గమనార్హం. మంగళవారం రీచ్‌లో జోరుగా తవ్వకాలు జరుగుతుండటంతో స్థానికులు నెంబర్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాకను గమనించిన అక్రమార్కులు యంత్రాలను సమీపంలో లంక భూములకు తరలించగా రెండు లారీలను పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు.

వైసీపీకి భారీ షాక్

తిరువూరు, నందిగామ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల నుంచి భారీగా టీడీపీలోకి చేరికలు

విద్యాధరపురం, మే 8: విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. బుధవారం గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సమక్షంలో తిరువూరు, నందిగామ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. తిరువూరు నియోజకవర్గం తిరువూరు రూరల్ మునకళ్ల గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారిలో కృష్ణాజిల్లా గొర్రెల మేకల పెంపకందారుల సహకార యూనియన్ మాజీ చైర్మన్ జి.రామకృష్ణయాదవ్, యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచబంటి వెంకటాద్రియాదవ్, పరసా గోపీ కృష్ణ, పదిలం సత్యనారాయణ ఉన్నారు. నందిగామ నియోజకవర్గం నుంచి టీడీపీ కంచికచర్ల మండల అధ్యక్షుడు కోగంటి బాబు ఆధ్వర్యంలో వైసీపీ మండల అధ్యక్షుడు నన్నపనేని నరసింహారావు, వేములపల్లి సర్పంచ్ ఉయ్యూరు నరసింహారెడ్డి, నాయకులు గుడె శ్రీధర్, హనుమాన్‌రావు టీడీపీలో చేరారు. నన్నపనేని సాంబశివరావు, సీతారామరాజు, లక్ష్మీనారాయణ, బండారు పల్లి రాజు, ముక్కపాటి నరసింహారావు పాల్గొన్నారు. వీరులపాడు మండలం వెల్లంకి సర్పంచ్ షేక్ హుసేన్ బీ, ఆమె కుమారుడు షేక్ అబ్బి, వైసీపీ వార్డు సభ్యుడు కుడుపుగంటి యలమందతో పాటు 10 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. నూకవరపు శ్రీనివాసరావు, చిరుమామిళ్ల కృష్ణ పాల్గొన్నారు. టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి వైసీపీ మహిళా నాయకురాలు మోబీనా, నసీమా, సుల్తానాలు, 50వ డివిజన్‌కు చెందిన 100 మంది మహిళలు టీడీపీలో చేరారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన తిరువూరు నియోజకవర్గ నాయకులతో కేశినేని చిన్ని

కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు: కేశినేని చిన్ని

విజయవాడ లీగల్: "జగన్ తెచ్చిన నల్లచట్టం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్. దానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేసిన న్యాయపోరాటం ప్రజల్లో అవగాహన పెంచింది. వారిని చైతన్యవంతుల్ని చేసింది. న్యాయవాదుల కష్టానికి త్వరలోనే ఫలితం రాబోతుంది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే చంద్రబాబు ఆ చట్టాన్ని రద్దు చేస్తూ రెండో సంతకం చేస్తారు." అని కూటమి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో బుధవారం కూటమి తూర్పు, సెంట్రల్ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, బొండా ఉమాలతో కలిసి ఆయన న్యాయవాదులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కూటమికి మద్దతివ్వాలని గద్దె రామ్మోహన్, బొండా ఉమా అన్నారు. బార్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, కార్యదర్శి అరిగల శివరాంప్రసాద్(రాజా), గండూరి రామశర్మ, కలతోటి క్రాంతికుమార్, ఎస్.రాజ్యలక్ష్మి, చెన్నుపాటి ఉషారాణి, గడ్డం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత ఎల్లయ్య హత్య కేసులో కీలక మలుపు

- బండిపాలెం ఫారెస్టులో సగం కాలి, లభ్యమైన శవం.. కూలీలు, పశువుల కాపరులు చూసి వీఆర్వోకు సమాచారం
- ఎల్లయ్యదేనని పోలీసులకు తెలిపిన బంధువులు

జగ్గయ్యపేట, మే 8: రెండు తెలుగు రాష్ట్రాల పోలీసులను ముప్పతిప్పలు పెట్టిన తెలంగాణలోని సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే ఎల్లయ్య (58) హత్య కేసు కీలకమలుపు తిరిగింది. బండిపాలెం ఫారెస్టు ప్రాంతంలో బుధవారం జగ్గయ్యపేట పోలీసులు ఎల్లయ్య మృతదేహాన్ని సగం కాలి, చిక్కి శల్యమైన స్థితిలో గుర్తించారు. మంగళవారం బండిపాలెం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు, పశువుల కాపరులు ఫారెస్టులో శవం దుర్వాసన వస్తోందని గ్రామపెద్దలకు చెప్పటంతో వీఆర్వో బాబూరావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయం జగ్గయ్యపేట సీఐ జానకీరాం సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతంలో తవ్వించగా సగం కాలి, చిక్కి శల్యమై గుర్తించలేని స్థితిలో ఉన్న శవం బయటపడింది. సూర్యాపేటలోని ఎల్లయ్య కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఎల్లయ్యదేనని గుర్తించారు. ఎల్లయ్య మృతదేహానికి అక్కడే రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించగా, జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులతో పోస్ట్‌మార్టమ్ నిర్వహించారు. గత ఏప్రిల్ 18న సూర్యాపేట నుంచి అపర్ణ, శ్రీనివాస్ అనే దంపతుల పంచాయితీకి వచ్చి కనిపించకుండా పోయినట్టు ఎల్లయ్య సోదరుడు సతీష్ జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. అప్పటికే ఎల్లయ్యపై పలు హత్యకేసులతో పాటు 18 కేసులు ఉండటంతో ఆయన ప్రత్యర్థులు ప్రతీకారం తీర్చుకుని ఉంటారని పోలీసులు భావించారు. ఎల్లయ్య తనతోపాటు పంచాయితీకి కోదాడకు చెందిన మొగిలిచర్ల అంజయ్య అనే స్నేహితుడిని తీసుకుని రావటంతో అదృశ్యం వ్యవహారం బట్టబయలైంది. శ్రీనివాస్ డబ్బులు ఇస్తానని ఎల్లయ్యను తీసుకెళ్లటం, అపర్ణ వాష్‌రూంకి వెళ్లాలని చెప్పి కనిపించకుండా పోవటం, ఆ తర్వాత శ్రీనివాస్, అపర్ణ, ఎల్లయ్యల మొబైల్స్ స్విచ్ఛాఫ్ కావటంతో అంజయ్యకు అనుమానం వచ్చి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా జగ్గయ్యపేట, సూర్యాపేట పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు.

నమ్మకంగా తీసుకెళ్లి..

అంజయ్య ఇచ్చిన సమాచారంతో జగ్గయ్యపేటలో రైల్వే స్టేషన్‌రోడ్డులో ఒక ఇల్లు ఎల్లయ్య హత్యకు ఉపయోగించినట్టు పోలీసులు గుర్తించారు. ఎల్లయ్యను నమ్మకంగా తీసుకెళ్లి కళ్లలో కారం చల్లి రాడ్‌తో కొట్టి హత్య చేసినట్టుగా పోలీసులకు సాక్ష్యాధారాలు లభించాయి. శవం దొరక్కపోవటం నిందితులు కొత్త సిమ్‌లు, ఫోన్లు ఉపయోగించి మాట్లాడి, అనంతరం వాటిని ఆపేయటంతో రెండు రాష్ట్రాల పోలీసులకు కేసు సవాల్‌గా మారింది. రెండు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా 9 బృందాలుగా ఏర్పడి నిందితులు, ఎల్లయ్య శవం కోసం గాలించారు. జగ్గయ్యపేటలో కృష్ణా పరివాహక ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో డ్రోన్లతో అన్వేషణ చేసినా ఫలితం లేకపోయింది. గత నెల 25న జగ్గయ్యపేట జాతీయ రహదారిపై కొణకంచి ఎల్లయ్య సూర్యాపేట నుంచి వేసుకుని వచ్చిన టీఎస్. 29 బి 9495 నెంబరు కారు కొణకంచి క్రాస్ రోడ్డు వద్ద ఒక కర్మాగారం వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 2న హైదరాబాద్‌కు చెందిన మాజీ నక్సలైట్ తాడూరి శ్రీకాంతాచారి (35)ను జగ్గయ్యపేటలో పోలీసులు అరెస్టు చూపించారు.

పోలీసులను తప్పుదోవ పట్టించేలా..

రియల్ ఎస్టేట్ వివాదాల్లో తనను చంపేస్తానని ఎల్లయ్య బెదిరించటంతో అన్నంత పనిచేసే ఎల్లయ్యను అడ్డు తొలగించుకోవాలని హత్య చేసినట్టు ప్రధాన నిందితుడు శ్రీకాంతాచారి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. నల్గొండకు చెందిన అతడికి ఎల్లయ్యకు అనేక వివాదాలు వచ్చినట్టు చెప్పారు. జగ్గయ్యపేటలో హత్య చేసి ఎల్లయ్య శవాన్ని చేపలు పార్సిల్ చేసే బాక్సులో వేసి చిల్లకల్లు వద్ద టోల్‌గేట్ తగలకుండా మరో మార్గంలో తరలించి వైజాగ్‌కు వెళ్లే వాహనంలో పంపించేశామని, అక్కడ తన మనిషి సముద్రంలో కలిపేశారని పోలీసులను తప్పుదోవ పట్టించారు. హత్యలో తనతోపాటు వచ్చిన ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు ఉన్నారని పేర్కొన్నట్టు పోలీసులు చెప్పారు. శవం దొరకకుండా చేస్తే ఈ కేసులో సులువుగా తప్పించుకోవచ్చన ఆలోచనతో పోలీసులను ఉద్దేశ్యపూరకంగా తప్పుదోవ పట్టించారు. అతనితో పాటు హత్యలో పాల్గొన్నట్టు అనుమానిస్తున్న వ్యక్తి ఇచ్చిన సమాచారం, బండిపాలెం గ్రామస్థుల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయటంతో ఎల్లయ్య మృతదేహం బయటపడింది. హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉన్నవారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. త్వరలో కేసులో ఉన్న మిగిలిన నిందితులను పట్టుకుంటామని జగ్గయ్యపేట సీఐ జయరాం తెలిపారు.



నన్నపనేని నరసింహారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న సౌమ్య

నన్నపనేని చేరికతో కంచికచర్లలో టీడీపీకి మరింత బలం

కంచికచర్ల: కంచికచర్ల ప్రాంతంలో ఆర్థిక, అంగబలంతో పాటు పలుకుబడి కల్గిన పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు వైసీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు బుధవారం టీడీపీలో చేరారు. దీంతో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ శ్రేణులు అంటున్నాయి. సొసైటీ అధ్యక్షునిగా, మండల పరిషత్ సభ్యుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. వైసీపీలో సరైన గుర్తింపు లేకపోవటంతో కొంతకాలంగా ఆయన అసంతృప్తిగా ఉన్నారు. వైసీపీని వీడుతున్నారని సమాచారం తెలియగానే ఆ పార్టీ నందిగామ అభ్యర్థి మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఇతర నాయకులు స్వయంగా నన్నపనేని ఇంటికి వెళ్లి బుజ్జగించినా బుధవారం కేశినేని చిన్ని సమక్షంలో విజయవాడ వెళ్లి టీడీపీలో చేరారు. నందిగామ వచ్చి కూటమి నందిగామ అభ్యర్థి తంగిరాల సౌమ్యను కలిశారు. పార్టీ కండువా కప్పి సౌమ్య ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. నరసింహారావు అనుచరవర్గమంతా రెండు రోజుల్లో టీడీపీలో చేరనుంది.

ఎ.కొండూరులో కిడ్నీ మరణం

ఎ.కొండూరు, మే 8 : మండలంలో కిడ్నీ వ్యాధి మరణమృదంగం మోగిస్తున్నది. కిడ్నీ వ్యాధి బాధితులు ఒక్కొక్కరుగా మృతి చెందుతున్నారు. మత్రియా తండాకు చెందిన కేశావతు సోమ్లా (55) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక స్థోమత లేక అప్పులు చేసి వైద్యం చేయించుకున్నాడు. వ్యాధి తీవ్రతతో బుధవారం సోమ్లా మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని తిరువూరు కూటమి అభ్యర్థి శ్రీనివాసరావు భార్య మాధవి పరామర్శించి మట్టిఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు.



సోమ్లా (ఫైల్)

తలసేమియా రోగులకు నాణ్యమైన వైద్యం

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తలసేమియా రోగులకు అందించాల్సిన సేవలపై సమగ్ర విధానాన్ని తయారు చేయాలని ఆరోగ్యశాఖ కమిషనర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబులు తలసేమియా, హిమోఫిలియాపై మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లోని బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఐఈసీ సెంటర్లల్లో తలసేమియా రోగులు పూర్తి వివరాల్ని అందజేయాలని ఆయన సూచించారు. తలసేమియా పింఛన్లు తీసుకుంటున్న రోగుల వివరాల్ని అందజేయాలని, నాణ్యమైన వైద్య సేవలందించాలని నోడలాఫీసర్ డాక్టర్ సుజాతను ఆదేశించారు. రాష్ట్రంలోని 13 ఐపీహెచ్ఎల్‌ల ఏర్పాటుకు సివిల్, ఎలక్ట్రికల్ పనుల్ని నెలాఖరుకల్లా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు.

ఏపీ ఈసెట్‌కు 36,369 మంది హాజరు

అనంతపురం సెంట్రల్, మే 8: బీటెక్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాల కోసం పాలిటెక్నికల్ డిప్లొమా విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఏపీ ఈసెట్-2024 పరీక్షలకు 36,369 మంది హాజరయ్యారని సెట్ నిర్వాహక కమిటీ చైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 37,767 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని, 96.30 శాతం మంది హాజరయ్యారని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	294
చికెన్ స్కిన్‌లెస్	304

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85

సుజనా చౌదరి గెలుపు ..పేద ప్రజల అభివృద్ధికి మలుపు

బీజేపీ అధికార ప్రతినిధి విల్సన్

విద్యాధరపురం, మే 8: పశ్చిమలో సుజనా చౌదరి గెలుపు పేద ప్రజల అభివృద్ధికి మలుపు అవుతుందని బీజేపీ అధికార ప్రతినిధి ఆర్.డి విల్సన్ అన్నారు. భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాలమహాసభ అధ్యక్షుడు బండి బాలయోగి, నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు కే.వి రామారావు, వేమూరి సీతారామయ్య తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయగల సత్తా ఒక్క సుజనా చౌదరికే ఉందని చెప్పారు. ప్రజలు ఆయనను నమ్ముతున్నారని అందుకే ఆయన గెలుపు పేదల అభివృద్ధికి మలుపు అని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

ప్రధాని రోడ్ షోకు తరలిన నాయకులు



రోడ్ షోకు తరలి వెళుతున్న తెలుగు యువత నాయకులు

విద్యాధరపురం, మే 8: బందర్‌రోడ్డులో ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల రోడ్‌షోలో పాల్గొనేందుకు 40వ డివిజన్ నుంచి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చినవెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో భారీగా మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు వెళ్లారు.

చిట్టినగర్: పశ్చిమ తెలుగుయువత ఆధ్వర్యంలో బుధవారం చిట్టినగర్ ఆంజనేయవాగు నుంచి తెలుగుయువత నాయకులు ర్యాలీగా బందరు రోడ్డులో జరుగుతున్న ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షోకు తరలి వెళ్లారు. పలువురు తెలుగుయువత నాయకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రోడ్‌షోకు కూటమి నేతలంతా ఒకటయ్యారు. కొత్త జోష్‌తో సమన్వయంతో ఉత్సాహంగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో యువ కార్యకర్తలు టీ షర్టులు ధరించి బైకుల్లో, ఆటోల్లో, కార్లలో బుధవారం సాయంత్రం ఇందిరాగాంధీ స్టేడియంకు చేరుకున్నారు. ఊర్మిళానగర్ నుంచి సీనియర్ టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు మహిళలు, కార్యకర్తలు వెళ్లే వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు మోరబోయిన రాంబాబు, అచ్చిరెడ్డి, మెట్టెల నరసింహారావు, మోడీ వెంకట్రాజు, కాకర్ల కోటి, నారుబోయిన పెద్దిరాజు, రావులపల్లి ఏడుకొండలు, పొదిలి ప్రసాద్, రాయల శివ, బత్తుల వెంకట్రావులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

కేశినేని జానకీ లక్ష్మి



మహిళలను చైతన్యపరుస్తున్న కేశినేని జానకీ లక్ష్మి

పాయకాపురం, మే 8 : రాష్ట్రంలో మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని కేశినేని జానకీ లక్ష్మీ అన్నారు. 64వ డివిజన్ కండ్రిక కాలనీలో డివిజన్ మహిళలతో బుధవారం మాటా మంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు అమలు చేయనున్న వివిధ పథకాలను వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన రివర్స్ పాలనను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా కేశినేని జానకీ లక్ష్మీ మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు.

రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావులను గెలిపించాలని కోరారు. నేతలు బొండా సుజాత, పరుచూరి ప్రసాద్, వరలక్ష్మీ, అర్చన, అప్పలనాయుడు, వింజమూరి సతీష్, కంది శ్రీను, కోరాడ రమణ పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన

వన్‌టౌన్, మే 8: తలసేమియా వ్యాధితో శరీరం క్షీణిస్తుందని, హిమోగ్లోబిన్ తక్కువ స్థాయిలో ఉంటుందని, ఎముకల సాంద్రత తగ్గి బలహీనులవుతారని న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, న్యూసిటీ బ్లడ్‌బ్యాంకుల ఆధ్వర్యంలో బుధవారం తలసేమియా వ్యాధిపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తలసేమియా వ్యాధి గురించి వివరించారు. ఇది వంశపారంపర్యంగా వస్తుందని చెప్పారు. వ్యాధి నిర్ధారించేందుకు ఉన్న టెస్టులను ఆయన వివరించారు. ఒక్క బ్లడ్ శాంపిల్‌తోనే ఈ టెస్టులన్నీ చేయవచ్చన్నారు. పౌష్టికాహార లోపంవల్ల, మేనరిక వివాహాలు, జన్యుపరమైన లోపాల వల్ల ఈ వ్యాధి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారని తెలిపారు. బాలసేవ పథకం కింద తలసేమియా రోగులకు ఆర్థిక సహాయం అందిస్తారని చెప్పారు. ఫోలిక్‌యాసిడ్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తలసేమియా సంకేతాలను తగ్గించవచ్చునన్నారు. కాయ, ధాన్యాలు, గుడ్డు పచ్చసొన, ఎండిన బీన్స్ చిలగడదుంపలు, హోల్‌గ్రెయిన్ బ్రెడ్, సోయా ఉత్పత్తులు, స్వీట్ బఠానీలు, గింజలు, అరటిపండ్లు తదితరాలతో పాటు రోజూ రెండు గ్లాసుల పాలు తీసుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చునన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పల్లా రవీంద్ర కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మదన్‌మోహన్

దిగజారుడు రాజకీయాలు చేస్తున్న టీడీపీ, వైసీపీ

● సీహెచ్ బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, మే 8 : సెంట్రల్‌లో ప్రశాంత వాతావరణానికి భగ్నం కలిగించేలా వైసీపీ, టీడీపీలు ప్రవర్తిస్తున్నాయని ఇది మంచి పరిణామం కాదని సీపీఎం సెంట్రల్ అభ్యర్థి సీహెచ్ బాబూరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన వెలంపల్లి శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావులు బజారు రౌడీల్లా రోడ్లపై గొడవలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమాలను గాలికి వదిలి గెలుపే లక్ష్యంగా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఎం వైపు ప్రజలు నిలబడాలని పిలుపునిచ్చారు.

13 పోలింగ్ బూత్‌ల పరిధిలో ముమ్మర ప్రచారం

విద్యాధరపురం, మే 8: 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చినవెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో 13 పోలింగ్ బూత్‌ల పరిధిలో 130 మంది కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిని, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ని గెలిపించాలని కోరారు.

చిట్టినగర్: నియోజకవర్గ అభివృద్ధి సుజనా చౌదరి, చిన్నిలతోనే సాధ్యమని యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ అప్పికట్ల జవహర్ అన్నారు. బుధవారం 46,47 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి. టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాద్ (చిన్ని)లను గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

కళాకారులను భ్రష్టు పట్టించిన జగన్

● గుమ్మడి గోపాలకృష్ణ

విద్యాధరపురం, మే 8: కళాకారులను ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని సీనియర్ నాయకుడు ప్రముఖ కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో కళాకారులు ఎదుర్కొన్న అనేక అంశాలను ప్రస్తావించారు. కళారంగాన్ని కళాకారులను జగన్మోహన రెడ్డి వీధిన పడేటట్లు చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బీసీలు చంద్రబాబు వెంటే

భవానీపురం, మే 8 : బీసీల అభ్యున్నతికి పలు పథకాలను అమలు చేసిన చంద్రబాబు నాయుడును బీసీ వర్గాలు సీఎంగా ఎన్నుకొనేందుకు సిద్ధంగా ఉన్నారని, బీసీలంతా ఆయన వెంట ఒకే తాటిపై నడవాలని 43వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య పిలుపునిచ్చారు. ఎంపీగా కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిల విజయాన్ని కాంక్షిస్తూ బూత్ నెంబర్ 18 పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈవీఎంలో గుర్తుల నెంబర్లను కొండయ్య ఓటర్లకు వివరించారు. మల్లెబోయిన కొండ, ఏడుకొండలు, శ్రీకాంత్ బాలు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఎంపీగా శివనాథ్‌ను, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఖాజా, విజయవాడ నాయకులు షేక్ అఖారుద్దీన్ నాగసాయిలు 41వ డివిజన్‌లోని మసీదు వీధిలో బూత్ నెంబర్‌లో 23లో విస్తృత ప్రచారం నిర్వహించారు. షేక్ రియాజ్, సురేష్, సంతోష్, షేక్ ఆరీఫ్, కమల్, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్

భారతీనగర్, మే 8: ఆర్యవైశ్యులకు కష్టసుఖాల్లో అండగా ఉంటామని విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. ఏపీ ఆర్యవైశ్య మహిళా విభాగ అధ్యక్షురాలు కొప్పురావూరి రజిని ఆధ్వర్యంలో బుధవారం గురునానక్ కాలనీలోని కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో ఏపీ ఆర్యవైశ్య మహిళా విభాగ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ చంద్రబాబు ఆర్యవైశ్యుల ఆకాంక్షలు ప్రతి బింబించేవిధంగా కొణిజేటి రోశయ్య స్మృతి వనం ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు వివరించారు. ఆర్యవైశ్య నాయకులతో చంద్రబాబు మాట్లాడి వాసవీ మాత ఆత్మార్పణం రోజును వేడుకగా ప్రభుత్వం అధికారంగా నిర్వహించే అంశాన్ని కూడా మేనిఫెస్టోలో పెట్టినట్లు తెలిపారు. బీజేపీ, జనసేన బలపరిచిన తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను , టీడీపీ పార్లమెంట్ అభ్యర్థిగా తనను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు డూండీ రాకేష్, ఆర్య వైశ్యమహాసభ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, టీడీపీ నాయకులు కొణిజేటి రమేష్, దర్శివాసు, వి.వి.కె.నరసింహారావు, ఆర్యవైశ్య మహిళా విభాగ సభ్యులు పసుపర్తి నాగలక్ష్మి, మారం రోజా, గార్లపాటి విద్యావతి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కేశినేని శివనాథ్, గద్దె రామ్మోహన్, తదితరులు

కార్మికుల పొట్టకొట్టిన జగన్

గద్దె, చిన్ని

విద్యాధరపురం: వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం కార్మిక సంక్షేమ నిధిని పక్కదోవ పట్టించి ఇతర అవసరాలకు వినియోగించి కార్మికుల పొట్టకొట్టారని కూటమి బలపరచిన తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ముఠా కార్మిక సంఘ సమావేశంలో ముఖ్య అతిథిగా గద్దె పాల్గొని మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి కూడా అమరావతిని రాజధానిగా స్వాగతిస్తున్నామని చెప్పారని ఆ తరువాత మూడు రాజధానులను ప్రకటించిన వెంటనే లక్షమంది కార్మికులు వివిధ ప్రాంతాలకు తరలివెళ్లిపోయారన్నారు. ముఠా కార్మికుల పొట్టకొట్టారని విమర్శించారు. కార్మిక సంక్షేమ నిధులను జగన్మోహనరెడ్డి వేరే వ్యయాలకు వినియోగించారని చెప్పారు.

కేశినేని శివనాథ్ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలన్నా, వారికి ఉద్యోగాలు రావాలన్నా ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, గొల్లపూడి నాగేశ్వరరావుతో పాటు ముఠా కార్మిక సంఘం నాయకులు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

పెన్షనర్లను మోసం చేసిన జగన్‌ను ఓడించాలి

ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం అమరావతి విభాగం పిలుపు

విద్యాధరపురం, మే 8: పెన్షనర్లను మోసం చేసిన జగన్మోహన రెడ్డిని ఓడించాలని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం అమరావతి విభాగం ఓటర్లకు పిలుపునిచ్చింది. భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎన్‌డీఏ అభ్యర్థులు, పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిని గెలిపించాలంటూ పెన్షనర్ల సంఘం ముద్రించిన కరపత్రాలను సుజనా చౌదరి ఆవిష్కరించారు. అనంతరం పెన్షనర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.30వేల కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వ విధానాలతో అందరి బతుకులు బయటపడ్డాయని విమర్శించారు. ఎన్నికల్లో జగన్మోహనరెడ్డిని ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ సచివాలయ సంఘం మాజీ అధ్యక్షుడు గురవయ్య, ఏపీ ఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు, అఖిలభారత పెన్షనర్ల సమాఖ్య మాజీ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావుతో పాటు విజిడం చౌదరి, సి.నాగరాజు, అచంట రామానాయుడు, డి.క్రిష్టోఫర్, ఆర్.రామమూర్తి నాయుడు, వి.కృష్ణంనాయుడు, పి.పిచ్చయ్య, సీహెచ్ సుభాష్ చంద్రబోస్, సీహెచ్ శ్రీనివాసరావు, పి.వెంకటనరసయ్య, వై.దాసయ్య, వి.పద్మనాభం ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సుజనా చౌదరి

మైనార్టీల పక్షపాతి చంద్రబాబు : షేక్ కరీముల్లా

భవానీపురం: ముస్లిం మైనార్టీల పక్షపాతిగా పలు పథకాలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబును సీఎంగా చేయడంతో పాటు కూటమి అధికారంలోకి తీసుకురావడానికి మైనార్టీలు కీలక పాత్ర పోషించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, సీనియర్ కార్పొరేటర్ షేక్ షేరీముల్లా పిలుపునిచ్చారు. నాలుగు స్తంభాల సెంటర్, రామమందిరం, గుప్తాసెంటర్లలో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరిని, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు పాలనలో ప్రజాసంక్షేమం

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, మే 8 : చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువతకు ఉద్యోగాలు లభించాయని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 10వ డివిజన్ పరిధిలోని నిర్మలా కాన్వెంట్ ఏరియా, వర్క్‌మెన్ పేట, వాసవ్యనగర్‌ల్లో అనురాధ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీలు బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆమె ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ జగన్‌ను సాగనంపి చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని అనురాధ ఓటర్లను అభ్యర్థించారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పాలగాని జగన్‌మోహన్‌రావు, మన్నవ జయప్రకాష్, ఎం.సూర్యకుమారి,పి. గోపిచంద్, వాసు, రామకృష్ణలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ, దేవినేని అపర్ణ

మంచి చేసిన వారికి ఓటేయండి : గద్దె క్రాంతి

గుణదల: తూర్పులో దందాలు...దౌర్జన్యాలు లేకుండా మంచి చేసిన వారికి ఓటు వేసి గెలిపించండి, .దౌర్జన్యాలు...దందాలకు పాల్పడిన వారిని ఓటుతో తరిమికొట్టండని టీడీపీ యువ నాయకుడు గద్దె రాజేష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 2వ డివిజన్ పరిధిలోని పడవలరేవు సెంటర్ నుంచి దేవినేని నగర్ కొండ ప్రాంతంలో బుధవారం ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఏపీలో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణప్రసాద్, కోయా శ్రీమన్నారాయణ, జి.నాగుల్ మీరా, కె.కోటేశ్వరరావు, పి.రత్నశ్రీ, యలమంచిలి రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిన జగన్ : బొండా ఉమా



ఎన్నికల ప్రచారంలో బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, మే 8 : రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్‌లో టీడీపీ నేతలు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రతిపక్షాలను తుదముట్టించాలని చూస్తున్న జగన్ భస్మాసురునిలా కనుమరుగు కాకతప్పదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, పిరియా సోమేశ్వరరావు, రామారావు, జగదాంబ, గౌస్ పాల్గొన్నారు.

మహాదానం నేత్రదానం : డాక్టర్ సమరం

వన్‌టౌన్, మే 8: నేత్రదానం సర్వోన్నతమైనదని, నేత్రదానం ద్వారా మరొకరికి కంటి వెలుగును ఇవ్వవచ్చునని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సమరం అన్నారు. బుధవారం కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మూఢనమ్మకాలు, గుడ్డి విశ్వాసాల కారణంగా అవయవదానం చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. మనం మరణించిన తరువాత కళ్లను దానం చేయడం ద్వారా ఎంతోమంది అంధులకు చూపు ప్రసాదించవచ్చునని చెప్పారు. అవయవదానాన్ని ప్రోత్సహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. ప్రాజెక్ట్ అధికారులు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, శాంతిబాబు, కల్మబేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సమరం

ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాంపై నేడు సమావేశం

భారతీనగర్, మే 8: నూరు శాతం ఓటింగ్ జరిగే విధంగా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం అనే అంశంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఎఫ్‌డీ ప్రధాన కార్యదర్శి డా.నిమ్మగడ్డ రమేష్‌కుమార్, సహాయ కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య విశ్వవిద్యాలయం సమీపంలోని ది వెన్యూ ఫంక్షన్ హాలులో గురువారం ఉదయం 10గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందని వారు తెలిపారు.



మాట తప్పిన వైసీపీ ప్రభుత్వం

అక్కుమహంతి రాజా, ఆర్టీసీ ప్రయాణికుల సంఘం నేత

ఎన్నికల ముందు 2019లో ఆర్టీసీ చార్జీలు పెంచబోమని వైసీపీ ప్రభుత్వం వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చాక పెంచేసింది. దీంతో సామాన్య ప్రయాణికులపై అధిక బారం పడింది. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే బస్సులు కూడా తగ్గించేశారు. పాత బస్సులు కావడంతో బస్సులు వేగంగా వెళ్లడం లేదు. కొన్ని బస్సులైతే గుంతల్లో పడినప్పుడు ఆగిపోయే పరిస్థితి ఉంది.

రాష్ట్రంలో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ బస్సుల చార్జీలు పూర్తిగా తగ్గించేస్తాం.. అంటూ ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పిన వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక బాదుడే.. బాదుడంటూ చార్జీలు తెగ బాదేస్తున్నాడు... - మచిలీపట్నం

బస్సు భారం



- పెరిగిన ఆర్టీసీ చార్జీలతో సామాన్యుడికి చుక్కలు
- ఎన్నికల ముందు చెప్పిందొకటి.. తీరా అధికారంలోకి వచ్చాక చేసింది మరోటి ..

ఎన్నికల ముందు వైసీపీ నేతలు ఆర్టీసీ చార్జీలు పెంచమని కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చాక పెంచేశారు. కాలం చెల్లిన బస్సుల్లో మోకాలు లోతు గుంతల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడం ఒక సాహసమే. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల అవస్థలు ఇన్నీ అన్నీ కావు. బస్సు ఏ సమయానికి వస్తుందో తెలియదు. గంటల తరబడి నిరీక్షించేందుకు ప్రయాణికులు అలవాటు పడిపోయారు. కనీస చార్జీ రూ.5గా ఉండే చార్జీ ప్రస్తుతం రూ.10కి పెంచేశారు. 7 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే రూ.20 వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుంచి పెడనకు గతంలో రూ.10 ఉండేది. ఇప్పుడు రూ.20కి పెంచేశారు. దీంతో సామాన్య ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్సు చార్జీ, ఆటో చార్జీ ఒకటే కావడంతో గ్రామాల్లోని ప్రయాణికులు ఆటోలు ఎక్కేస్తున్నారు. పెడన నుంచి జిల్లా కేంద్రానికి రోజూ వెళ్లేవారు ఎందరో ఉన్నారు. చార్జీలు పెరగడంతో వారు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గతంలో మచిలీపట్నం నుంచి చల్లపల్లికి రూ.20లు ఉండే చార్జీని రూ 30కి పెంచేశారు. నిడుమోలుకు రూ.20 చార్జీని రూ.30కి పెంచేశారు. గుడివాడకు రూ.30 నుంచి రూ.40కు, బంటుమిల్లికి రూ.30 నుంచి రూ.40కు పెంచేశారు. ఇలా బస్సు చార్జీలు పెంచడంతో ప్రయాణికులు ఆర్థికంగా కుంగిపోయారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులు మచిలీపట్నం డిపోలో 35 సర్వీసులున్నాయి. అవనిగడ్డ డిపోలో 19, గుడివాడలో 24 ఉన్నాయి.

ఇంత ఎత్తున చార్జీలు ఎప్పుడూ పెంచలేదు

మాదివాడ రాము, ప్రయాణికుల సంఘం నేత



ఆర్టీసీ చార్జీలు ఇంత భారీగా పెంచిన దాఖలాలు లేవు. మచిలీపట్నానికి వచ్చే రోల్డుగోల్డు, వ్యవసాయ కార్మికులు బస్సులు ఎక్కేందుకు భయపడుతున్నారు. వాళ్లకు వచ్చే రోజు వారీ కూలీలో సగానికి సగం బస్సు చార్జీలకే పోతుంది. గ్రామీణ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులపై పాలకులు దృష్టి సారించడం లేదు. బస్సులు శుభ్రంగా ఉండటం లేదు. మరమ్మతులు కూడా చేయించడం లేదు.

- తాత్కాలిక ఆర్థిక ప్రయోజనానికి సీఎం జగన్ అంగీకారం
- విద్యుత్ సవరణ చట్టం వస్తే రైతులే బిల్లులు చెల్లించాలి
- అలా చెల్లించాల్సి వస్తే వ్యవసాయాన్ని వదులుకోవాల్సిందే
- తోట్లవల్లూరు మండలంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

రైతు నెత్తిన స్మార్ట్ పిడుగు



దేశంలో ఎక్కడా లేని స్మార్ట్ మీటర్లు ఏపీ రైతులపైనే ప్రయోగం

తోట్లవల్లూరు, మే 8: తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే సీఎం జగన్ రైతుల నెత్తిన స్మార్ట్ మీటర్ల పిడుగు వేశారు. దేశంలో ఏ రాష్ట్రం సాహసించని విధంగా, చివరకు పక్క రాష్ట్రం తెలంగాణలో సైతం తనపీక తెగిపడినా స్మార్ట్ మీటర్లకు అంగీకరించేదిలేదని నాటి సీఎం కేసీఆర్ తెగేసి కేంద్రానికి చెప్పినప్పటికీ ఏపీలో మాత్రం తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాన్ని ఆశించి జగన్ ఈ స్మార్ట్ మీటర్లకు పచ్చజెండా ఊపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సైతం అక్కడ సీఎంలు ఈ స్మార్ట్ మీటర్లను అంగీకరించలేదు. రాష్ట్రంలో ప్రథమంగా శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరిగింది. అక్కడ ఒక్కో మోటారుకు నెలకు రూ.3 నుంచి రూ.4వేల వరకు బిల్లులు వస్తున్నాయని రైతు సంఘాలు రాష్ట్రమంతా కోడై కూశాయి. ఉచిత విద్యుత్ పథకం ఉండటంతో ఆ బిల్లులను ప్రస్తుతం ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాలకులు చెప్పుకొచ్చారు. దాంతో ఈ మీటర్లతో ఇబ్బంది లేదన్న అభిప్రాయానికి రైతులు రావటంతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



మండలంలో 5,200 స్మార్ట్ మీటర్లు

కృష్ణాజిల్లాలోని తోట్లవల్లూరు మండలంలోనే అధికంగా వ్యవసాయ మోటార్లున్నాయి. దీంతో మండలానికి 5,200 స్మార్ట్ మీటర్లు వచ్చాయి. ముందుగా ఎలాంటి ప్రచారం లేకుండా పాములలంకలో వైసీపీకి చెందిన నేత పొలంలో స్మార్ట్ మీటర్లు బిగించారు. ఎవరూ వ్యతిరేకించకపోవటంతో లంకల్లో వెయ్యి మోటార్లకు స్మార్ట్ మీటర్లను స్వేచ్ఛగా బిగించారు. ఎన్నికలు రావటంతో స్మార్ట్ మీటర్ల బిగించే ప్రక్రియకు విరామం ఇచ్చినట్లు తెలిసింది.

భవిష్యత్తులో రైతులే బిల్లులు చెల్లించే ప్రమాదం

ఈ స్మార్ట్ మీటర్లతో ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పు రైతులకు లేదు. ఎందుకంటే ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. అయితే భవిష్యత్‌లో మాత్రం ఖచ్చితంగా బిల్లుల చెల్లింపు రైతులపైనే పడే ప్రమాదం ఉందని రైతు సంఘాల నేతలు అంటున్నారు. స్మార్ట్ మీటర్లు ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమని సీపీఎం నేతలు గుర్తు చేస్తున్నారు. అందుకే కేంద్రప్రభుత్వం విద్యుత్ సవరణ చట్టం 2023 తెచ్చిందని, అది అమలైతే విద్యుత్ సంస్థలన్నీ ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళతాయంటున్నారు. ప్రైవేటు కిందకు వెళితే ఉచిత విద్యుత్ పథకం ఉండదు. అప్పుడు రైతులు బిల్లులు చెల్లించే అవకాశం వస్తుందంటున్నారు. ఆ పరిస్థితి వస్తే ఇక వ్యవసాయం చేయటం దుర్లభమని, ఏడాదికి ఒక మోటారుకి రూ.60వేల వరకు బిల్లులు చెల్లించి ఏ రైతు వ్యవసాయం చేయలేరంటున్నారు. వంటగ్యాస్‌కి పూర్తిధర చెల్లిస్తే కేంద్రం మొదట్లో రూ.400 సబ్సిడీని వినియోగదారుడి అకౌంట్లో వేసేదని, నిదానంగా ఇపుడు రూ.15కు తగ్గించేసినా ఎవరూ ప్రశ్నించలేని పరిస్థితిని కల్పించారని, రేపు విద్యుత్ బిల్లుల విషయంలోనూ ఇదే జరుగుతుందని, లేకుంటే ఇంత ఖర్చుపెట్టి స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తారని చెబుతున్నారు. ఈ పరిస్థితులను ఊహించే దేశంలో ఏ రాష్ట్రం స్మార్ట్ మీటర్లకు అంగీకరించకున్నా సీఎం జగన్ ఒప్పుకుని రైతుల నెత్తిపై పిడుగును పెట్టారని, అది బిల్లుల రూపంలో ఎప్పుడైనా పేలనుందని చెప్పవచ్చు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే కనుక ఉచిత విద్యుత్ పథకాన్ని స్మార్ట్ మీటర్లు, కేంద్రం కారణాన్ని చూపి ఎత్తేసే అవకాశం ఉంది.

ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకే రాష్ట్రం ఒప్పుకుంది

ఎం హరిబాబు, రాష్ట్ర కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి



స్మార్ట్ మీటర్లు వ్యవసాయరంగాన్ని పూర్తిగా దెబ్బతీయనున్నాయి. నిబంధనల ప్రకారం ఈ స్కీం పనిచేస్తే రైతులు పంటలను పండించలేరు. 2025కి వ్యవసాయరంగానికి సబ్సిడీలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎరువులపై సబ్సిడీలను తగ్గించేసింది. ఈ స్మార్ట్ మీటర్లలో సెల్‌ఫోన్‌లో లాగా పోస్ట్‌పెయిడ్ చిప్‌లాంటిది ఉంటుంది. డబ్బులుంటేనే మోటారు పనిచేస్తుంది లేకుంటే ఆగిపోతుంది. కేంద్రం చేతుల్లోకి వెళ్లటంతో మోటార్లు ఆగిపోతే ఏదైనా సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా వీలుపడదు. ప్రతి రైతు ఎంత కరెంటు వాడుకుంటున్నాడో తెలుసుకునేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పటం రైతులను మోసగించటమే. కరెంటు ఎంత ఖర్చవుతుందో తెలుసుకోవాలంటే సబ్‌స్టేషన్‌లో ఫీడర్ వద్ద ఒక స్మార్ట్ మీటర్ బిగిస్తే సరిపోతుంది. అదిచేయకుండా రాష్ట్రమంతా మీటర్లు బిగించటం పెద్దకుట్రలో భాగం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకు అంగింకరించకపోయినా సీఎం జగన్ అత్యుత్సాహంతో ఒప్పుకున్నారు. ఉచిత విద్యుత్‌ను ఎత్తేయాలన్న ఆలోచనలో భాగంగానే జగన్ అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. రైతులు బిల్లులు కట్టుకుంటే ప్రభుత్వం అకౌంట్లో డబ్బులు వేస్తానంటోంది. కేంద్రం చేతుల్లోకి వెళ్లాక రాష్ట్రం ఏం చేయలేదు. అపుడు రైతులు బిల్లులు చెల్లింలేక వారికివారే వ్యవసాయాన్ని వదులుకుంటే ఆ భూములను అంబానీ, అదానీలకు అప్పగించే ప్రమాదం పొంచి ఉంది. ఏమైనా స్మార్ట్ మీటర్లు రైతులకు, వ్యవసాయరంగానికి పెనుప్రమాదమని చెప్పాలి.



నందిగామను ఆదర్శ నియోజకవర్గంగా

తీర్చిదిద్దుతా..!

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ధ్యేయమని నందిగామ నియోజకవర్గ కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ అసమర్థ పాలనతో మూలనపడిన సాగు, తాగునీటి పథకాలను బాగు చేయటంపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. కూటమిలో పేర్కొన్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సజావుగా అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఇప్పించేందుకు, యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా ఉద్యమాన్ని బలోపేతం చేస్తానన్నారు. ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఆమె ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు మీకోసం.. - నందిగామ/కంచికచర్ల

ప్రచారం ఎలా సాగుతోంది?

ఎన్నికల ప్రచారం చురుగ్గా సాగుతుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి, పరిస్థితులను వివరించి, ఓట్లు అభ్యర్థిస్తున్నా. కూటమిని గెలిపించాల్సిన అవశ్యకత, అవసరాన్ని ప్రజలకు విపులంగా వివరిస్తున్నా.అన్ని వర్గాల నుంచి ప్రజల స్పందన బాగుంది. పోలిమేర్ల వరకు మేళతాళాలతో ప్రజలు ఎదురేగి స్వాగతం పలుకుతున్నారు. ప్రచారంలో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రజలు ఏకోన్ముఖంగా చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని నిర్ణయించుకున్నారు. సైకో పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు స్పష్టమైన వైఖరితో ఉన్నారు. అన్ని వర్గాల మద్దతు లభిస్తోంది.

వైసీపీ పాలనపై జనాభిప్రాయం?

వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులకు అందటం లేదు. ఖాతాల్లో సొమ్ములు పడటం లేదు. బటన్ నొక్కుడు డొల్ల అన్నది ప్రజలకు అర్థమైంది. అభివృద్ధి రహిత వైసీపీ పాలనను ప్రజలు ఛీత్కరిస్తున్నారు. విధ్వంసం, అవినీతి, అవకాశవాద వైసీపీకి బుద్ధి చెప్పాలన్న పట్టుదలతో ఉన్నారు. టీడీపీపై సానుకూల ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

కూటమి నేతలతో సమన్వయం?

బలమైన సంబంధాలతో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి నడుస్తున్నాయి. ఆయా పార్టీల తరుపున సీట్లు ఆశించిన నేతలు కూడా అధినేతల నిర్ణయానికి కట్టుబడి పని చేస్తూ ఆదర్శవంతమైన కూటమిగా కనిపిస్తోంది. చంద్రబాబు దార్శనికత, మోదీ బలమైన నాయకత్వం, పవన్ కల్యాణ్ చరిస్మాతో నేను భారీ మెజారిటీతో గెలవబోతున్నా.

ప్రత్యర్థి బలాలు, బలహీనతలు?

ప్రత్యర్థికి ప్రజాబలం లేదు. వారికున్న ఏకైక బలం అక్రమంగా కూడగట్టిన డబ్బు మాత్రమే. ఆ డబ్బు నా దగ్గర లేదు. అధికారం అడ్డు పెట్టుకుని అవినీతి, అక్రమాల్లో కూరుకుపోవటం, ప్రజలకు చెందాల్సిన ప్రకృతి సంపద ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీ చేయటం, నివేశన స్థలాల భూముల కొనుగోళ్లలో భారీగా అవకతవకలకు పాల్పడటం. ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి నెలకొనటం. చెప్పుకోదగిన అభివృద్ధి చేయలేకపోవటం ప్రత్యర్థికున్న బలహీనతలు.

- సాగు, తాగునీటి పథకాలను బాగుచేయడంపై ప్రత్యేక దృష్టి
- మహిళల డ్వాక్రా ఉద్యమాన్ని బలోపేతం చేస్తా
- సుబాబుల్‌కు ప్రత్యేక కమిటీ వేసి ధర తగ్గకుండా చర్యలు
- నందిగామ, కంచికచర్ల మధ్య ఆటోనగర్ ఏర్పాటుకు కృషి
- కేంద్రం ప్రతిపాదించిన బల్క్‌డ్రగ్ పరిశ్రమను నందిగామకు తెస్తా

ప్రజలకు మీరిచ్చే హామీలేంటి..?

చంద్ర బాబు పాలనలో జరిగిన అభివృద్ధి కొనసాగిస్తా. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన, మరమ్మతులకు నోచుకోని రహదారులను గెలిచిన ఏడాదిలోనే బాగు చేయిస్తా. వ్యవసాయాభివృద్ధికి చర్యలు చేపడతా. 63 ఎత్తిపోతల పథకాల కింద 70వేల ఎకరాలు సాగవుతున్నాయి. వైసీపీ వచ్చాక మూతపడ్డాయి. కూటమి అధికారంలోకి రాగానే పూర్తిగా మరమ్మతులు చేపట్టి నీరందించే ఏర్పాటు చేస్తా. సుబాబుల్‌కు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ధర తగ్గకుండా చర్యలు చేపడతా. పట్టణ ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు రూ.100కోట్లతో కృష్ణానదిపై మంచినీటి పథకం నిర్మాణం చేపడతా. పేదలకు సంపన్నులు నివసించేలా గేటెడ్ కమ్యూనిటీ తరహా జీప్లస్‌త్రీ ఇళ్లను పూర్తిచేసి ఉచితంగా అందిస్తా. ట్రామా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తా. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు లబ్ధిదారులకు అందజేసేందుకు వారధిలా పనిచేస్తా. డీవీఆర్ అండ్ టీపీఆర్ మినీ స్టేడియం, నందిగామ, కంచికచర్ల పట్టణాల్లో ఆటోనగర్ ఏర్పాటు, గుడిమెట్ల ఏపీఐఐసీ భూముల అభివృద్ధి చేసి ఐదేళ్లలో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్ది ఉపాధి అవకాశాలు పెంచుతా.బల్క్ డ్రగ్ పరిశ్రమలు నందిగామలో ఏర్పాటు చేయిస్తా. సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకంగా ముందుకెళ్తా

పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు

నమ్మినబంటుని



పెనమలూరు నియోజకవర్గ పరిస్థితులు తెలిసిన వ్యక్తి.. సమస్యలు, వాటి పరిష్కారంపై పూర్తి అవగాహన నేత బోడె ప్రసాద్. ఈసారి ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేసి, నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తానంటూ హామీ ఇస్తున్నారు. ఈసారి ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున పెనమలూరు అసెంబ్లీ బరిలో ఉన్నారు. కూటమి ప్రకటించిన ఎన్నికల ప్రణాళికను నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ప్రచారం చేసి కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడానికి కట్టుబడి ఉన్నానన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో దూసుకెళుతూ బిజీగా ఉన్న ఆయన్ను ఆంధ్రజ్యోతి కలిసింది. ఈ సందర్భంగా ఆయన చెప్పిన వివరాలు మీకోసం.. - పెనమలూరు

- ఐదేళ్లుగా నిత్యం ప్రజల్లో ఉన్నా..
- నియోజవర్గ సమస్యలు తెలుసు
- టీడీపీ మొదలుపెట్టి వైసీపీ నిలిపేసిన పనులు పూర్తి చేస్తా
- బందరు రోడ్డుకు సమాంతరంగా 80 అడుగుల రోడ్డు
- కూటమి మేనిఫెస్టో పూర్తిస్థాయి అమలుకు కృషి
- మైలవరం, పెడనలో చెల్లని జోగి నాకు ప్రత్యర్థి కానే కాదు
- భారీ మెజార్టీతో గెలుస్తా..

ప్రచారం ఎలా సాగుతోంది...

గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచే ప్రజలతో మమేకమై తాను ఎందుకు ఓడిపోయానో ఆత్మ పరిశోధన చేసుకున్నా. నావల్ల ఏమైనా పొరపాటు జరిగితే ఇక జరగవని పార్టీ కార్యకర్తలకు, కొత్త, పాత నేతలకు చెప్పా. నేనే నమ్మకస్థుడనని, అభివృద్ధి చేసేది తానేనని ప్రజలకు చెబుతూ ఐదేళ్లుగా ప్రజల్లోనే తిరిగా, వారి ఆదరాభిమానాలు సంపాదించుకొన్నా. ఈఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తా. ఎవరికే చిన్న ఇబ్బంది వచ్చినా తక్షణం స్పందిస్తా.. అందుకే నేనుగానీ, నా కుటుంబ సభ్యులుగానీ ప్రచారానికి వెళ్తుంటే ప్రజలు ఆదరించి. అక్కున చేర్చుకుంటున్నారు.

కూటమి మేనిఫెస్టో ఎలా ఉంది?

కూటమి ప్రకటించిన ప్రతి హామీ అమలూ సాధ్యమే. దీంతో అన్ని వర్గాల అభివృద్ధి, ప్రజల స్థితిగతులూ మారతాయని నమ్ముతున్నా. సైకో జగన్‌రెడ్డి అరాచక పాలనలో అన్ని వ్యవస్థలూ నాశనమయ్యాయి. చంద్రబాబు సీఎం అయితే తప్ప ప్రజల కష్టాలు తీరవు. తాను ఎమ్మెల్యేగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గానికి మంచి జరుగుతుంది.

ఐదేళ్ల వైసీపీ పాలనపై జనాభిప్రాయం?

ఐదేళ్లగా రాష్ట్రంలో అసలు పాలనే లేదు. సైకో జగన్ పాలనతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటి వరకు అత్యంత చెత్త ప్రభుత్వం ఇదేనని ప్రజలు చెబుతున్నారు.

కూటమి నేతల్లో సమన్వయం

కలిసి ఉంటే కలదు సుఖం అంటూ టీడీపీ నేతలు, కార్యకర్తలు కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతున్నారు. చిన్నపాటి సమన్వయ లోపా లుంటే తాను, కూటమిలోని ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలకు సర్ది చెబుతున్నాం.

ప్రత్యర్థి జోగి బలాలు, బలహీనతలు

వైసీపీలో అత్యంత బలహీనుడైన, ఎక్కడా చెల్లని నాణెంలాంటి వ్యక్తిని వైసీపీ అభ్యర్థిగా నిలబెట్టారు. మైలవరంలో చెల్లకపోవడంతో పెడనకు, అక్కడా భూదందాలు, ఇసుక, మైనింగ్, అఖరుకు మట్టిని వదలక అరాచకాలు పెచ్చు మీరడంతో వైసీపీ అధిష్టానానికి నచ్చక పెనమలూరు పంపారు. అక్కడి ప్రజలు ఫోన్‌లు చేసి జోగిని ఎన్నుకొంటే అంతే గతని చెప్పడంతో ఇక్కడి ప్రజలు ఈసారి టీడీపీకే ఓట్లు వేద్దామని నిర్ణయించుకున్నామని చెబుతున్నారు.

ప్రజలకిచ్చే ప్రధాన హామీలేంటి?

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నిర్మాణంలో ఉండి వైసీపీ హయాంలో పెండింగ్ పడిన యనమలకుదురు, కుందేరు వంతెన నిర్మాణాలను ఏడాదిలో పూర్తిచేస్తా. రైవస్ కాల్వలపై ఉప్పలూరు వంతెన, ప్రొద్దుటూరు-బొడ్డపాడు, ఉప్పలూరు-కేసరపల్లి, గొడవర్రు-రొయ్యూరు, వన్నేరుపై తెన్నేరు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తా. కంకిపాడు లాకుల వద్ద 4 వంతెనల నిర్మాణానికి గతంలో నిధులు తెచ్చా, వాటి పూర్తికి కృషి చేస్తా. వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన పంట కాల్వ రోడ్డు నిర్మాణాన్ని, బందరు రోడ్డుకు సమాంతరంగా నా హయాంలో నిర్మించతల పెట్టిన 80 అడుగుల రోడ్డును, మరో 3 రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి బందరు రోడ్డుపై ట్రాఫిక్ భారాన్ని తగ్గిస్తా. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదార్ల కోసం నియోజకవర్గ స్థాయిలో 5సెంట్లు కేటాయించి భవన నిర్మాణానికి కృషి చేస్తా. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాల లే అవుట్లలో లోటుపాట్లు సరిదిద్ది లబ్ధిదారులకు న్యాయం చేస్తా. బీసీ, ఎస్సీ, ఎస్టీలను సబ్ ప్లాన్ నిధులతో న్యాయం చేస్తా. బీసీ కాలనీలను అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తా. ముస్లింలకు టీడీపీ అమలు చేసిన అనేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వారి సంక్షేమానికి పథకాలను పునరుద్ధిస్తాం

ఆ 48 గంటలు కీలకం

అప్రమత్తంగా ఉండండి

- హింసకు, నగదు పంపిణీకి అవకాశం లేకుండా చూడండి
- సీఈసీ రాజీవ్ కుమార్ దిశానిర్దేశం



అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): నాలుగో దశ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగే ఈ నెల 13వ తేదీకి ముందు 48 గంటలు అత్యంత కీలకమైనవని, మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(ఈసీ) రాజీవ్ కుమార్ ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులకు దిశానిర్దేశం చేశారు. నాలుగో దశలో 14 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా ఈ దశలోనే జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన కేంద్ర పరిశీలకులు, ప్రత్యేక పరిశీలకులు, ప్రధాన ఎన్నికల అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను రాజీవ్‌కుమార్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను ఎంతో సునిశితమైన రాష్ట్రాలుగా గుర్తించామన్నారు. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ విషయంలో యంత్రాంగం ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో దీనికి ముందు 48 గంటలు ఎంతో కీలకమైనవని, రేయింబవళ్లు అప్రమత్తంగా ఉండాలని, హింసకు ఏ మాత్రం అవకాశం లేకుండా శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. ప్రత్యేకించి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

తాయిలాలపై నిఘా పెట్టాలి

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, ఇతర ఉచితాల పంపిణీపై గట్టి నిఘా ఉంచాలని రాజీవ్ కుమార్ సూచించారు. ప్రత్యేకించి సాధారణ, పోలీసు, వ్యయ పరిశీలకులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూడాలని సూచించారు. ప్రత్యేకించి ఏపీలో కొన్ని జిల్లాలు ఎంతో సునిశితమైనవిగా గుర్తించామని, ప్రత్యేక పరిశీలకులు ఆయా జిల్లాల్లో తరచుగా పర్యటించాలని ఆదేశించారు. ఎండలు, వడగాడ్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్రథమ చికిత్స సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఓటు వేయడం సామాజిక బాధ్యత అనే విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని రాజీవ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. ఎస్ఎంఎస్‌లు, సోషల్ మీడియా ద్వారా ఓటర్లను చైతన్య పరచాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



మాజీ సీఎం భార్యను

కించపరుస్తారా?

- బాబు సతీమణిని అంటే నా సోదరిని అన్నట్లే: పవన్
- రాజకీయాల్లో భేదాభిప్రాయాలు ఉంటాయి
- నేనెప్పుడూ సీఎం జగన్ భార్యపై అనుచితంగా మాట్లాడలేదు
- బాబును ఏడిపించిన ఎమ్మెల్యేలను ఈసారి అసెంబ్లీకి పంపొద్దు
- హనుమాన్ జంక్షన్ సభలో ఓటర్లకు జనసేనాని పిలుపు

హనుమాన్ జంక్షన్, మే 8: రాజకీయ నాయకుల మధ్య అనేక భేదాభిప్రాయాలు ఉంటాయని, మాజీ సీఎం భార్యను కించపరుస్తూ మాట్లాడడం సమంజసం కాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో మహిళలను అవమానకరంగా, కించపరుస్తూ మాట్లాడిన ఎమ్మెల్యేలను ఈసారి అసెంబ్లీకి పంపవద్దని ప్రజలను కోరారు. ఎన్టీఆర్ అంటే తనకిష్టమని, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరిని అసెంబ్లీలో అవమానకరంగా మాట్లాడడం తనకు బాధ కలిగించిందన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అంటే తన సోదరిని అన్నట్లేనని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం హనుమాన్ జంక్షన్ హెచ్ మార్ట్ వద్ద బుధవారం జరిగిన ఎన్నికల సభలో ఆయన పాల్గొన్నారు. రాజకీయంగా ఎన్ని విభేదాలున్నా తాను సీఎం జగన్ భార్యను గానీ, కుటుంబ సభ్యులను గానీ ఎప్పుడూ అనుచితంగా మాట్లాడలేదన్నారు. మహిళలను అగౌరవపరుస్తూ మాట్లాడే వారిని సహించకూడదని చెప్పారు. అన్నారు. సీనియర్ నేత చంద్రబాబును ఏడిపించిన ఎమ్మెల్యేలను ఈసారి అసెంబ్లీకి వెళ్లకుండా ఓటరు తమదైన శైలిలో బుద్ధి చెప్పాలని పిలుపిచ్చారు. సంక్షేమ పథకాలు అమలు కాకుండా కూటమి అడ్డుకుంటోందంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని.. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పనిచేస్తుంటే ఆ నెపం తమపై నెడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్ తరచూ క్లాస్‌వార్ జరుగుతోందని.. పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందని చెబుతున్నారని.. నీతులు చెప్పే ముఖ్యమంత్రి సారా ఫ్యాక్టరీలు పెట్టి రూ.40 వేల కోట్లు కాజేశారని విరుచుకుపడ్డారు. 'జల్సా సినిమాలో మన చేతిలో ఉన్న రాడ్డు, అవతలివ్యక్తి హెడ్ అనే డైలాగ్ ఉంటుంది. కొద్దిరోజుల్లోనే వైసీపీ అవినీతి కోటను బద్దలు కొడుతున్నాం' అని ప్రకటించారు. ఇంకా ఏమన్నారంటే..

> - ఎక్కడ ఏ యుద్ధం జరిగినా కొన్ని నియమాలు ఉంటాయి. వాటిని అందరూ పాటించాల్సిందే. కానీ సీఎం జగన్ నడిపే రాజకీయాల్లో నీతి లేదు.
> - సంక్షేమం, అభివృద్ధి పక్కపక్కనే నడవాలి. జోడెద్దుల మాదిరిగా పనిచేయాలి. అప్పుడే రాష్ట్ర ప్రజలకు మేలు. కూటమి ప్రభుత్వం వస్తే సంక్షేమం, అభివృద్ధి రెండూ కొనసాగుతాయి.
>
> - పవన్ కల్యాణ్

దుర్గమ్మగుడిలో దొంగతనాలు చేసిన వారిని ఎమ్మెల్యేగా నిలబెట్టారు

కనకదుర్గమ్మగుడిలో రథానికి ఉండాల్సిన వెండి సింహాలు మాయమయ్యాయి. కాల్‌మనీ కేసులో నిందితులుగా ఉన్న వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన ఘనత వైసీపీదే. అమ్మవారి దేవస్థానంలో దర్శనం టికెట్లు సైతం నకిలీవి తయారుచేసి వ్యాపారం చేయడమేంటి? రాష్ట్రంలో 30 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమైతే వైసీపీ ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా అసెంబ్లీలో మాట్లాడలేదు. ఈసారి జరిగే ఎన్నికల్లో కూటమి గెలుపు తథ్యం.

గల్లీ పాలిటిక్స్ మా నైజం కాదు

గల్లీ, చీప్ పాలిటిక్స్ మా నైజం కాదు. నిన్నమొన్నటి వరకు వైసీపీలో కొనసాగిన మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి పనిచేయలేకనే వైసీపీ నుంచి బయటకువచ్చారు. టీడీపీ, జనసేన నాయకులను, వారి కుటుంబసభ్యులను తిట్టాలని వైసీపీ నాయకత్వం ఒత్తిడి తెచ్చినా బాలశౌరి సంస్కారవంతంగా వ్యవహరించారు. పార్లమెంటు ఓటు బాలశౌరికి వేసుకుని, ఎమ్మెల్యే ఓటు మాత్రం తనకు వేయాలని వంశీ ప్రజలను కోరుతున్నారు. ఇదేం రాజకీయం? మహిళలపై గౌరవం, ప్రజాస్వామ్య విలువలు లేని వంశీకి ఓటు వేయొద్దు. సంస్కారం కలిగిన యార్లగడ్డకు ఈసారి ఓటు వేయాలి. గన్నవరంలో జనసేన కార్యకర్తలు వంశీ మాటల వలలో పడొద్దు.

చెరువు తవ్వి వందల కోట్లు కాజేశారు

వైసీపీ నేతలు గన్నవరంలో బ్రహ్మలింగయ్య చెరువు మట్టిని తవ్వేసి వందల కోట్లు కాజేశారు. కానీ ఈ చెరువు నుంచి పంటలు పండించుకునేందుకు నీటిని మాత్రం విడుదల చేయలేదు. గన్నవరం ఎయిర్‌పోర్టు కోసం భూమి ఇచ్చిన రైతులను, మల్లవల్లి ఎస్ఈజెడ్ భూ నిర్వాసితులను మేం ఆదుకుంటాం. మల్లవల్లి ఎస్ఈజెడ్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు వచ్చినవారిని డబ్బులు ఎంతిస్తారని వైసీపీ నాయకులు అడుగుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం.

కోర్టు ఉత్తర్వులు అమలు కావడం లేదు

- హైకోర్టులో స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ ధిక్కరణ పిటిషన్

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులోని బొగ్గును కన్వేయర్ బెల్ట్ ద్వారా విశాఖ స్టీల్ ప్లాంటు (ఆర్ఐఎన్ఎల్)కు పంపిణీ చేయాలని పోర్టు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు కావడంలేదు. దీంతో స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె.వెంకట దుర్గాప్రసాద్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున్, అదానీ గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్, విశాఖ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అసిస్టెంట్ కమిషనర్ మోసెస్‌పాల్, పలువురు పోర్టు ఉద్యోగులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా... ఎగ్జిక్యూటివ్స్ సంఘం తరఫున న్యాయవాది అంబటి శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిపించారు. కోర్టు ఉత్తర్వులు అమలు కాలేదని, దీంతో బొగ్గు సరఫరా లేక స్టీల్ ప్లాంటు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. స్టీల్ ప్లాంట్ తరఫు న్యాయవాది సుబ్రహ్మణ్యం వాదనలు వినిపిస్తూ... బొగ్గు సరఫరా లేకుంటే ప్లాంట్ మూతపడుతుందన్నారు. అదానీ గంగవరం పోర్టు తరఫు న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ... పోర్టు సీఈవోను ప్రతివాదిగా చేర్చడంపై అభ్యంతరం తెలిపారు. ఈ వివరాలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి... ప్రతివాదులకు నోటీసులు జారీచేశారు. అన్ని పక్షాలకు ఆమోదయోగ్యంగా ఇప్పటికే ఉత్తర్వులు జరీ చేశామని, వాటి అమలు కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. పోర్టు యాజమాన్యం అభ్యర్థన మేరకు విచారణను గురువారానికి వాయిదా వేశారు. కాగా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా రక్షణ కల్పించాలన్న వినతిని పోలీసులు పట్టించుకోవడంలేదని, పోర్టునుంచి సరుకురవాణాకు అడ్డంకులు సృష్టించకుండా నిర్వాసిత కార్మికులను నిలువరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అదానీ గంగవరం పోర్టు తరఫున శిఖర్ నిగమ్ పిటిషన్ దాఖలు చేశారు.













పాలనలో ఒకొక్కరిది ఒక్కో మోడల్! ఆయన (జగన్) కంటికి కనిపించని అభివృద్ధి చేశానని చెబుతున్నారు. సంక్షేమమైతే అంతూపొంతూ లేనంతగా చేశామని గెలుపుపై పూటకో లెక్క చెబుతున్నారు. జగన్ మళ్లీ గెలుస్తారని మీకూ ఎక్కడైనా అనిపిస్తోందా?

0.00001శాతం కూడా లేదు. ప్రజలు పూర్తి నిరాశ, నిస్పృహలో ఉన్నారు. అందుకు ఒక ఉదాహరణ.. ఎంప్లాయిస్. ఎవరూ నోరు విప్పే పరిస్థితి కూడా లేదు. మాట్లాడితే బతక నివ్వడంలేదు. కొంతమందిని వేధించి, వేధించి చివరకు చంపేసిన సందర్భాలున్నాయి. కొంతమంది ఇంకేం చేయాలో దిక్కుతోచక ఆత్మహత్యలు చేసుకున్నారు. అలాంటి సందర్భాల్లోనూ ఎన్జీవోలు (ఉద్యోగులు) నోరు విప్పి మాట్లాడలేనంతగా భయపెట్టారు.

ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. ఎన్జీవోలు ఆయన టేబుల్‌పైకి ఎక్కి పూలకుండీతో కొట్టబోయారు. బిజూ పట్నాయక్ చొక్కా కూడా చింపేశారు కదా? ఎన్జీవోలకు ప్రభుత్వాలు భయపడేవి కదా?

అవును. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా భయపడేవారు. కానీ... ఇప్పుడు రివర్స్! జీతాలు తగ్గించి రివర్స్ పీఆర్సీ వేస్తారేమోనని ఎన్జీవోలే భయపడుతున్నారు.

అంతకుమించిన 'సైకో'

నేను సీఎంగా ఉన్నప్పుడు ఒక సీరియల్ కిల్లర్ ఒంటరిగా ఉండే మహిళలను బండరాళ్లతో చంపేవాడు. ఇలా 35 మందిని చంపేశాడు. ప్రజల్లో భయం పెరిగిపోయింది. పోలీసులు అతడిని తిరుపతిలో పట్టుకున్నారు. జీవితంలో జరిగిన ఏదో సంఘటనతో వాడు అలా మారాడు. పారిపోయే ప్రయత్నంలో పోలీసు కాల్పుల్లో చనిపోయాడు. అలాంటి మనస్తత్వం ఉన్న సీరియల్ కిల్లర్‌లనూ చూశాను. కానీ... ఇది అంతకు మించి! అతను వ్యక్తి! ఇతను(జగన్) వ్యవస్థ! సర్వనాశనం చేశాడు.

ప్రేమించేది 'ఇగో'ను మాత్రమే

కేసీఆర్ పదేళ్లు ఉన్నాడు. ఇంత కక్షపూరితంగా వ్యవహరించలేదు. జగన్ అలా కాదు! ఆయన థియరీ ఏంటంటే.. భార్యను ప్రేమించడు. తల్లిని ప్రేమించడు. పిల్లలను ప్రేమించడు.. చివరికి తోబుట్టువులను కూడా ప్రేమించడు. ఆయన ఇగోనే ప్రేమిస్తాడు. అలాంటి వాళ్లను ఏమి చేయాలి!

- చంద్రబాబు

జైలులో చంపాలని చూశారు..

జైల్లో అడుగుపెట్టిన క్షణం మీకు ఏమి అనిపించింది?

నా 45 ఏళ్ల ప్రజా జీవితంలో అన్ని విషయాల్లో చాలా జాగ్రత్తలు తీసుకున్నా. ప్రతీ ఫైల్‌ను చదివిన తర్వాతే ముందుకెళ్లాం. అది నా స్వభావం. కానీ... జగన్‌లాంటి వ్యక్తులు వచ్చినప్పుడు ఊహించని పరిణామాలు జరుగుతుంటాయి. ఆరోజు నేను నంద్యాలలో ఉన్నాను. రాత్రి అవుతోంది. పోలీసులు వచ్చి అరెస్టు అని చెప్పారు. ఎందుకని అడిగితే సమాధానం లేదు. చెప్పలేదు. ముందు అరెస్టు వారెంట్ ఇస్తాం..ఆ తర్వాత నోటీసులిస్తాం అన్నారు. చేయని నేరానికి జైలుకు వెళ్లా. జైల్లో నాకు మంచం లేకుండా, కమోడ్ లేకుండా చేయాలని, సీసీ కెమెరాలు పెట్టి చూసి ఆనంద పడాలని, నేను బాధపడుతుంటే చూసి ఆనందపడాలనేలా వ్యవహరించారు. పైనుంచి అధికారులు మానిటర్ చేయడం, జైలు నుంచి ఆరాలు తీయడం... ఇదంతా వారి రాక్షసానందం. విషపు ఆలోచనల నుంచే ఇవన్నీ పుడతాయి. ఇందులో భాగంగా నన్ను ఎలిమినేట్ (చంపాలని) చేయాలని కూడా చూశారు. పరిస్థితి కళ్ల ముందు దారుణంగా కనిపిస్తోంది.. ఏది జరిగితే అది జరుగుతుందనుకుని నేనూ ధైర్యంగా ఉన్నా. చివరికి... దోమల నియంత్రణకు కూడా మస్కిటో కాయిల్స్ ఇవ్వాలని అడగాల్సి వచ్చింది. వేడి నీళ్లు అడిగితే చల్లనీళ్లు ఇచ్చారు. కుర్చీ కూడా ఇవ్వలేదు. అన్నింటికీ ఫైట్ చేయాల్సి వచ్చింది. ఆ స్థాయిలో జైలులో పరిస్థితులను నియంత్రించారు. ఏమిటీ అన్యాయం అనిపించింది. జాగ్రత్తగా ఉండాలని ప్రతి ఒక్కరూ చెప్పేవాళ్లు. బ్యారక్‌లో నేను ఒక్కడినే! తోడు ఎవరూ లేరు. సెక్యూరిటీ ఉంది. వారు ఎక్కడా అమర్యాదగా వ్యవహరించలేదు. భయంతోనో, అభిమానంతోనే దూరంగానే ఉండేవారు. వారి మీద కూడా ఒత్తిడే! నేను వేసుకునే మందులు కూడా ఇవ్వకూడదని జైలు అధికారుల మీద ఒత్తిడి. నా హెల్త్ రిపోర్టును కూడా తారుమారు చేశారు. నా కన్నుకు ఆపరేషన్ అయింది. రెండో కన్నుకు ఆపరేషన్ చేయాల్సి ఉంది. వైద్యుడు వచ్చి పరీక్ష చేసి ఆపరేషన్ చేయాలని చెప్పారు.. ఆ నివేదికను సాయంత్రానికి మార్చేశారు. ఆపరేషన్ ఎప్పుడైనా చేసుకోవచ్చని అంటారు. ఇలాంటి వాళ్లను ఏమనాలి? వాళ్ల ఉద్దేశం ఏమిటో తెలియదు. పరిస్థితులైతే దారుణంగా ఉన్నాయి. విష ప్రయోగం చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. ఒక్కక్షణం భయం వేసేది. అయినా మనోధైర్యం కోల్పోకుండా ఉన్నా.



జైలుకు వెళ్లడం వల్ల మీలో వచ్చిన మార్పు ఏంటి?

చేయని తప్పునకు జైలుకు వెళ్లా. 53 రోజులు జైల్లో ఉన్నా. ఏ నాయకుడి కోసం పోరాడని విధంగా ప్రజలు నా కోసం పోరాడారు. ఇంతటి అభిమానం, ఆదరణ ఏ నాయకుడికీ దొరకదు. అదే సమయంలో... ఇలాంటి అన్యాయం రాజకీయాల్లో ఇంకొకరికి జరక్కూడదు. ఉన్మాద, దౌర్జన్య, నేరపూరిత రాజకీయాలను ప్రక్షాళన చేయాలి.

అకారణంగా జైలుకు వెళ్లిన వారు ఉన్నారు. రఘురామరాజులా దెబ్బలు తిన్న వారు ఉన్నారు. వీరంతా రేపు శాంతిస్తారా?

చాలామంది బాధితులు ఉన్నారు. రౌడీ ముఠాలను కంట్రోల్ చేశా. మతకలహాలను అణచివేశా. తీవ్రవాద సమస్య మీద పోరాడాం. ఎవరి ఆటలూ సాగనివ్వలేదు. సమాజంలో శాంతి కోసమే నా ప్రయత్నం. ఇప్పుడు రాజకీయ రౌడీయిజం ప్రబలింది. రాజకీయాల ముసుగులో నేరాలు చేసే వారిని ఏం చేస్తానో జూన్ 4 తర్వాత మీరే చూస్తారు. తాట తీస్తా!

జయం మాదే!

వంద శాతం అధికారంలోకి వస్తున్నాం: చంద్రబాబు

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గెలుపు తథ్యమని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు నిరాశా నిస్పృహల్లో ఉన్నారని... జగన్ మళ్లీ గెలిచే అవకాశాలు 0.00001 శాతం కూడా లేవని తేల్చి చెప్పారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్నిర్మాణమే తమ బాధ్యత అని తెలిపారు. 'ఇప్పుడు కాకుంటే మళ్లీ చేసుకోలేం. నా రాజకీయ జీవితంలో ఎంతో పట్టుదలగా పని చేశా. ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అంతకుమించిన పట్టుదలతో కృషి చేస్తా. ఇది నా బ్రాండ్, నా ట్రాక్ రికార్డ్' అని ఉద్ఘాటించారు. బుధవారం చంద్రబాబు 'ఆంధ్రజ్యోతి' మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో పాల్గొన్నారు. తాజా రాజకీయ పరిస్థితులు, జగన్ వ్యవహార శైలి, జైలులో తనకు ఎదురైన అనుభవాలు తదితర అంశాలపై స్పందించారు. ఇవీ ఆ వివరాలు...

- **ఆర్కే: ఎండల్లో అలుపెరగని పోరాటం చేస్తున్నారు కదా!**

చంద్రబాబు: యుద్ధంలో ఉన్నాం.

- **యుద్ధ ఫలితం ఎలా ఉండబోతోంది?**

వెరీ క్లియర్! మేం గెలుస్తున్నాం. కమ్ బ్యాక్!

- **ముఖ్యమంత్రి అయ్యాకే అసెంబ్లీలోకి అడుగు పెడతానన్న ప్రతిజ్ఞను నెరవేర్చుకుంటున్నారా?**

నూటికి నూరు శాతం. అందులో డౌటే లేదు.

- **అంత నమ్మకం రావడానికి కారణమేంటి.?**

45 ఏళ్ల రాజకీయంలో ఉన్నాను. చాలామంది ముఖ్యమంత్రులను, చాలా రాజకీయ పార్టీలను చూశాను. రాష్ట్రాన్ని ఇంత సర్వనాశనం చేసిన వ్యక్తిని ఎప్పుడూ జీవితంలో చూడలేదు. అసలు ఊహించలేదు. ఇలాంటివి జరుగుతాయని ఎప్పుడైనా ఊహించారా... మీరు చెప్పండి!

- **నా దృష్టిలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడమే ఒక వింత. సరే జనం కోరుకున్నారు, సీఎం అయ్యాడు. అది రియాలిటీ!**

జనం కోరుకోలేదు. ఒక ఫిలాసఫీని ఆయన పర్సనాలిటీతో అడాప్ట్ చేశారు. ఆ ఫిలాసఫీ ఏంటంటే అబద్ధాలు చెబుతూ.. వాటినే నిజమని నమ్మించడం. భారతదేశంలో ఏ రాజకీయ పార్టీ ఒక మీడియా సంస్థను ఏర్పాటు చేసింది లేదు కానీ... కేవలం వారి ఐడియాలజీని, ఫేక్ న్యూస్‌ను ప్రమోట్ చేయడానికే పేపర్ పెట్టారు. ఎవరొస్తే వారి మీద దాడి చేయడం, వాళ్లు చెప్పింది నిజమని నమ్మించడం, మోసం చేయడం తప్ప వేరేమీ లేదు. హిట్లర్, బిన్‌లాడెన్, తాలిబన్స్, నార్త్‌కొరియా వాళ్లు చేసినట్టు చేశారు.

- **జగన్‌ను వాళ్ల సరసన చేర్చారా.?**

ఏం మిగిలిందిప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో. అసలు తెలుగువారికి ఏం తక్కువ ఉంది చెప్పండి. 25ఏళ్లకు ముందు నేను సీఎం అయినప్పుడు, ఒక సిస్టమాటిక్‌గా నాలెడ్జ్ ఎకానమీని డ్రైవ్ చేయాలని సంకల్పించాం. దాని ఫలితాలను ఇప్పుడు హైదరాబాద్ రూపంలో చూస్తు న్నాం. ఐటీ ప్రొఫెషనల్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. అలాంటి తెలుగు జాతి ఏపీలో మోసపోయింది. ఇబ్బంది పడుతోంది.

- **తాము ఇబ్బంది పడుతున్నట్లుగా జనం గుర్తించారా?**

గుర్తించకపోతే జరిగేది రెండే! యువత మొత్తం ఏపీలో బతకలేక బయటకువెళ్లిపోవాలి. ఎలాంటి అవకాశాలు లేని వాళ్లు బానిసలుగా బతకాలి.

- **అంటే.. బటన్‌ల మీద ఆధారపడాలంటారా? కొద్ది రోజులకు ఆ బటన్‌లూ ఉండవేమో! బటన్ నొక్కడానికి ఆదాయం ఉండాలి కదా.?**

బటన్‌ల మీద అని కాదు. ఒక్కసారి స్థూలంగా పరిస్థితులను విశ్లేషణ చేసుకోవాలి. అబద్ధాలు, అసత్యాలతో వెళ్లదీస్తున్నారు. ఎవరైనా అడ్డంపడితే.. వేధిస్తున్నారు. చివరకు తట్టుకోలేక వాళ్లు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి.

- **యుద్ధ రంగంలో శత్రువుపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవడం కూడా అవసరం. 2019కి ముందు జగన్ విషయంలో ఆ పని చేయలేకపోయారు.**

జీవితంలో కొన్ని ఊహకందని సంఘటనలు ఎదురవుతుంటాయి. భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడైనా ఇలాంటి వ్యక్తి ఒకడు పుడతాడు, వస్తాడని ఊహించారా!? అయితే మనం కూడా ఏమారాం. మేము సరే.. మీరు జర్నలిజంలో ఉన్నారు కదా మీరు చెప్పండి. ఎందుకు వాళ్ల తండ్రి.. ఇతన్ని బెంగుళూరు పంపించేశారు. జగన్ వ్యక్తిత్వాన్ని అంచనా వేయలేకపోవడం వైఫల్యమే.

- **రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. ఇక్కడ ఉండొద్దు, బెంగుళూరుకే పరిమితం కావాలని జగన్‌కు చెప్పినట్లు సీఎం రోశయ్యే వెల్లడించారు.**

తండ్రీ కొడుకుల మధ్య ఏదో ఉందనుకున్నాం కానీ... ఇలాంటి వ్యక్తిత్వమని ఊహించలేదు. ఇది ఎవరి ఊహకూ అందనిది.

- **మీతో పాటు, మమ్మల్ని కూడా తోడేళ్లను చేసేశారుగా?**


మిమ్మల్నే కాదు, ఎన్నికల కమిషనర్‌ను కూడా అలాగే చేశారు. తనకు భద్రత కావాలని కోరే స్థాయిలో ఎన్నికల కమిషన్‌ను ఇబ్బంది పెట్టారు. మనిషి స్వభావం ఎలా ఉందో దీని ద్వారా అర్థమవుతోంది కదా!

- **ఏపీ సర్వనాశనం అయిందంటున్నారు. ఇప్పుడు మీరు ముఖ్యమంత్రి అయినంత మాత్రాన బాగుపడుతుందా?**

ఏపీ నాశనం కాలేదు, చేశారు. ఏపీకి అన్ని వనరులూ ఉన్నాయి. నదులు, నీళ్లు, టెక్స్‌టైల్, భూములు, పోర్టులు ఉన్నాయి. అన్నీ ఉన్నా ఇప్పుడు సమస్యలు వచ్చాయి. అందుకే జనసేన, బీజేపీ, మేము కలిశాం. రాష్ట్రాన్ని పునర్నిర్మించాలి, నిర్మిస్తాం. దానిపై మేం విశ్వాసంగా ఉన్నాం. చేసి తీరుతాం.

- **'మోదీ గ్యారంటీ, బాబు నాయకత్వం, పవన్ కల్యాణ్ విశ్వాసం' కలిశాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని మొన్న ప్రధాని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి ఏమైనా హామీ ఇచ్చారా?**

ఏపీలో అవినీతి విపరీతంగా పెరిగిపోయింది, దాదాగిరి పెరిగింది, రాష్ట్రం నష్టపోయింది.. పోలవరం, అమరావతి, పరిశ్రమలను అన్నింటినీ సర్వనాశనం చేశారని మోదీ, అమిత్‌షా ఇద్దరూ చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారులో రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని స్పష్టంగా చెప్పారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేసి ఏపీని పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేను ఉమ్మడి ఏపీలో 9 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాజపేయి సహకరించారు. ఇప్పుడు మోదీ కూడా పాలసీల్లో సహకరిస్తున్నారు. సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం, సాధికారత... మా ఇద్దరి ఐడియాలజీ ఒకటే. వందశాతం తెలుగుదేశం (కూటమి) గెలుస్తుంది. స్వీప్ చేస్తున్నామని, ఎన్డీయే గెలుస్తుందని వారికీ తెలుసు.



లోకేశ్ రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతున్నాడు. ఇప్పుడు దానిపై కూడా కేసు పెట్టారు...

తప్పు చేసినవాడిని వదిలిపెట్టడం కరెక్ట్ కాదు. తప్పులను రుజువు చేసి, మళ్లీ జీవితంలో ఆ పని చేయకుండా శిక్షించాల్సిందే!

లోకేశ్ మంత్రి పదవి తీసుకోనని అంటున్నాడు. పార్టీ బాధ్యతలకే పరిమితమవుతానంటున్నాడు. మీది అదే లైనా ?

ఎవరు ఏం చేయాలనేది రైట్ టైమ్‌లో నిర్ణయించుకుంటాం. ఎవరికి ఏది అప్పజెప్పాలో తర్వాత నిర్ణయిస్తాం. ప్రతి ఒక్కరికీ వాళ్ల సొంత నిర్ణయాలుంటాయి. ఒక లీడర్‌గా ఎవరిని ఎలా వినియోగించుకోవాలో అది చేస్తా. ప్రజలు, రాష్ట్రం కోసం ఎవరి సేవలు ఎలా అవసరమో తెలుసుకుని నిర్ణయం తీసుకుంటాం.

మీ కుటుంబంలో భువనేశ్వరిని అసెంబ్లీ సాక్షిగా అవమానించారు కదా! మీరు మరిచిపోయినా.. లోకేశ్ ఎలా మరిచిపోతారు?

అది ఒక సంక్షోభం, జగన్ చాలా సమస్యలు తీసుకొచ్చాడు. ఆమె 40 ఏళ్లుగా తనపని తాను చేసుకునేది. ఇప్పుడు పట్టుదల వచ్చింది. ఏదో ఒకటి చేయాలనే కసి పెరిగింది.

'నీ అమ్మ మొగుడు' అనే కొడాలి నాని వాడే భాషను మీరెందుకు వాడుతున్నారు, మీకెలా సూట్ అవుతుంది?

ఒక దుర్మార్గుడిపై పోరాటం చేయాల్సి వస్తోంది. వాళ్ల తీరు చూసి, ఆవేదనతో మాట్లాడాల్సి వస్తోంది. నాకు జరిగినన్ని అవమానాలు ఈ దేశంలో ఎవరికైనా జరిగాయా?

న్యాయం మావైపు ఉంది, అందరూ తమకు మద్దతు పలకాలని వైఎస్ సునీత, వైఎస్ షర్మిల అడుగుతున్నారు. మీరేమంటారు?

వివేకా కేసులో న్యాయం కోసం అందరికంటే ఎక్కువ ఫైట్ చేసింది మేమే. అయితే, కుటుంబ కలహాలు, అంతఃపుర రాజకీయాలు... రాష్ట్ర రాజకీయాలు కావటానికి వీలులేదు. జగన్మోహన్ రెడ్డి, షర్మిల మధ్య వివాదానికి కారణం వ్యక్తిగత విషయాలే! ఎన్టీఆర్ ఇచ్చిన చట్టప్రకారం ఆయన షర్మిలకు ఆస్తి ఇవ్వాలి. వివేకాను రాజకీయం కోసం హత్య చేయించారు. వాళ్ల పోరాటానికి రాజకీయంగా సహకరించాలని అనుకోవటం కరెక్టు కాదు. నైతికంగా మాత్రం సంఘీభావం తెలియజేయగలం.

దేశానికి గుర్తింపు



దేశంలో ఇప్పుడు మూడు దశల్లో ఎన్నికలు అయిపోయాయి. ఆ స్థానాల్లో బీజేపీకి అవసరమైన మేర సొంతంగా మెజార్టీ రాదని బయట అంచనాలున్నాయి?

ఎవరు, ఏదైనా మాట్లాడొచ్చు. ఏమైనా ఉండొచ్చు. దేశంలో మాత్రం ప్రత్యామ్నాయం లేదు. మోదీ మీద నమ్మకముంది. ఆయన పని చేసిన విధానం కూడా దేశం ముందుకు వెళ్లే విధంగా ఉంది. పదేళ్ల పాలనలో ప్రపంచం మొత్తంలో భారతదేశానికి గుర్తింపు వచ్చింది. స్థిరమైన, సుస్థిరమైన అభివృద్ధి జరుగుతోంది. ప్రస్తుతం ప్రపంచం మొత్తం లీడర్‌షిప్ వాక్యూమ్ ఉంది. ఇలాంటి సమయంలో మోదీ ఒక లీడర్‌గా వచ్చి.. దేశాన్ని ప్రమోట్ చేశాడు. ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు (నెటవర్క్) ఏర్పరచుకోవాలని నేను చాలామంది ప్రధానమంత్రులు, రాష్ట్రపతులకు చెప్పాను. దాని వలన దేశానికి మంచి గుర్తింపు, పేరు వస్తుందని చెప్పేవాడిని. నేను ఒక రాష్ట్ర సీఎంగా వెళ్లి మాట్లాడితేనే ఆయా దేశాలు స్పందిస్తున్నాయి. అలాంటిది దేశం తరఫున మీరు చేస్తే ఇంకా రెస్పాన్స్ వస్తుందని చెప్పాను. కానీ, అప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడు... మనం ఎందులోనూ తక్కువ కాదని మోదీ నిరూపించారు.

కేంద్రంలో భాగస్వామ్య పక్షాలతో కూడిన ప్రభుత్వం అనివార్యమైతే.. మీరు పాత రోజుల్లో లాగా కీలకపాత్ర పోషించే అవకాశం ఉందా?

పాత రోజుల్లో ఉమ్మడి రాష్ట్రంలో 42 స్థానాలు ఉండేవి. టీడీపీ ఎప్పుడూ కేంద్రంలో అధికారం కోరుకోలేదు. అప్పుడు యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీయే, అంతకంటే ముందు నేషనల్ ఫ్రంట్ (ఎన్ఎఫ్) ఉండేవి. ఎన్టీఆర్ అధికారం కోసం ఆలోచించలేదు. తెలుగు కమ్యూనిటీ ముఖ్యమనే వ్యవహరించారు. 2014లో కూడా నేను పదవులు అడగలేదు. మాకు పదవులు, అధికారం ముఖ్యంకాదు. రాష్ట్ర అభివృద్ధి, తెలుగు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ముఖ్యం!

కేంద్రంలో మీ ప్రాధాన్యం పెరిగినా వ్యక్తిగతంగా వచ్చేది ఉండకపోవచ్చు. కానీ, రాష్ట్రానికి ఉపయోగపడే అవకాశం ఉంటుంది కదా. అదే జగన్... 25సీట్లు గెలిపిస్తే మోదీ మెడ వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తా అంటారు.

ఆయన చేసేది రాష్ట్రం కోసం కాదు! తనపై ఉన్న కేసులను మాఫీ చేసుకోవడానికే ఇదంతా. నేను ఆ డ్రామాలు చేయను. అందితే జుట్టు.. లేదంటే కాళ్లు అనే స్వభావం ఆయనది. 'నా వెంట్రుక కూడా పీకలేరు' అని చెప్పిన ఆయనే... 'ఇప్పుడు నన్ను పీకేస్తున్నారు' అంటున్నాడు. దానికి మనం ఏం చెప్తాం! పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలలాగా మొత్తం ఎమ్మెల్యే స్థానాలు ఆయనే లాగేసుకోవాలని చూశాడు!

రేపు ప్రభుత్వం వస్తే... ఎన్డీయేతో ప్రయాణం ఎలా ఉండబోతుంది?

ఇంతకుముందు కూడా బీజేపీతో కలిసి పని చేశాం కదా? ఒక ఐడియాలజీ పెట్టుకుని, అందరం కలిసి ఎక్కడికక్కడ ఆలోచించి ముందుకు వెళతాం. కామన్ గుడ్ కోసం అందరం కలిసి పని చేస్తాం. జాతీయ స్థాయిలో ఎన్డీయే ఉంటుంది. ఇక్కడ జనసేన పార్టీ ఉంది. ఎప్పుడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినప్పుడు వాటిని ఎలా అధిగమించాలో ఆలోచించి, ముందుకు వెళతాం. సంక్లిష్టతలను ఛేదించుకుని వెళతాం.

పొత్తు ప్రకటన తర్వాత చిలకలూరిపేట వచ్చినప్పటికీ, ఇప్పటికీ మోదీలో బాగా తేడా కనిపించింది. మీతో కూడా చాలా కలివిడిగా, జోవియల్‌గా ఉన్నట్టు కనిపించింది. మరి మీరేం మాట్లాడుకున్నారో చెబితే వింటాం (నవ్వుతూ)?

కొన్ని కొన్ని మీకు చెప్పకూడదు (నవ్వుతూ)! నేనంటే ఆయనకు (మోదీ) అభిమానం, ఆయనంటే నాకు గౌరవం అనేది ఎప్పుడూ ఉన్నాయి. ఒక విషయం మీద ఇద్దరం దూరమయ్యాం. నాకు వ్యక్తిగతంగా ఏమీ లేదు. అయినా దాచేదేముంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదన్న ఆందోళన కలిగింది. అదే సమయంలో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ కూడా కొంత దెబ్బ తిన్నదని తొందరపడ్డాం. కానీ, ఏపీకి విభజనకంటే జగన్ వల్లే ఎక్కువ నష్టం జరిగింది. దానిని సరిదిద్దడమే మా లక్ష్యం. అందుకే మేం ముగ్గురం కలిశాం. కచ్చితంగా చేస్తాం.



"జైలుకు వెళ్లిన సమయంలో ఓ అధికారి మారు వేషంలో నా వద్దకు వచ్చారు. వణికి పోతున్నాడు. ఏంటయ్యా అంటే.. 'సార్, సంతకం చేయకపోతే నన్ను చంపేస్తారు సార్. అన్యాయం చేస్తున్నారు సర్' అన్నాడు. ధైర్యంగా ఉండు అంటే, 'చంపేస్తారు సార్.. ఏమి చెబితే అది చేయాల్సిందే సార్' అన్నాడు. ఇంకో సంఘటనలో... ఒక అధికారిని ఆయన కుమార్తె పెళ్లి సమయంలోనే అరెస్టు చేసేందుకు వెళ్లారు. 'రాజీ పడతావా.. జైలుకు వెళతావా' అని ఒత్తిడి చేశారు."

అప్పుల పాలైన రాష్ట్రం..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని లెక్కలోకి తీసుకోకుండా హామీలు ఇస్తున్నారు. అమలు ఎలా సాధ్యం?

నేను సీఎం అయ్యాక తీసుకున్న నిర్ణయాల వల్ల సంపద పెరిగింది, ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. కానీ... ఇప్పుడు సంపద సృష్టిని మరిచి, సంక్షేమం ఒక్కటే చూడటం సమస్యగా మారింది. రెండింటినీ బ్యాలెన్స్ చేస్తాం. మారిన పరిస్థితులకు అనుగుణంగా మనమూ మారాలి. ఒక మోడల్‌ను జాగ్రత్తగా క్రియేట్ చేయాలి. అదే సమయంలో ప్రజల్ని ఎంపవర్ చేయకపోతే మనల్ని ఇష్టపడరు. ఈ రెండూ బ్యాలెన్స్ చేయాలి. నాకున్న అనుభవం, ఆలోచనతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే అప్పులను బ్యాలెన్స్ చేసుకుంటాం. రాష్ట్రంలో ముందుగా సంపదను సృష్టించాలి. మేనేజ్‌మెంట్ సరిగా ఉండాలి. ప్రొడక్టివిటీ కూడా ఉండాలి.

50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామంటున్నారు? ఇప్పుడు 50 ఉన్న వారిని వృద్ధులుగా పరిగణించడం లేదుగా!

చేనేత కార్మికులు, మత్స్యకారుల్లో 50 ఏళ్లకే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కొంతమంది సామాజికంగా, ఆర్థికంగా జీవితాంతం బాగా వెనకబడిపోయారు. వారికీ అవకాశమివ్వాలి. లేదంటే... ఎప్పటికీ వెనుకబడే ఉంటారు. అందుకు అనుగుణంగానే ఒక పాలసీని తీసుకొస్తాం.

తెలంగాణలో సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా బాగానే చేశారు. అయినా జిల్లాల్లో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటేస్తే... హైదరాబాద్‌లో మాత్రం కేసీఆర్ ప్రభుత్వం బాగుందని ఓటేశారు?

హైదరాబాద్ అభివృద్ధి విషయంలో నా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులందరికీ ధన్యవాదాలు చెప్పాలి. ఎవ్వరూ నాశనం చేయ్యలేదు. ఏపీలో జగన్ ప్రజావేదికను కూల్చినట్టు... అక్కడ వైఎస్ అధికారంలోకి రాగానే హైటెక్ సిటీని కూల్చలేదు.

అనుకూల రాజకీయ వాతావరణం ఏర్పడిన తర్వాత ప్రజలు ఇంకేమీ ఆశించరు. గ్యారెంటీలను, సూపర్ సిక్స్‌లతో సంబంధంలేకుండానే ఓటు వేస్తారు కదా!

ఏ రాజకీయ పార్టీకైనా పాజిటివ్, యాంటీ అనే రెండు కోణాలుంటాయి. ఆశ, భయం కూడా ఉంటాయి. ఇప్పుడు జగన్ మీద ప్రజలకు ఆశలు సన్నగిల్లాయి. పాత మేనిఫెస్టోనే మళ్లీ ముందు పెట్టాడు. అంటే.. జగన్ ఏమీ చేయలేకపోతున్నాడన్న అవగాహన ప్రజల్లో ఏర్పడింది. మాకు ఇప్పుడు ఒక హోప్ వచ్చింది. చేస్తామన్న నమ్మకం ఉంది. మా హామీల పట్ల ప్రజల్లో ఉన్న ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ తెలిసిపోయింది.


ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందా?

ఒకరి పట్టాదార్ పాస్‌బుక్‌పై జగన్ ఫొటో ఎందుకు? రాజముద్రను, రాష్ట్ర అధికార చిహ్నాన్నిప్రజలు ఆమోదిస్తారు. కానీ.. ఆయన ఫొటో వేయడమేమిటి? ఇప్పుడు మరో అడుగు ముందుకేసి, బరితెగించి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను అమలు చేస్తున్నాడు. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా ఎవరినో ప్రైవేటు వ్యక్తిని నామినేట్ చేస్తారు. ఆయన ద్వారా భూమిని రెగ్యులరైజ్ చేస్తారట. రేపు ఏదైనా భూ సమస్య వస్తే ఎవరు బాధ్యులు?

పతనమైన ఈ రాష్ట్రాన్ని మీరు మళ్లీ అభివృద్ధి బాటలో నిలబెడతారనే ప్రజల నమ్మకాన్ని నిజం చేయగలరా?

ఇప్పుడు నేను చేయలేకపోతే ఇంకెవరూ చేయలేరు. ఎందుకంటే, అది నా బ్రాండ్. అది నా ట్రాక్ రికార్డు. నా జీవితంలో ఇప్పటి వరకు చేసిన దానికంటే పట్టుదలగా.. పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటాను.

జన చేతనం



ప్రజా అజెండా

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

ఆంధ్రజ్యోతి

గురువారం ◇ 9-5-2024

కౌంట్ డౌన్ 4 రోజులు

జగన్ పాలనలో ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి జాడ లేదు. సంక్షేమ పథకాల అమల్లోనూ లబ్ధిదారుల జాబితాల్లో కోతలు, నిధుల కత్తిరింపులు, ఎగవేతలు, వాయిదాలు. కానీ అప్పులు చేయడంలో మాత్రం జగన్ సర్కారు రికార్డు సృష్టించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పు చేయడం తప్పంటూ సుద్దులు చెప్పిన జగన్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి.. నేడు రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చారు. పరిమితికి మించి అడ్డగోలుగా అప్పులు చేశారు. అడ్డదారుల్లో కార్పొరేషన్ల ద్వారా రుణాలు తెచ్చారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంపై మొత్తం దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల రుణ భారం మోపారు. ఆర్థిక క్రమశిక్షణలో ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచిన రాష్ట్రాన్ని నేడు అప్పుల కుప్పగా మార్చారు. టీడీపీ ప్రభుత్వంలో పరిమితికి లోబడి అప్పులు చేసి, ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు తదితర పనులను పరుగులు పెట్టించారు. జగన్ సర్కారు వచ్చాక మొత్తం ప్రాజెక్టులన్నింటినీ ఆపేసింది. అందినకాడికి అప్పులు చేసి ఏం చేసినట్టు? రాష్ట్రానికి, ప్రజలకు ఏం ఉద్ధారకం చేసినట్టు? మరోవైపు ప్రజలపై ఎడాపెడా పన్నులు, చార్జీల పేరిట భారం మోపింది.

అమ్మ.. జగనా!

జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేస్తోందని గగ్గోలు పెట్టారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటేస్తోందని నానాయాగీ చేశారు. అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం ఏమైపోతుందని నాడు సుద్దులు చెప్పిన జగన్.. తాను అధికారంలోకి వచ్చాక అప్పులు చేయడంలో రికార్డు సృష్టించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కంటే ఐదారు రెట్లు ఎక్కువగా అడ్డగోలుగా అప్పులు చేశారు.



ఇంత దా'రుణ'మా!

రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన అప్పు రూ.లక్ష కోట్లు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో చేసిన రుణం రూ.1.6 లక్షల కోట్లు. 2019లో జగన్ సర్కారు వచ్చే నాటికి ఏపీ అప్పు 2.6 లక్షల కోట్లు. ప్రస్తుతం పెండింగ్ బిల్లులతో కలిపి ఆంధ్రప్రదేశ్ అప్పు 12.5 లక్షల కోట్ల రూపాయలు. అంటే.. ఈ ఐదేళ్లలో జగన్ సర్కార్ రాష్ట్రంపై మోపిన రుణభారం అక్షరాలా దాదాపు పది లక్షల కోట్ల రూపాయలు! ఇందులో కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులు 2.5 లక్షల కోట్లు, పెండింగ్ బిల్లులు రూ.2 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.12.5 లక్షల కోట్లు

ఈ ఐదేళ్లలోనే 10 లక్షల కోట్ల భారం

కార్పొరేషన్ల అప్పులే 2.5 లక్షల కోట్లు

పెండింగ్ బిల్లులు 2 లక్షల కోట్లకు పైనే

నాడు సుద్దులు చెప్పి..
నేడు ఆర్థిక విధ్వంసం

అడ్డగోలుగా అప్పులు.. ఆస్తుల తాకట్టు

అప్పుల కుప్ప

జగన్ పాలనలో రాష్ట్రం రుణాల ఊబిలోకి

నాడు సుద్దులు

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ కష్టాల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షనేతగా జగన్, ప్రజాపద్దుల కమిటీ అధ్యక్షుడిగా, ఇప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక నిర్వహణ గురించి చెప్పని సుద్దులు లేవు. ఆర్థిక పరిస్థితిపై చేయని విశ్లేషణ లేదు. అప్పు రాష్ట్రానికి ముప్పన్నారు. అప్పు తేవడం ముమ్మాటికీ తప్పేనన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటిపోయి మరీ ఏపీ అప్పులు చేస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే అప్పులు చేయకుండానే రాష్ట్రాన్ని పాలిస్తామనే స్థాయిలో ప్రజలను నమ్మించారు. ఆర్థిక నిర్వహణ అంటే ఏంటో చూపిస్తామన్నారు. అభినవ ఆర్థిక వేత్తలుగా, ఆర్థిక సంస్కర్తలుగా పోజులిచ్చారు.



నేడు అప్పులే అప్పులు

అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన కొత్త ఆర్థిక పాఠాలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక 4 నెలలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మంత్రి బుగ్గన శ్వేతపత్రం విడుదల చేసి టీడీపీపై దుమ్మెత్తిపోశారు. ఆ తర్వాత తమ పాలనలోని ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం ఊసే లేదు. అప్పులు చేయడంలో జగన్ రికార్డు సృష్టించారు. బుగ్గన అయితే అప్పులు చేయడం తప్పెలా అవుతుందంటూ ఎదురు దాడి మొదలుపెట్టారు. పరిమితికి మించి దొంగ దారుల్లో అప్పులు చేశారు. ఈ ఐదేళ్లలో ఏడాదికి రూ.లక్ష కోట్ల చొప్పున అప్పులు తెచ్చారు. చివరి రెండేళ్లలో అప్పు ఏడాదికి రూ.లక్ష కోట్లకు పైగా తెచ్చారు. ఇక కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులు 2.5 లక్షల కోట్లు, పెండింగ్ బిల్లులు 2 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ప్రస్తుతం ఏడాదికి అప్పుల అసలు, వడ్డీ కింద రూ.65,000 కోట్లు చెల్లిస్తున్నారు.

గ్యారెంటీ పెంచి అప్పులు

గతంలో అప్పులు చేయడాన్ని తప్పు పట్టిన జగన్ అధికారంలోకి వచ్చాక అప్పుల కోసం ప్రభుత్వం గ్యారెంటీలు ఇచ్చే పరిమితిని రెట్టింపు చేసేశారు. మునుపటి ఆర్థిక సంవత్సరంలో సాధించిన రెవెన్యూ రాబడిలో 90 శాతం మాత్రమే గ్యారెంటీలు ఇవ్వాల్సి ఉండగా.. జగన్ సీఎం అయ్యాక గ్యారెంటీల పరిమితిని 180 శాతానికి పెంచారు. అంతకువించి గ్యారెంటీ అప్పులు తీసుకొచ్చారు.

కోవచ్చు. ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకుంటున్న తీరు రాజ్యాంగ విరుద్ధమని, ఇది ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి విరుద్ధమని సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి స్పష్టం చేయడం గమనార్హం. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గత ఏడాది మే 15న రూ.5,000 కోట్లను ఎన్‌సీడీలు జారీ చేయడం ద్వారా అప్పు తేవాలనుకుంది. కానీ, ఆ ట్రేడింగులో ఎవరూ పాల్గొనవద్దని ఇన్వెస్టర్లను బీఎస్ఈ హెచ్చరించడంతో అది ఆగిపోయింది.

కేంద్రం ఆక్షేపణ

జగన్ సర్కారు చేసిన అప్పులపై కేంద్రం పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. 'ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్పొరేషన్లకు రుణాలు ఇస్తుంటే కాస్త జాగ్రత్తగా వ్యవహరించండి. అక్కడ నిబంధనలన్నీ ఉల్లంఘించి అప్పులు తీసుకుంటున్నారు' అని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ ఆర్‌బీఐ ద్వారా జాతీయ బ్యాంకులను అప్రమత్తం చేసింది. దీన్నిబట్టి జగన్ సర్కారు ఏ స్థాయిలో ఆర్థిక ఉల్లంఘనలకు పాల్పడిందో అర్థం చేసు

ఆ రెండే పనులు

జగన్ అధికారంలోకి వచ్చాక అప్పులు తేవడం కోసం ఆర్థిక శాఖలో కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వీరి పని కేవలం కొత్తకొత్త మార్గాల్లో అప్పులు ఎలా పుట్టించాలా అని ఆలోచించడం మాత్రమే. ఇద్దరు ఉన్నతాధికారుల్లో ఒకరు రకరకాల మార్గాల్లో బయట నుంచి అప్పులు తెస్తుంటారు. మరొకరు ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోని డబ్బులు లాగేసి, సొంత మనుషులకు బిల్లులు చెల్లిస్తుంటారు. ఆఖరికి బడ్జెట్ తయారీ పని కూడా లేదు. దానికోసం కన్సల్టెన్సీలను నియమించుకున్నారు.

అంతా రహస్యం

జగన్ ప్రభుత్వంలో జీవోలతో సహా అన్నీ రహస్యాలే. దొంగ అప్పుల వ్యవహారం బయటికొచ్చిందంటూ ఆ శాఖలో ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అప్పులు తేవడం మాత్రం మానలేదు. కార్పొరేషన్లకు ఎంత మొత్తం గ్యారెంటీ ఇచ్చారు? ఎన్ని అప్పులు తెచ్చారన్న విషయాన్ని ఐదేళ్ల నుంచి కాగ్ ప్రతి నెలా అడుగుతోంది. అయినా జగన్ సర్కార్ జవాబివ్వలేదు. అలాగే పబ్లిక్ అకౌంట్ నుంచి ఎంత వాడుతున్నారన్న విషయం చెప్పాలని కాగ్ అడగని నెల లేదు. ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. టీడీపీ హయాంలో సీఎం డ్యాష్‌బోర్డులో అన్ని శాఖల సమాచారం ఉండేది. జగన్ వచ్చాక వాటిని ఆపేశారు.

తాకట్టు దారుణాలు

జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలు, భూములను బ్యాంకులకు తనఖా రిజిస్ట్రేషన్ చేసి మరీ అప్పులకు తెగబడ్డారు. రోడ్లు భవనాల శాఖ ఆస్తులు, విశాఖలోని ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, పోర్టు భూములతో పాటు ఏకంగా రాష్ట్ర సచివాలయం కూడా తాకట్టు పెట్టి విచ్చలవిడిగా అప్పులు తెచ్చారు.

ఆదాయం దారి మళ్లింపు

ఖజానాకు రావాల్సిన ఆదాయాన్నైనా, ఒక శాఖకు రావాల్సిన ఆదాయాన్నైనా, ఒక పని కోసం ఖర్చు చేయాల్సిన నిధులనైనా, ఒక పథకం కోసం ఖర్చు చేయాల్సిన నిధులనైనా వేరే ఖర్చుల కోసం మళ్లించడం నేరం. జగన్ సర్కార్ ఈ నేరాన్ని ఐదేళ్లలో ప్రతి రోజూ చేస్తోంది. ముందుగా ఖజానాకు రావాల్సిన మద్యం వ్యాట్ ఆదాయాన్ని బేవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించి, ఆ కార్పొరేషన్ ద్వారా రూ.25,000 కోట్ల అప్పులు తెచ్చారు. పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై వేసిన సెస్ ఆదాయాన్ని ఏపీఆర్‌డీసీకి మళ్లించి దాని ద్వారా రూ.7,000 కోట్ల అప్పులు తెచ్చారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం కేంద్రం ఇచ్చిన నిధులను సొంత అవసరాల కోసం వాడారు. దీంతో కేంద్రం పథకాల నిధుల కోసం ప్రత్యేకమైన బ్యాంకు ఖాతాలు ప్రారంభించింది. అయినప్పటికీ జగన్, బుగ్గనను పథకాల నిధులు మళ్లించకుండా కేంద్రం ఆపలేకపోయింది. ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్‌ను ప్రారంభించి వివిధ శాఖల వద్ద ఉన్న డబ్బులు దాదాపు రూ.10,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంది. దీన్ని ఆర్‌బీఐ తీవ్రంగా తప్పుబట్టడంతో అంతటితో ఆ దుర్మార్గాన్ని ఆపేశారు. ఏపీఎస్‌డీసీ నుంచి తెచ్చిన అప్పులపై వడ్డీ చాలా ఎక్కువ. రూ.25,000 కోట్ల అప్పులకు అసలు, వడ్డీ కలిపి దాదాపు రూ.50,000 కోట్లు చెల్లించాలి.

కార్పొరేషన్లే ఏటీఎంలు

జగన్ ప్రభుత్వానికి కార్పొరేషన్లు ఏటీఎంలుగా మారాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏదో ఒక కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల నుంచో, పీఎఫ్‌సీ, ఆర్ఈసీల నుంచో లేదా ఏకంగా స్టాక్ మార్కెట్ నుంచో వేల కోట్ల అప్పులు తెచ్చారు. మార్చి 1వ తేదీన కూడా రూ.7,000 కోట్లు అప్పు తెచ్చారు. జగన్ సర్కార్ ఆర్థిక దురాగతాలకు బలికాని కార్పొరేషనే లేదు. 2019లో రూ.12,000 కోట్లున్న సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అప్పు ఇప్పుడు రూ.50,000 కోట్లపైనే. ఆ తర్వాత ఏపీఎస్‌డీసీ, ఏపీఆర్‌డీసీ, ఏపీ ఎస్ఎఫ్ఎస్‌సీఎల్, ఏపీఎండీసీ, ఏపీ మారిటైమ్‌బోర్డు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా విచ్చలవిడిగా అప్పులు తెచ్చారు. జగన్ హయాంలో కార్పొషన్ల ద్వారా తెచ్చిన అప్పులే రూ.2.5 లక్షల కోట్లు దాటాయి.

నాడు జగన్ విమర్శలు

'ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి అప్పులు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కడిది? జీఎస్‌డీపీలో 3 శాతం మాత్రమే అప్పులు తీసుకోవాలి. కానీ 8 శాతం అప్పులు చేస్తున్నారు' అని 2016 బడ్జెట్ సమావేశాల సందర్భంగా జగన్ విమర్శించారు.

ఇప్పుడు నోరు విప్పితే ఒట్టు

ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం జీఎస్‌డీపీలో రాష్ట్రం అప్పులు 3.5 శాతం దాటకూడదు. కానీ జగన్ ప్రభుత్వం పంపిన తప్పుడు లెక్కల ప్రకారం లెక్కిస్తేనే అవి 4.2 శాతానికి చేరాయని కాగ్ హెచ్చరిస్తోంది. అనధికార అప్పులు కూడా కలిపితే అప్పులు 6.5 శాతానికి చేరుకుంటాయి. దీనిపై జగన్, బుగ్గన నోరెత్తరు.

జీఎస్‌డీపీలో మాయాజాలం

జీఎస్‌డీపీలో 3.5 శాతం మొత్తాన్ని కేంద్రం అప్పులకు అనుమతి ఇస్తుంది. దీంతో జీఎస్‌డీపీ అంచనాలను ప్రతిఏడాది దాదాపు రూ.లక్ష కోట్లకు పైగా పెంచి పంపుతుండటంతో రాష్ట్ర సామర్థ్యానికి మించి అప్పులకు అనుమతి వస్తోంది. అలాగే పబ్లిక్ అకౌంట్ నెట్ ఖాతా నుంచి ప్రభుత్వం రూ.15,000 కోట్లు వాడుతోంది. కానీ రూ.400 కోట్లే వాడుతున్నట్టు కేంద్రానికి సమాచారం ఇస్తోంది. దీంతో కొత్త అప్పుల పరిమితి ఇంకో రూ.15,000 కోట్ల మేర పెరుగుతోంది. అలాగే జగన్ సర్కార్ పీడీ ఖాతాలతో విపరీతమైన ఆర్థిక అరాచకాలకు పాల్పడింది.



బిల్లు ఘొల్లు

పెండింగ్ బిల్లులను తదుపరి ఆర్థిక సంవత్సరంలోకి మైగ్రేట్ చేయడం లేదు. దీంతో ఆ బిల్లులు వ్యవస్థ నుంచి వెనక్కెళ్లిపోతున్నాయి. తిరిగి వ్యవస్థలోకి తీసుకురావాలంటే వాటికి మళ్లీ బడ్జెట్ పెట్టాలి. అన్ని అనుమతులూ తీసుకోవాలి. అవన్నీ లెక్కల్లోకి రాకుండా మురిగిపోయి ఉన్నాయి. ఇలాంటి బిల్లులు దాదాపు రూ.2 లక్షల కోట్లున్నాయి. ఇవి కూడా ప్రభుత్వ అప్పుల ఖాతాలోకి వస్తాయి.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఎలక్షన్ స్పెషల్

ఏపీ ఎన్నికలపై తెలంగాణలో బెట్టింగ్!



దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో మూడు దశల పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 13న తెలుగు రాష్ట్రాల్లోనూ పోలింగ్ జరగనుంది. తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ఇక్కడంతా ఏపీ ఎన్నికలపైనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. నిజానికి తెలంగాణలోని హైదరాబాద్ సహా మరికొన్ని జిల్లాల్లో ఉండే ఆంధ్రా ప్రజలకు ఏపీలో ఓట్లున్నాయి. కొంతమందికి మాత్రం తెలంగాణలోనే ఓట్లున్నాయి. అయితే ఓట్లు, ప్రాంతంతో సంబంధం లేకుండా ఈ సారి ఎన్నికల్లో ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంపైనే చర్చ జరుగుతోంది. అంతేకాదు ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయనే అంశంపై ఏకంగా బెట్టింగ్‌లు వేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, అమీర్‌పేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మల్కాజ్‌గిరి సహా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోని ఏపీ, తెలంగాణ ప్రజల్లో ఈ చర్చ మరింత ముదురుతోంది. ఎన్నికలకు మరో నాలుగు రోజులే సమయం ఉండడంతో ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. ఈ సారి ఏపీ ఎన్నికల్లోకి కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ షర్మిల అడుగుపెట్టడంతో ఆ ప్రభావం ఏ మేరకు ఉంటుంది..? కడపలో పరిస్థితి ఎలా ఉంటుంది..? అంటూ ఆరా తీస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లోని ఓటర్ల కోసం ఉచిత బస్‌లు

టికెట్ల బుకింగ్ కోసం ప్రత్యేక గూగుల్ లింక్



ఆంధ్రప్రదేశ్‌లో మరో 4 రోజుల్లో పోలింగ్ జరగనుంది. ఇప్పటికే ప్రచారం పతాకస్థాయికి చేరింది. గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు మండే ఎండలను సైతం లెక్క చేయకుండా శ్రమిస్తున్నాయి. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో ఉన్న ఓట్లను నేతలు వడపోస్తున్నారు. ఒక్క ఓటు కూడా మిస్ అవ్వకూడదనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లను తీసుకురావాలని నిర్ణయించారు. ఏపీకి చెందిన ఓటర్లు చాలా వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలు సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్నారు. వారిని ప్రత్యేక బస్సుల్లో తరలించాలని నిర్ణయించారు. టికెట్ల బుకింగ్ కోసం "స్పెషల్ గూగుల్ లింక్"ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా తమ నియోజకవర్గాలకు వెళ్లేందుకు ఉచితంగా బస్ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఓటు ఎక్కడ ఉంది, ఏ నియోజకవర్గం అనే వివరాలతో పాటు ఓటర్ కార్డును ఆ లింక్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత ఏ బస్సులో టికెట్ బుక్ అయిందనే వివరాలు సదరు ఓటర్ ఫోన్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. మరోవైపు ఓటర్లే స్వయంగా వస్తే బస్సు చార్జీలు ఇస్తామని, లేదా నలుగురు కలిసి వచ్చేలా ఉంటే వారి కోసం ప్రత్యేకంగా కారును ఏర్పాటు చేస్తామంటూ పార్టీలు సూచిస్తున్నాయి. ఓటు మిస్ కాకూడదనే ఉద్దేశంతో బయట ప్రాంతాల్లో ఉన్న వారి కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. వారిని కలిసేందుకు స్పెషల్ టీమ్‌లు, లేదంటే అక్కడే ఒక టీమ్ లీడర్‌ను నియమించి, ఆయా ఓటర్లకు పార్టీలు కూడా ఇస్తున్నట్టు సమాచారం.

-హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

అన్నదాత నెత్తిన అప్పుల కుంపటి

రాష్ట్రంలో ఒక్కోరైతు కుటుంబంపై రూ.2.45 లక్షల భారం

వార్షిక ఆదాయం కన్నా రెట్టింపు బాకీలు

తలసరి రుణ భారంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఏపీ

రాష్ట్ర రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తలసరి రుణ భారంలో రాష్ట్ర రైతులు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారు. రాష్ట్రంలో ఒక్కో రైతు కుటుంబంపై రూ.2,45,554 అప్పు పేరుకుంది. గత డిసెంబరులో కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఏపీలో ఒక్కో రైతు కుటుంబ వార్షిక ఆదాయం సగటున రూ.1,20,760 ఉండగా, అప్పు మాత్రం అంతకు రెట్టింపు ఉంది. గత ఐదేళ్లుగా వరుస విపత్తులతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాగు ఖర్చులు ఏడాదికేడాది పెరిగిపోతుండగా.. దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. దీనికితోడు తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు అంతంత



మాత్రం సాయంతో సరిపెడుతున్నాయి. పీఎం కిసాన్ కింద రైతులకు సాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులకు నయా పైసా ఇవ్వట్లేదు. రాష్ట్రప్రభుత్వం లక్షన్నర మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు మాత్రమే రూ.13,500 అందిస్తోంది. వాస్తవంగా రాష్ట్రంలో సగానికి పైగా కౌలురైతులు ఉన్నారు. వారిలో అగ్రవర్ణాలకు చెందిన వారు సగం కన్నా ఎక్కువే. కానీ వారికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహాయమూ అందట్లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోనూ పంట సాగు హక్కు పత్రం ఉన్నవారికే పెట్టుబడి సాయం ఇస్తున్నారు. పంట రుణాలు కూడా కౌలు రైతులందరికీ ఇవ్వట్లేదు. ప్రభుత్వ రాయితీలకు ఈ-క్రాప్ తప్పనిసరి చేయడంతో కౌలు సాగుదారులకు లబ్ధి అందట్లేదు.

-అమరావతి, ఆంధ్రజ్యోతి

అప్పుల భారంతో ఆత్మహత్యలు

పంటలు సాగు చేసి అప్పుల పాలైన రైతులు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో 2,627మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇందులో సగానికి పైగా కౌలురైతులే. వ్యవసాయంపై ఆసక్తి తగ్గిన భూయజమానుల్లో 40% మంది కౌలుకు ఇస్తున్నారు. కౌలు వ్యవసాయం చేస్తున్నవారికి ప్రభుత్వాలు పెద్దగా సాయం చేయడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కౌలురైతులు తలకు మించి అప్పులు చేసి, బాకీలు చెల్లించలేక తనువు చాలిస్తున్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతుల సంఖ్య

2019-20	628
2020-21	564
2021-22	481
2022-23	369
2023-24	585
మొత్తం	2,627

అబ్బ ఛా!



వైఎస్ అవినాశ్ రెడ్డి

నా అక్కలే నాకు క్షమాపణ చెబుతారు!


నా అక్కలు సునీత, షర్మిలతో పోరాడే శక్తిని ప్రజలే నాకు ఇస్తారు. నన్ను కను మరుగు చేయాలంటే దేవుడు ఒప్పుకోడు. నా తప్పు లేకపోయినా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. మంచి మనిషి వైఎస్ భాస్కర్ రెడ్డిని జైల్లో పెట్టారు. వివేకం చిన్నాన్నను చంపిన వాస్తవం వెలుగులోకి వస్తుంది. అప్పుడు వీళ్లే నాకు క్షమాపణలు చెబుతారు.

ఫీజుల కోసం 'తల్లు'డిల్లేలా..!



ఎప్పుడో రెండు నెలల కిందట మార్చి 1న జగన్ 'విద్యాదీవెన' కోసం బటన్ నొక్కారు. మే 1 కూడా వచ్చింది. అయినా, ఇంకా తల్లుల ఖాతాల్లో మాత్రం ఫీజులు పడ లేదు. 'తల్లులకు ప్రశ్నించే హక్కు' కల్పించడానికే ఈ విధానం తెచ్చామన్నారు. దానికి భిన్నంగా ఫీజులు ఎప్పుడు కడతారంటూ కాలేజీలు కురిపించే ప్రశ్నలవర్షంతో తల్లులు తలదించుకోవాల్సిన పరిస్థితి!

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద ఇచ్చే ఫీజులను గత ప్రభుత్వంలో నేరుగా కాలేజీల ఖాతాలకు జమచేసేవారు. జగన్ ప్రభుత్వం పారదర్శకత పేరుతో కాలేజీలకు బదులుగా తల్లుల ఖాతాల్లో ఫీజులు జమ చేస్తామని ప్రకటించింది. మొదట్లో ఇదేదో బాగుంది అనుకున్న తల్లిదండ్రులకు, కొంతకాలం గడిచాక గానీ ప్రభుత్వం అసలు కుట్ర అర్థంకాలేదు. కాలేజీలకు ఫీజులు వేసే విధానంలో ఎక్కువ బకాయిలు పెట్టలేరు. అదే తల్లిదండ్రులకు ముడిపెడితే వారి పాట్లు వారు పడతారు. ఫీజులు వేసే విధానాన్ని జగన్ మార్చడంలోని అసలు దురుద్దేశం ఇదే!



అమ్మలకు ముడిపెట్టి ముంచేశారు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అస్తవ్యస్తం
- బటన్ నొక్కి 2నెలలైనా అందని తాజా ఫీజులు
- ఫీజులు కట్టేందుకు తల్లిదండ్రులు అప్పులపాలు

జగన్ ప్రభుత్వం తెచ్చిన ఒక్క విధానం విద్యార్థులను నిలువునా ముంచింది. 'నేరుగా తల్లుల ఖాతాల్లోకే ఫీజులు' అన్న నినాదం విద్యార్థులు, తల్లిదండ్రులను ముప్పుతిప్పలు పెడుతోంది. గత ప్రభుత్వంలో ఫీజులతో సంబంధం లేకుండా ప్రశాంతంగా పిల్లలను చదివించుకున్న తల్లిదండ్రులు... ఈ ప్రభుత్వంలో అప్పులు చేసి ఫీజులు కడుతూ నానా పాట్లు పడుతున్నారు. ఫీజులు కట్టకపోతే ఏరోజు పిల్లలను కాలేజీ నుంచి ఇంటికి పంపుతారో, చదువు పూర్తయినా సర్టిఫికెట్ ఇస్తారో లేదోనని తల్లిదండ్రులు రోజూ భయపడుతూ గడపాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఏర్పడింది. జగన్‌కు ముందు ప్రభుత్వాలు ఉన్నత విద్యా కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలుచేసేవి. తెలుగుదేశం ప్రభుత్వంలోనూ ఈ పథకం అమలైంది. ఈ విధానంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఏనాడూ ఇబ్బంది పడలేదు. ఎందుకంటే.. అప్పుడు నేరుగా ప్రభుత్వం కాలేజీలకు నగదు విడుదల చేసేది. ప్రభుత్వం ఏవైనా బకాయిలు పెడితే కాలేజీల యాజమాన్యాలు నేరుగా ప్రభుత్వంతో మాట్లాడుకునేవి. దీంతో ఫీజులతో విద్యార్థులకు సంబంధం లేకుండా పోయింది.

● ఇప్పుడిలా..

పేద విద్యార్థులకు ఫీజులు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వైసీపీ పేర్కొంది. దీంతోపాటు వసతి దీవెన కింద ఏటా రూ.20వేలు ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో పారదర్శకత పెరగాలంటూ ఫీజులు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసేలా విధానాన్ని మార్చింది. అప్పటినుంచి విద్యార్థులు, తల్లిదండ్రులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రతి విద్యా సంవత్సరంలో ఏ క్వార్టర్ ఫీజులు ఆ క్వార్టర్‌లోనే విడుదల చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం... మొదటి క్వార్టర్ నగదు చివరి క్వార్టర్ సమయంలో విడుదల చేస్తోంది. ఉదాహరణకు 2023-24 మొదటి క్వార్టర్ ఫీజును ఈ మార్చి 1న విడుదల చేసింది. విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో ఇలా విడుదల చేయడంతో మిగిలిన మూడు క్వార్టర్ల ఫీజులను విద్యార్థులే కట్టుకున్నారు. రూ.40వేలు ఫీజు ఉన్న విద్యార్థికి క్వార్టర్‌కు రూ.10వేలు చొప్పున ఏడాదిలో నాలుగుసార్లు ఇవ్వాలి. ప్రభుత్వం 10వేలు ఇచ్చి చేతులు దులుపుకొంది.

● కాలేజీలకు కలిసొచ్చింది

సకాలంలో డబ్బులు ఇవ్వకుండా తప్పించుకునేందుకు తల్లుల ఖాతాల్లో ఫీజులు వేసే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా, అదే కాలేజీలకు వరంగా మారింది. గతంలో ఫీజులు విడుదల చేయకపోతే ప్రభుత్వం చుట్టూ తిరిగే యాజమాన్యాలు ఇప్పుడు దర్జాగా కాలేజీలోనే కూర్చుని విద్యార్థుల నుంచి వసూలు చేసుకుంటున్నాయి. జగన్ బటన్ నొక్కారా లేదా అనే దాంతో సంబంధం లేకుండా కోర్సులో చేరేటప్పుడే ఫీజులు తీసుకుంటున్నాయి. అలాగే ఒకసారి జగన్ బటన్ నొక్కితే, ఖాతాల్లో నగదు పడిందా లేదా అనేది చూడకుండా అదే రోజున ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఎన్నికలు ఉన్న ఈ సమయంలోనే బటన్ నొక్కిన రెండు నెలలకు కూడా ఫీజులు రాలేదంటే సాధారణ సమయాల్లో ఎంత ఆలస్యంగా ఖాతాల్లో పడుతున్నాయో అర్థంచేసుకోవచ్చు.

● ఆలస్యం... ఆపై హెచ్చరికలు

ప్రభుత్వం సకాలంలో ఫీజులు విడుదల చేయకపోగా, బటన్ నొక్కిన తర్వాత ఆ ఫీజులను కాలేజీలకు కట్టకపోతే నేరుగా కాలేజీల ఖాతాలకే నగదు వేస్తామని తల్లిదండ్రులను హెచ్చరిస్తోంది. 'మీ ఖాతాల్లో జమ అయిన ఫీజు సొమ్మును వారం పది రోజుల్లో కాలేజీలకు చెల్లించాలి. మీరు కాలేజీలకు చెల్లించకపోతే, తర్వాత విడత నేరుగా కాలేజీలకే జమచేయాల్సి వస్తుంది' అని బెదిరిస్తోంది. అయితే తాము కూడా అదే కోరుకుంటున్నామని, మా ఖాతాల్లో వేయమని ఎవరడిగారని తల్లిదండ్రులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వమే ఆలస్యంగా వేస్తోందని బాధపడుతుంటే, వాటిని తాము వాడుకునే పరిస్థితి ఎక్కడుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలా పెంచి.. ఇలా తగ్గించారు

గత ప్రభుత్వంలో ఇంజనీరింగ్ కాలేజీల ప్రమాణాలను బట్టి ఫీజులు నిర్ణయించేవారు. గరిష్ఠ ఫీజు రూ.1.05లక్షలు ఉంది. కాలేజీల యాజమాన్యాలు అనేకసార్లు డిమాండ్ చేసిన తర్వాత ఈమేరకు గరిష్ఠ ఫీజు నిర్ణయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొత్తం ఫీజులు ప్రభుత్వమే ఇస్తుందన్న హామీని నెరవేర్చే క్రమంలో భారం తగ్గించుకునే ప్లాన్ చేసింది. అందులో భాగంగా మొదట ఫీజులను రూ.70వేలకు కుదించింది. ఫీజులు తగ్గించడంతో కాలేజీలు కూడా బోధనలో ప్రమాణాలు తగ్గించేశాయి. 2020-21లో కరోనాను సాకుగా చూపి ఒక క్వార్టర్ ఫీజు ఎగ్గొట్టారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

సంఘం చెప్పిన మాట



రషీద్ షరీఫ్, అధ్యక్షుడు
సౌత్ ఇండియన్ ముస్లిం పర్సనల్ లా బోర్డు

సెక్యులరిజాన్ని కాపాడేది చంద్రబాబే

మత సామరస్యాన్ని కాపాడటంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. చంద్రబాబు సామాజిక సమతుల్యాన్ని పాటిస్తున్నారు. ప్రజా రాజధానిగా అమరావతి నిర్మాణంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుంది. 2024 టీడీపీ మేనిఫెస్టో మైనారిటీ వర్గాల అభ్యున్నతికి దోహదం చేసేలా ఉంది. ముస్లింల అభివృద్ధికి తోడ్పడే మేనిఫెస్టోని టీడీపీ ప్రకటించింది. దక్షిణ భారతదేశంలోని ముఫ్తీలు, ఉలేమాలు, మతపెద్దలతో సౌత్ ఇండియన్ ముస్లిం పర్సనల్ లా బోర్డుకు సత్సంబంధాలు ఉన్నాయి. టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు మా సంస్థ ద్వారా శాయశక్తులా కృషి చేస్తాం. హైదరాబాద్‌లోని నివాసంలో బుధవారం చంద్రబాబును కలిసి మద్దతు ప్రకటించాం. రాష్ట్రంలో ఉన్న ముస్లిం సోదరులందరూ ఏకపక్షంగా టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును గెలిపించాలి.



ఆంజనేయులు,
వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వడ్డెర్ల మద్దతు టీడీపీకే

గత ఎన్నికల్లో వడ్డెర సంఘీయులంతా వైసీపీకి ఓటు వేసి జగన్‌ను ముఖ్యమంత్రిని చేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చాక వడ్డెర్లకు చేసిందేమీ లేదు. అందుకే ఈసారి టీడీపీని గెలిపించుకోవాలని తీర్మానించాం. మైనింగ్ క్వారీల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, సరిపడా పనిముట్లు ఇస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. నరసరావుపేటలో వడ్డెర బాలురు, బాలికలకు హాస్టల్ వసతి కల్పిస్తామని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. అందుకే టీడీపీని బలపర్చాలని నిర్ణయించుకున్నాం.

- కారంపూడి

అవినాశ్‌రెడ్డి



బలాలు..

సీఎం జగన్ అండ. జగన్ బహిరంగసభలో నా తమ్ముడు అమాయకుడు అంటూ వెనకేసుకురావడం, ఎమ్మెల్యేలందరితో సఖ్యతగా ఉండడం, జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఉండడం.. సీఎం భార్య భారతీరెడ్డి స్వయంగా ప్రచారం చేస్తుండడం.

బలహీనతలు..

వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడి(ఏ-8)గా సీబీఐ చార్జిషీట్ వేయడం.. వివేకాను అవినాశే చంపించాడంటూ ఆయన కుమార్తె సునీత, షర్మిల ఊరూవాడా ప్రచారం చేస్తుండడంతో అవినాశ్‌పై పెల్లుబుకుతున్న ప్రజావ్యతిరేకత. ఇప్పటికే జగన్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత.. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి.. స్టీల్ ప్లాంటుకు మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు.. అవినాశ్ సన్నిహితుల భూకబ్జాలు, దందాలు.

షర్మిల రెడ్డి



బలాలు..

రాజశేఖరరెడ్డి కుమార్తెగా ప్రజల్లో ఆదరణ. జగన్ జైలులో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి వైసీపీని నిలబెట్టినా.. అధికారంలోకి వచ్చాక ఆమెను దూరం పెట్టడం. ఆస్తులివ్వకుండా ఇబ్బంది పెట్టడం, వివేకా హత్య కేసులో న్యాయం చేయండని కొంగుచాపి అడగడం.. ఆడబిడ్డ కావడంతో మహిళల్లో సానుభూతి. కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లిం, క్రిస్టియన్, దళితులు వైసీపీని వీడి కాంగ్రెస్ వైపు మొగ్గుచూపే అవకాశం. క్రైస్తవులతో బ్రదర్ అనిల్‌కుమార్ సమావేశాలు.

బలహీనతలు..

నిన్నమొన్నటిదాకా హైదరాబాద్‌కే పరిమితం కావడం.. స్థానిక నేతలపైనే ఆధారపడాల్సి రావడం.. రెండుచోట్ల విఎనహాయిస్తే మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు లేకపోవడం.

భూపేశ్ రెడ్డి



బలాలు..

తొలిసారి పోటీ.. అయినా అండగా టీడీపీ కేడర్.. ప్రధానంగా జమ్మలమడుగు అసెంబ్లీ స్థానం నుంచి సొంత బాబాయి ఆదినారాయణరెడ్డి బీజేపీ తరఫున బరిలోకి దిగారు. ఇక్కడ వారి కుటుంబానికి సొంతగా ఓటుబ్యాంకు ఉంది. యువకుడు కావడం, అందరితో కలిసిపోవడం.. సూపర్‌సిక్స్ పథకాలు జనంలోకి బాగా వెళ్లడం.. వైసీపీ ఓట్లను షర్మిల చీలిస్తే టీడీపీ లాభపడే అవకాశం.

బలహీనతలు..

ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నేతలతో సమన్వయం సాధించలేకపోవడం.. ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో అనుభవం లేకపోవడం.. టీడీపీ నేతలు సొంత నియోజకవర్గాలకు పరిమితం కావడం.. పార్లమెంటు స్థానంపై దృష్టిపెట్టకపోవడం..

కడప బాద్‌షా ఎవరో?

ఎంపీ టిలి

ఈ దఫా వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ మధ్య బిగ్‌ఫైట్

తొలిసారి వైఎస్ కుటుంబం నుంచి అక్కాతమ్ముడి పోటీ



- కాంగ్రెస్ తరఫున తొలిసారి షర్మిల బరిలోకి
- ఆమెకు మద్దతుగా సునీత ప్రచారం
- వైసీపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌రెడ్డి
- టీడీపీ అభ్యర్థిగా మొదటిసారి భూపేశ్‌రెడ్డి పోటీ
- వివేకా హత్య కేసే ప్రధాన ప్రచారాస్త్రం



నియోజకవర్గ స్వరూపం

(కడప, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బద్వేలు(ఎస్సీ), కమలాపురం, మైదుకూరు అసెంబ్లీ సెగ్మెంట్లు)

మొత్తం ఓటర్లు	16,39,066
పురుషులు	8,00,857
మహిళలు	8,37,993
ట్రాన్స్‌జెండర్లు	216

రాయలసీమకు నడిబొడ్డున ఉన్న కడప లోక్‌సభ నియోజకవర్గం.. ఒకప్పుడు ఫ్యాక్షన్‌కు అడ్డా. కళలు, కవులు, ఖనిజాభివృద్ధి, మత సామరస్యానికి నిలయం.. తిరుమలేశుని కడప దేవునికడప.. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నడచిన ఈ గడ్డలో.. ఈసారి లోక్‌సభ ఎన్నికలు హైవోల్టేజీ రగిలిస్తున్నాయి. కడప లోక్‌సభ స్థానం 1952లో ఆవిర్భవించింది. తొలినాళ్లలో ఇది కమ్యూనిస్టుల కోట. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో సీపీఐ గెలిచింది. 1957లో కాంగ్రెస్ నెగ్గింది. ఆ తర్వాత 1962, 67, 71 ఎన్నికల్లో వరుసగా సీపీఐ విజయం సాధించింది. అనంతరం కాంగ్రెస్‌దే పైచేయి అయ్యింది. 1984లో టీడీపీ నుంచి డి.నారాయణరెడ్డి ఎంపీగా ఎన్నికయ్యారు. 1989 నుంచి ఈ స్థానం వైఎస్ కుటుంబానికి కంచుకోటగా మారింది. 1989, 91, 96, 98 ఎన్నికల్లో వైఎస్ వరుసగా గెలుపొందారు. 1999, 2004 ఎన్నికల్లో వైఎస్ వివేకా ఎన్నికయ్యారు. 2009లో జగన్ గెలిచారు. వైసీపీ స్థాపించిన తరువాత కాంగ్రెస్ ఎంపీగా రాజీనామా చేసి 2011 ఉప ఎన్నికలో బరిలోకి దిగి విజయం సాధించారు. 2014, 19 ఎన్నికల్లో వరుసగా అవినాశ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఇప్పుడు మూడోసారి పోటీ చేస్తున్నారు.

● వైసీపీ ఓట్ల చీలికతో టీడీపీకి లబ్ధి!

ప్రస్తుత ఎన్నికల్లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి.. తన అన్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని నేరుగా సవాల్ చేస్తున్నారు. జగన్ నిలబెట్టిన తన చిన్నాన్న వైఎస్ భాస్కర్‌రెడ్డి కుమారుడు అవినాశ్‌రెడ్డిపై ఆమె పోటీచేస్తున్నారు. ఒకప్పుడు పులివెందుల ఉప ఎన్నికలో రాజశేఖర్‌రెడ్డి భార్య విజయలక్ష్మి, తమ్ముడు వివేకానందరెడ్డి తలపడ్డారు. అయితే కడప లోక్‌సభ స్థానంలో వైఎస్ కుటుంబ సభ్యులు ఒకరిపై మరొకరు పోటీచేస్తుండడం ఇదే తొలిసారి. 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ గెలుపు కోసం ప్రచారం చేసిన షర్మిల.. నేడు అదే పార్టీని ఢీకొంటున్నారు. టీడీపీ సైతం ఈసారి ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి కుమారుడు భూపేశ్‌రెడ్డిని బరిలోకి దింపింది. వైసీపీ ఓట్ల చీలికపైనే టీడీపీ ఆశలు పెట్టుకుంది. ఆ ఓట్లు షర్మిల, అవినాశ్ మధ్య చీలిపోతే టీడీపీ నెగ్గే అవకాశాలు కూడా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు.

● వివేకా హత్య చుట్టూ..

2019 ఎన్నికల ముందు జరిగిన తన చిన్నాన్న వివేకా హత్యను జగన్ అనుకూలంగా మలుచుకుని రాజకీయంగా లబ్ధిపొందారు. వివేకా హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని ఎన్నికల ముందు డిమాండ్ చేసిన ఆయన.. గద్దెనెక్కాక ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. దర్యాప్తు సీబీఐకి వెళ్లాక అనేక కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దస్తగిరి అప్రూవర్‌గా మారిన తర్వాత శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిల పాత్ర తెరపైకి వచ్చింది. అయినా అవినాశ్ కుటుంబానికి జగన్ అండగా నిలిచారు. చెల్లెలు సునీత భర్త రాజశేఖర్‌రెడ్డే హత్య చేసి ఉంటారని ప్రత్యారోపణ చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అవినాశ్‌కే మళ్లీ ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని షర్మిల, సునీత జీర్ణించుకోలేకపోయారు. అవినాశ్‌కు టికెట్ ఇవ్వడం వల్లే తాను పోటీ చేస్తున్నానని షర్మిల చెబుతున్నారు. ఆమెకు మద్దతుగా సునీత ప్రచారం చేస్తున్నారు. కడప, బద్వేలు, మైదుకూరు, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లో వివేకా అభిమానులు మెండుగా ఉండడంతో వారి ప్రచారం ఇక్కడే సాగుతోంది. - కడప, ఆంధ్రజ్యోతి

టెక్కలిలో టీడీపీ ఏకపక్షమే!



హ్యాట్రిక్ కోసం అచ్చెన్న తహతహ!

ఎలాగైనా గెలవాలని దువ్వాడ పోరాటం



అచ్చెన్న బలాలు

దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజల్లో ఆయన, ఆయన కుటుంబంపై నమ్మకం.. మంత్రిగా చేసిన అభివృద్ధి. వైసీపీ కేడర్‌ను తన వైపు తిప్పుకోవడం.

బలహీనతలు..

సీనియర్ నేతలను విస్మరించడం.. సొంత వర్గానికే పెద్దపీట.



దువ్వాడ బలాలు

వైసీపీ నాయకత్వం అండ.. ఆర్థికంగా బలంగా ఉండడం

బలహీనతలు..

దుందుడుకు స్వభావం.. నోరెత్తితే బండబూతులు తిట్టడం.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత.. భార్యతోనూ పొసగకపోవడం.. పార్టీ నాయకుల్లో అసమ్మతి.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బరిలో ఉన్న టెక్కలిలో టీడీపీ ఘనవిజయం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. తప్పుడు కేసులతో ఆయన్ను భయపెట్టాలని చూసినా.. అరెస్టు చేసి జైలుపాల్జేసినా ఆయనకు ప్రజాదరణ మరింత పెరిగిందని చెబుతున్నారు. ఆయన్ను ఎలాగైనా ఓడించాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను మరోసారి బరిలో దించారు. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయిన దువ్వాడ.. ఈసారి ఎలాగైనా గెలవాలని పట్టుదలతో పోరాడుతున్నారు. అచ్చెన్నాయుడు దివంగత నేత ఎర్రన్నాయుడి సోదరుడు. శ్రీకాకుళం జిల్లా ప్రజల్లో ఈ కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. అచ్చెన్నాయుడు హరిశ్చంద్రాపురం నియోజకవర్గం నుంచి 1996 నుంచి 2009 వరకు గెలుపొందుతూనే ఉన్నారు. పునర్విభజన తర్వాత ఏర్పాటైన టెక్కలి నియోజకవర్గం నుంచి 2009లో అచ్చెన్న పోటీచేసి ఓటమి చవిచూశారు. ఆ తర్వాత 2014లో, 2019లో గెలుపొందారు. 2014-19లో మంత్రిగా పనిచేశారు. అసెంబ్లీ లోపల, వెలుపల సీఎం జగన్‌పై విరుచుకుపడే టీడీపీ నేతల్లో అచ్చెన్న ప్రథమ స్థానంలో ఉంటారు. అందుకే జగన్ ఆయన్ను టార్గెట్ చేసి ఈఎస్ఐ కేసులో ఇరికించి అరెస్టు చేయించారు. 83 రోజులు జైల్లో ఉంచారు. ఆ తర్వాత స్థానిక ఎన్నికల్లో తన సమీప బంధువును బెదిరించారన్న ఆరోపణలతో మరోసారి జైలుకు పంపారు. ఇవన్నీ ప్రజల్లో ఆయన పలుకుబడి ఇంకా పెరగడానికి దోహదపడ్డాయి.

● దౌర్జన్యాల దువ్వాడ..

గత ఐదేళ్లలో దువ్వాడ శ్రీనివాస్ దౌర్జన్యాలకు చిరునామాగా మారారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అన్యాయంగా కేసులు పెట్టడం.. దాడులతో భయభ్రాంతులకు గురిచేయడం సాగించారు. 2006లో జడ్పీటీసీగా గెలిచి శ్రీకాకుళం జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ అయిన ఆయన, తర్వాత ప్రజారాజ్యంలో చేరి ఆ పార్టీ తరఫున 2009లో టెక్కలిలో పోటీచేసి మూడోస్థానానికి పరిమితమయ్యారు. తర్వాత వైసీపీ తరఫున 2014లో పోటీచేసి ఓడిపోయారు. 2019లో శ్రీకాకుళం ఎంపీగా పోటీచేసి పరాజయం పాలయ్యారు. చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడుపై దురుసు వ్యాఖ్యలు చేస్తూ జగన్ దృష్టిలో పడ్డారు. 2021లో శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. వాస్తవానికి జగన్ తర్వాత అత్యధిక కేసులు ఉన్నది ఆయనపైనే. పక్క రాష్ట్రం ఒడిసాలో అధికారి సంతకం ఫోర్జరీ చేశారన్న అభియోగంతో భువనేశ్వర్‌లో 52 రోజులు జైల్లో ఉన్నారు. ఎమ్మెల్సీ అయ్యాక మరింత రెచ్చిపోయారు. నియోజకవర్గానికి మూలపేట పోర్టు మంజూరుకావడంతో.. పోర్టుకు ఇసుక, కంకర, రాయి సరఫరాకు సంబంధించి కాంట్రాక్టులన్నీ తానే తీసుకుని లాభపడుతున్నారు. స్థానిక వైసీపీ నేతలెవరికీ అందులో భాగస్వామ్యం ఇవ్వలేదు. దీంతో వీరు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. వందలాది కుటుంబాలు టీడీపీలో చేరాయి. జగన్ ఎన్నికల బస్సు యాత్రను టెక్కలిలోనే ముగించారు. దువ్వాడను గెలిపించాలని ప్రజలను కోరారు. ఆ మర్నాడే దువ్వాడ బంధువులు సైతం పార్టీని వీడి టీడీపీలో చేరిపోయారు. ఇదంతా ఒక ఎత్తయితే.. దువ్వాడ శ్రీనుపై ఆయన భార్యే ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ పెద్దలు వెళ్లి.. ఇంటి వ్యవహారం రచ్చకెక్కకుండా చక్కబెట్టారు.

శ్రీకాకుళం



నియోజకవర్గ స్వరూపం		సామాజికవర్గాల వారీగా
మండలాలు: నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి		కాళింగులు: 76 వేలు, ఆర్య వైశ్య: 30 వేలు, మత్స్యకారులు: 26 వేలు, యాదవ-25 వేలు, రెడ్డిక-24 వేలు, ఎస్సీలు-24 వేలు, పోలినాటి వెలమ-16 వేలు, శ్రీశయన: 10 వేలు, ఎస్టీ-8 వేలు.
మొత్తం ఓటర్లు	2,36,327	
పురుషులు	1,17,816	
మహిళలు	1,18,502	
ట్రాన్స్‌జెండర్లు	9	

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి





బుధవారం రాత్రి విజయవాడలో జరిగిన రోడ్‌షోలో మోదీ, చంద్రబాబు, పవన్, హాజరైన జనం

మన గెలుపును ఎవరూ ఆపలేరు!

- జనంలో అవధుల్లేని ఉత్సాహం
- ప్రభుత్వాన్ని మార్చాలని వారిలో బలమైన కోరిక: ప్రధాని
- రోడ్‌షో ముగిశాక చంద్రబాబు, పవన్‌తో భేటీ

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో మన కూటమి అత్యద్భుత విజయాన్ని నమోదు చేయబోతోంది. కూటమి గెలుపును ఎవరూ ఆపలేరు' అని ప్రధాని మోదీ ప్రకటించారు. బుధవారం విజయవాడ నగరంలో రోడ్ షో ముగిసిన తర్వాత ఆయన పది నిమిషాలపాటు టీడీపీ అధినేత చందబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌లతో సమావేశం అయ్యారు. బెంజ్ సర్కిల్ సెంటర్‌లో ఒక పక్కన వీఐపీలు కాసేపు కూర్చుని మాట్లాడుకోవడానికి ప్రత్యేకంగా ఒక గుడారాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. అందులోనే బాబు, పవన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఘన విజయాన్ని సాధించబోతున్నారంటూ వారిద్దరినీ అభినందించారు. 'నేనీ రాష్ట్రంలో ప్రజల్లో అవధుల్లేని ఉత్సాహాన్ని చూస్తున్నాను. ప్రభుత్వాన్ని మార్చాలన్న బలమైన కోరిక ఉన్నప్పుడే ప్రజల్లో ఇంత దూకుడు కనిపిస్తుంది. కూటమి పట్ల వారి మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. మామూలు విజయం కాదు.. చాలా పెద్ద విజయాన్ని మీరు సాధించబోతున్నారు. ఈ రోజు రోడ్‌షో బ్రహ్మాండంగా జరిగింది. ప్రజల స్పందన చూస్తే ఎన్నికల ఫలితం ఎలా ఉండబోతోందో ముందే తెలిసిపోతోంది. నేను రాష్ట్రంలో పాల్గొన్న సభలన్నీ బాగా జరిగాయి. అన్ని చోట్లా ఒకే మాదిరి ఉత్సాహం, ఘనమైన హాజరు కనిపించాయి. నేను సంతోషంగా ఉన్నాను' అని ఆయన వారితో అన్నారు. ప్రజల్లో ఉన్న ఈ సానుకూలతను సంపూర్ణంగా అందుకోవడానికి పోలింగ్ రోజు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ శాతం బాగా పెరగాలన్నారు. 'ఎండలు మామూలుగా లేవు. చాలా తీవ్రంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కూడా పోలింగ్ బాగా జరిపించుకుంటేనే మనం అనుకున్న ఫలితాలు సాధించుకోగలుగుతాం. ఉదయం ఏడు నుంచి పది గంటల్లోపు వీలైనంత ఎక్కువ ఓటింగ్ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఓటర్లు బయటకు వచ్చి ఓటు వేసేలా మన యంత్రాంగాన్ని కదిలించాలి. రాలేని వారి కోసం ఏర్పాట్లు చేయండి. పోలింగ్ బూత్‌ల వద్ద మంచినీళ్లు, కాస్త నీడ ఉండేలా చూడండి. బయటి ప్రాంతాల్లో ఉన్నవారు కూడా తప్పనిసరిగా వచ్చి ఓటు వేసేలా పిలుపివ్వండి. కూటమి కార్యకర్తలు, అభ్యర్థులను ఈ విషయంలో ఇప్పటి నుంచే అప్రమత్తం చేయండి' అని వారికి సూచించారు. ఇవి మంచి సూచనలని, వీటిని అనుసరిస్తామని చంద్రబాబు, పవన్ ఆయనతో చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితికి సంబంధించి తమ సొంత సర్వేల్లో వస్తున్న సమాచారాన్ని చంద్రబాబు ఆయనకు వివరించారు. కూటమి అఖండ విజయం సాధించబోతోందని, అధికార పార్టీ అభ్యర్థుల్లో కొందరు ఇప్పటికే కాడి కిందపడేశారని తెలిపారు. కూటమిలోని పార్టీల మధ్య ఓట్ల బదిలీ ఎలా ఉంటుందని మోదీ వారిని ఆరా తీశారు. ఆ ఇబ్బందేమీ లేదని, నూటికి నూరు శాతం ఓట్లు కూటమి అభ్యర్థులకు పడతాయని, ఆయా పార్టీల మద్దతుదారులు ఇతరులకు వేసే ఆలోచనలో లేరని పవన్ పేర్కొన్నారు. రోడ్‌షో పూర్తయిన తర్వాత బెంజ్‌సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక విశ్రాంతి గదిలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కాసేపు భేటీ అయ్యారు. అనంతరం రోడ్డు మార్గాన విమానాశ్రయానికి వెళ్లారు.

వైసీపీకి.. కౌంట్ డౌన్ మొదలు!

రాష్ట్రంలో ప్రజారాజ్యం లేదు.. మాఫియా రాజ్యమే: ప్రధాని

రాయచోటి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజారాజ్యం నడవడం లేదు.. మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని ప్రకటించారు. ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని.. 39 మంది చనిపోయారని.. 26 గ్రామాలు దెబ్బతిన్నాయని.. ఇది విని ఆందోళన చెందానని తెలిపారు. రాష్ట్రంలో మంత్రులు రౌడీ, గూండాయిజం చేస్తున్నారని.. మాఫియాకు ప్రభుత్వ మద్దతు ఉందని.. మాఫియాకు ఎన్డీయే సర్కార్ గట్టిగా బుద్ధిచెబుతుంది' అని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా అన్నమయ్య జిల్లా కలికిరిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. తన ప్రసంగాన్ని.. నా ఆంధ్ర కుటుంబసభ్యులకు నమస్కారం అంటూ మొదలు పెట్టారు. తర్వాత మధ్యలోకూడా 'ఆంధ్రప్రదేశ్ వికాసం.. మోదీ లక్ష్యం.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా డబుల్ ఇంజన్ సర్కారు రావాలి..' అంటూ తెలుగులో మాట్లాడారు. అనంతరం జగన్ ప్రభుత్వంపై నిప్పులుచెరిగారు. 'రాయలసీమలో ఎన్నో సమస్యలు ఉన్నాయి.. అయితే ఇక్కడ గనులు, ఖనిజాలు ఉన్నాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయి. కష్టపడి పనిచేసే రైతులు ఉన్నారు. ప్రతిభావంతులైన యువతీయువకులు ఉన్నారు. పర్యాటక రంగానికి కూడా ఎంతో అవకాశం ఉంది. రాయలసీమ ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చా.. జనం ఎందరికో ముఖ్యమంత్రులుగా అవకాశం ఇచ్చారు. అయితే వాళ్లు ఆ మేరకు అభివృద్ధి చేయలేదు. సాగునీటి సౌకర్యాలు లేవు. పరిశ్రమలు లేవు. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఉద్యోగాల కోసం ఇక్కడి వాళ్లు వేరే ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ పరిస్థితి మార్చేందుకు ఆంధ్రలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి' అని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

జలజీవన్‌కు జగన్ సహకారమేదీ?

జలజీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన నీటిని కుళాయి ద్వారా ఇవ్వాలని సంకల్పించాం. కానీ ఈ మిషన్‌కు జగన్ ప్రభుత్వం సహకరించడం లేదు. దేశవ్యాప్తంగా పరిశ్రమల కారిడార్లు ఏర్పాటుచేస్తున్నాం. ఆంధ్రలో నంద్యాల-ఎర్రగుంట్ల, కడప-బెంగళూరు రైలుమార్గం పనులు చేపడతాం. పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్ తరహాలోనే.. టమోటా క్లస్టర్ ఏర్పాటు చేస్తాం. రాబోయే ఐదేళ్లలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రోత్సహించడమే కాకుండా.. రైతు ఉత్పత్తిదారుల సంఘాలనూ ప్రోత్సహిస్తాం. ఇవన్నీ జరగాలంటే.. రాయలసీమలోని అన్ని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలి. కాంగ్రెస్ పార్టీ రివర్స్ గేర్‌లో వెళ్తోంది. ఆర్టికల్ 370ని మళ్లీ తెస్తామంటోంది. రామమందిరం కేసు సుప్రీంకోర్టులో వేస్తామంటోంది. అయోధ్య రామాలయానికి తాళం వేస్తామంటోంది.. సీఏఏ రద్దు చేస్తామంటోంది.. వీటిని మనం సమర్థిద్దామా? ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. శక్తిమంతమైన ప్రభుత్వం ఉన్నప్పుడు దేశం కూడా దృఢంగా ఉంటుంది.

సభ సక్సెస్.. కూటమిలో సంతోషం

మోదీ పాల్గొన్న కలికిరి సభ పూర్తిగా విజయవంతమైంది. ఆయన ప్రసంగానికి భారీ స్పందన లభించింది. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వేలాది మంది సభకు తరలివచ్చారు. ప్రధాని సుమారు 27 నిమిషాలు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, జనసేన రాష్ట్ర నాయకుడు కె.నాగేంద్రబాబు, రాజంపేట, కడప, చిత్తూరు, తిరుపతి ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

భళా మోదీ!

- బెజవాడ గడ్డపై అపూర్వ రోడ్‌షో
- 1.8 కిలోమీటర్లు.. గంట సాగిన ర్యాలీ
- వాహనంపై ఆయనతో బాబు, పవన్
- ఎంజీ రోడ్డుకు ఇరుపక్కలా జనసమూహం
- ప్రధానికి సాదరంగా స్వాగతం
- భారీగా తరలివచ్చిన రాజధాని అమరావతి రైతులు
- బలిదానాలపై ప్లకార్డుల ప్రదర్శన

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నడిబొడ్డున బందరు రోడ్డుపై 1.8 కిలోమీటర్ల మేర కిక్కిరిసిన జనసమూహం మధ్య ప్రధాని మోదీ రోడ్డు షో సాగింది. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో రోడ్డు షోలు నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారిగా విజయవాడ గడ్డపై రోడ్‌షో నిర్వహించారు. తిరుపతి నుంచి ఆయన బుధవారం ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు చేరుకున్నారు. రాత్రి ఏడు గంటలకు రోడ్డు షో నిర్వహించారు. వాహనంపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారు. మహాత్మాగాంధీ (ఎంజీ) రోడ్డుకు ఇరువైపులా గ్యాలరీల్లో ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. మోదీ కాన్వాయ్‌కు ముందు బీజేపీకి చెందిన మహిళలు పార్టీ జెండాలతో నడిచారు. ఎంజీ రోడ్డులో 1.8 కిలోమీటర్ల మేర గంటపాటు ఈ రోడ్‌షో జరిగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు, మూడు పార్టీల అభిమానులతో గ్యాలరీలు కిక్కిరిశాయి. యాత్ర సాగుతున్నంత సేపూ 'నమో నమో నరేంద్ర మోదీ', 'జై చంద్రబాబు', 'బాబులకే బాబు కల్యాణ్‌బాబు' అంటూ నినాదాలు చేశారు. రాజధాని అమరావతి రైతులు 1,604 రోజులుగా అమరావతి రైతులు ఆందోళన చేస్తున్నారని, 251 మంది బలిదానాలు చేసుకున్నారని ప్లకార్డులు ప్రదర్శించారు. అమరావతి నుంచి రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఎంజీ రోడ్డు నుంచి బెంజ్‌సర్కిల్ వరకు మధ్యమధ్యలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి వేదికలు ఏర్పాటు చేశారు. భద్రతా కారణాల రీత్యా వాటిని తొలగించేశారు. రోడ్డు షో ముగిసిన బెంజ్‌సర్కిల్ వద్ద మాత్రం డప్పుల వాయిద్యాలతో ప్రధానికి స్వాగతం పలికారు.

మరచిపోలేని రోడ్ షో: మోదీ ట్వీట్

విజయవాడ రోడ్‌షో మరచిపోలేని స్థాయిలో జరిగిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 'గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో పలుచోట్ల పర్యటించిన తర్వాత ప్రజలు ఎన్డీయేని భారీగా గెలిపించబోతున్నారన్న నమ్మకం నాకు కలిగింది. మహిళలు, యువత ఈ ఊపును బాగా ముందుకు తీసుకెళ్తున్నారు' అని రోడ్ షో తర్వాత 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

నేను పులకించిపోయాను..: చంద్రబాబు

విజయవాడ రోడ్ షోకు ప్రజల నుంచి వచ్చిన అపూర్వ ఆదరణతో తాను పులకించిపోయానని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'చరిత్ర సృష్టించే విజయవాడలో నా అక్క చెల్లెమ్మలు, అన్నదమ్ములు చూపించిన అభిమానం నన్ను కదిలించింది. మొత్తం వాతావరణమంతా ఉత్సాహం, ఆశాభావంతో నిండిపోయింది. ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పట్ల ఎనలేని ఆప్యాయత చూపించారు. జూన్ 4న ఆంధ్ర కొత్త ఉషోదయం ఖాయం' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

మీ ఓటు దెబ్బకు ఫ్యాను రెక్కలు ఊడిపోవాలి!

- రాబోయేది చంద్రబాబు పాలనే
- రామకుప్పం, కుప్పం రోడ్ షోల్లో నారా భువనేశ్వరి పిలుపు



రామకుప్పంలో నిర్వహించిన రోడ్ షోలో నారా భువనేశ్వరి

కుప్పం, మే 8: "వైసీపీ అరాచకాలు మితిమీరాయి. రాష్ట్రంలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కరువైంది. చివరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మీ భూములకు సైతం జగన్ ఎసరు పెడుతున్నారు. మీరు చంద్రబాబుకు వేసే ఓటుతో ఫ్యాను రెక్కలు ఊడిపోవాలి" అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం, రామకుప్పం మండలాల్లో బుధవారం ఆమె ప్రచారంలో పాల్గొని రోడ్ షోలు నిర్వహించారు. భువనేశ్వరి మాట్లాడుతూ.. కుప్పం అభివృద్ధి కోసం చంద్రబాబు ప్రత్యేక మేనిఫెస్టో ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది చంద్రబాబు పాలనేనన్నారు. "మీకోసం చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలను రాబోయే ఐదేళ్లలో ఇస్తానని వాగ్దానం చేశారు. అది గుర్తుంచుకోండి. ఆయన కోసం మిగిలిన ఈ 4 రోజులు పనిచేయండి" అని భువనేశ్వరి పిలుపునిచ్చారు. "చివరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మీ భూములకు కూడా జగన్ ఎసరు పెట్టారు.. జాగ్రత్త" అని హెచ్చరించారు. మళ్లీ పొరపాటున వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రజల భూములన్నింటినీ చెరబట్టి, తాకట్టు పెట్టేస్తారని విమర్శించారు. చంద్రబాబును ఈ సారి గెలిపించడం కాదు, లక్ష ఓట్ల మెజారిటీతో విజయాన్ని అందించాలని కోరారు.

విదేశాలకు జగన్!



- 17 నుంచి 1 దాకా లండన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లో సీఎం దంపతుల పర్యటన
- నాంపల్లి సీబీఐ కోర్టు అనుమతి కోరిన సీఎం

హైదరాబాద్/అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 13వ తేదీన ముగియనున్న నేపథ్యంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి విదేశీ పర్యటన ప్రణాళిక బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఆయన అక్రమాస్తుల కేసులకు సంబంధించిన బెయిల్ షరతుల్లో సీబీఐ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదన్న నిషేధం ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 17 నుంచి జూన్ 1 వరకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జగన్ ఈ నెల 6న జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆ కోర్టు ప్రధాన న్యాయాధికారి టి.రఘురాం విచారణ చేపట్టారు. జగన్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. కుటుంబ పర్యటన నిమిత్తం ఇంగ్లండ్ (లండన్), స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ తదితర దేశాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని.. దేశం విడిచి వెళ్లరాదన్న బెయిల్ షరతులు సడలించాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేశారు.

నిరుడు గ్రీన్‌సిగ్నల్

గత ఏడాది సెప్టెంబరు 2న జగన్ దంపతుల లండన్ పర్యటనకు సీబీఐ అభ్యంతరం చెప్పలేదు. ఇప్పుడు కూడా దర్యాప్తు సంస్థ నుంచి అడ్డంకులూ ఉండే అవకాశం లేదని వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో లండన్ పర్యటనకు జగన్ వెళ్లినప్పుడే .. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ సీఎం చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయన అరెస్టు తాను విదేశాల్లో ఉన్నప్పుడు జరిగిందంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దుమారాన్ని రేపాయి. ముఖ్యమంత్రికి సమాచారం ఇవ్వకుండా ప్రతిపక్ష నేతను సీఐడీ అరెస్టు చేయగలదా అనే విమర్శలు వచ్చాయి. 13వ తేదీ తర్వాత ఇంకో మూడు దశల్లో దేశవ్యాప్తంగా పోలింగ్ జరుగనుంది. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి. అంటే మన రాష్ట్ర ప్రజలు మూడు వారాలు ఎదురుచూడాల్సిన తరుణంలో జగన్ దంపతులు మళ్లీ లండన్‌కు వెళ్తుండడంతో.. అంతా ప్రశాంతంగా ఉంటుందా లేదంటే అనూహ్య పరిణామాలేమైనా చోటు చేసుకుంటాయా అని చర్చ నడుస్తోంది. కాగా, రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం తుది దశకు చేరిన సమయంలో సీఎం జగన్ బుధవారం పూర్తిగా విశ్రాంతి తీసుకోవడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బుధవారమంతా ఆయన తాడేపల్లి ప్యాలెస్ వదిలి బయటకు రాలేదు. దీని మర్మమేంటో వైసీపీ, నేతలు, శ్రేణులకు అంతుపట్టలేదు.

ఎల్లుండి కడపకు రాహుల్..!

అమరావతి, మే 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న కడపకు ఏఐసీసీ ముఖ్యనేత రాహుల్ గాంధీ రానున్నారు. కడప లోక్‌సభ అభ్యర్థి వైఎస్ షర్మిలను గెలిపించాలని ఆయన కోరనున్నారు. వాస్తవానికి 7న రాహుల్ కడపకు వస్తారని పార్టీ నేతలు ఆశించారు. అయితే షెడ్యూల్‌లో మార్పు కారణంగా 11వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకూ కడప సభలో రాహుల్ పాల్గొననున్నారు.

ఏపీ ప్రజల 'మన్‌కీబాత్' వినండి

ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఏపీకి ద్రోహం చేశారు

- జగన్ రివర్స్ టెండర్‌ను అడ్డుకోకుండా పోలవరం వినాశనానికి కారకులయ్యారు
- మోదీకి 10 ప్రశ్నలతో చార్జిషీట్
- రేడియో పంపిన షర్మిల



అమరావతి/కడప, మే 8(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రానికి పదేళ్లుగా ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేశారు. పోలవరం రివర్స్ టెండర్‌ను అడ్డుకోకుండా ప్రాజెక్టు వినాశనానికి కారకులయ్యారు" అని ప్రధాని మోదీపై పీసీసీ చీఫ్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడపలో ఆమె మాట్లాడారు. "ప్రధాని మన రాష్ట్రానికి మళ్లీ మళ్లీ వస్తున్నారు. ఎన్నికల ప్రచారంపై బీజేపీ, మోదీ చూపిస్తున్న శ్రద్ధ రాష్ట్రంపై పెట్టలేదు. ఏపీ ప్రజలను ఓటువేసే యంత్రాలుగా చూస్తున్నారు. అందుకే ఏపీ ప్రజల మన్‌కీబాత్ వినాలంటూ రేడియో పంపిస్తున్నా" అన్నారు. "మీ దత్తపుత్రుడు అవినీతిపరుడు. కరప్షన్‌లో జగన్ టాప్ అని అంటున్నారు. పదేళ్లలో మీకు అదేమీ కనబడలేదా? రాష్ట్రంలో లిక్కర్ మాఫియా ఉందని తెలిసినా, మీరు గాడిదలు కాశారా? వివేకా హత్యలో అవినాశ్‌రెడ్డిని కర్నూలులో అరెస్టు చేయాలని చూసిన సీబీఐని తన్ని తరిమివేశారు. అప్పుడేం చేస్తున్నారు? అరెస్టు కాకుండా అడ్డుకున్నది మీరు. మీ దత్త పుత్రుడికి మద్దతుగా ఉన్నది మీరు.. మీకు ఈ రాష్ట్రంలో అడుగుపెట్టే హక్కు లేదు" అని షర్మిల మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజల పక్షాన మీకు చార్జిషీట్ పంపుతున్నాం. పదేళ్లలో మీరు చేసిన మోసానికి 10 ప్రశ్నలు పంపుతున్నాం. ముందుగా వాటికి సమాధానం చెప్పండి" అని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 1) ప్రత్యేక హోదాపై మాటమార్చి వెన్నుపోటు పొడిచారు. 2) జగన్ రివర్స్ టెండరింగ్‌ను అడ్డుకోకుండా పోలవరం వినాశనానికి నాంది పలికారు. 3) అమరావతి రాజధాని పూర్తికాలేదు. 4) విశాఖ ఉక్కును అమ్మేస్తున్నారు. 5) కడప స్టీలు ప్లాంటు, విశాఖ జోన్ వంటి విభజన హామీలను తుంగలో తొక్కారు. 6) మీ దత్తపుత్రుడు మద్యం సిండికేట్ నడుపుతూ కల్తీ మద్యం తో మనుషుల ప్రాణాలు తీస్తున్నా మీరు పలకలేదు. 7) ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్ అంతం చేయడానికి పూనుకున్నారు. 8) ఇసుక, మద్యం, ఖనిజాలు, అక్రమ కాంట్రాక్టులు, దొంగదారిలో రాష్ట్రం చేస్తున్న అప్పులు, కేంద్ర నిధుల మళ్లింపు.. అయినా చర్యలు లేవు. 9) కర్నూలులో అవినాశ్‌ను అరెస్టు చేయడం చేతకాక సీబీఐ వెనుతిరగడంలో అర్థమేంటి? 10) ఏటా 2కోట్ల ఉద్యోగాలిస్తామన్న మాట ఏమైంది. ఈ పది అంశాలకు సమాధానం చెప్పండి అని షర్మిల డిమాండ్ చేశారు.

రాజధాని ఏదంటే ఏం చెబుతావు?: జగన్‌కు నవ సందేహాలతో షర్మిల లేఖ

"ఏపీకి రాజధాని ఉందా సీఎం గారూ? ఉంటే ఏదని అడిగితే ఏం సమాధానం చెబుతారు" అని జగన్‌ను షర్మిల నిలదీశారు. రాజధాని అంశంపై నవ సందేహాలు పేరిట జగన్‌కు లేఖరాశారు. 1)రాష్ట్రానికి రాజధాని ఏదీ? 2)అమరావతిని ప్రతిపక్ష నేతగా అంగీకరించిన తమరు అధికారంలోకి వచ్చాక ఎందుకు వ్యతిరేకించారు. 3)గత ఎన్నికలకు ముందు ఇక్కడే ఇల్లు కట్టుకుంటున్నానంటూ చెప్పిన మాట వాస్తవం కాదా? 4) రాజధాని అమరావతిలోనే ఉండాలని హైకోర్టు చెప్పినా పట్టుదల ఎందుకు? 5) తమరి సహాయ నిరాకరణ వల్లే అమరావతికి మెట్రోరైలు, రోడ్లు ఆగిపోవడం నిజం కాదా? 6) రైతులు నాలుగున్నరేళ్లుగా ఉద్యమిస్తుంటే చర్చలు జరిపే కనీస బాధ్యత మీకు ఉండదా? 7) రాజధాని రైతుల బాధ్యత విస్మరించిన తమరిని ఎందుకు గద్దె దింపొద్దంటారు? 8) అమరావతి నుంచి కార్యాలయాలను విశాఖ కి తరలించవద్దన్నా తరలిస్తున్నది నిజం కా దా? 9)రాజధానిపై మాట తప్పానని భావిస్తే.. ఓటు వేయవద్దని ప్రజలకు చెప్పగలరా?

గొడ్డలితో అందరినీ నరికేయండి

- జగన్ సతీమణి భారతిపై షర్మిల ధ్వజం

"కడపలో వైసీపీ సింగిల్ ప్లేయర్. మిగతా వారంతా నాన్ ప్లేయర్స్" అంటూ జగన్ సతీమణి భారతిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. "వైసీపీ వాళ్లే అధికారంలో ఉండాలి, వారికి వ్యతిరేకంగా ఉన్న వారందరినీ గొడ్డళ్లతో నరకాలి. ఇదే భారతి స్ట్రాటజీ.. గొడ్డలితో నరికేయండి.. అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్‌గా ఉంటారు" అన్నారు. ఓడిపోతే అరెస్టు ఖాయమని అవినాశ్‌రెడ్డి.. విదేశాలకు పారిపోయేందుకు దొంగ పాస్‌పోర్టులు సిద్ధం చేసుకున్నారన్నారు. "మీ ఎంపీని మీ జిల్లాలో కలవాలంటే రాజశేఖర్‌రెడ్డి బిడ్డకు ఓటు వేయండి, మీ ఎంపీని జైల్లో కలవాలంటే అవినాశ్‌కు ఓటు వేయండి" అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నిట్ సిల్చార్‌లో పీహెచ్‌డీ

సిల్చార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. గ్రూపుల వారీగా(గ్రూప్-ఏ, గ్రూప్-బి) ప్రవేశాల భర్తీని చేపడతారు. గ్రూప్-ఏ అభ్యర్థులు రెగ్యులర్ పరిధిలోకి వస్తారు. వీరికి అన్ని రకాల ఫెలోషిప్‌లు వర్తిస్తాయి. గ్రూప్-బి కేటగిరీ అభ్యర్థులకు ఎలాంటి స్కాలర్‌షిప్‌లు గానీ, ఫెలోషిప్‌లు గానీ వర్తించవు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. గ్రూప్- ఏ అభ్యర్థులకు గేట్/నెట్ స్కోర్‌పై వెయిటేజీ ఇస్తారు.

విభాగాలు

సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, మేనేజ్‌మెంట్ స్టడీస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

అర్హత వివరాలు

విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఇంజనీరింగ్ విభాగాలకు 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 27న
- **రాత పరీక్ష, ఇంటర్వ్యూలు:** జూలై 22న
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 24న
- **వెబ్‌సైట్:** www.nits.ac.in/

ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.... ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ అండ్ టీచింగ్ హాస్పిటల్స్‌లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు 158

పోస్టు: ట్యూటర్
డిపార్ట్‌మెంట్స్: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్.
అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణత
జీతం: నెలకు రూ.70,000
దరఖాస్తు ఫీజు: ఓసీ అభ్యర్థులకు రూ.1000. బీసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15
వెబ్‌సైట్: https://apmsrb.ap.gov.in/msrb/

హెచ్‌ఏఎల్‌లో మెడికల్ ఆఫీసర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బెంగళూరు...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈఎన్‌టీ): 1 పోస్టు
2. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఎమర్జెన్సీ మెడిసిన్): 1 పోస్టు
3. సీనియర్ మెడికల్ ఆఫీసర్(మెడిసిన్): 1 పోస్టు
4. మెడికల్ ఆఫీసర్(జనరల్ డ్యూటీ): 1 పోస్టు

వయోపరిమితి: గ్రేడ్-2 పోస్టులకు 35 ఏళ్లు; గ్రేడ్ -3 పోస్టులకు 45 ఏళ్లు మించరాదు.
వేతనం: నెలకు గ్రేడ్-2 పోస్టులకు రూ.40,000-రూ.1,40,000; గ్రేడ్-3 పోస్టులకు రూ.50,000- రూ.1,60,000
దరఖాస్తులకు చివరి తేదీ: మే 13
వెబ్‌సైట్: https://www.halindia. co.in/career



జాబ్ కార్నర్

కర్నూలు 'సిల్వర్ సెట్'



కర్నూలులోని సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్(అటానమస్, కో ఎడ్యుకేషన్)- 'సిల్వర్ సెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీఏ ఆనర్స్, బీకాం ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సులో భాగంగా ఫీల్డ్ ట్రిప్స్, డిజిటల్ అసైన్‌మెంట్స్, ఈ లెర్నింగ్, గ్రూప్ డిస్కషన్స్, గెస్ట్ లెక్చర్స్, కెరీర్ గైడెన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితరాలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది.

ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- బీఏ ఆనర్స్: హిస్టరీ, పొలిటికల్ సైన్స్
- బీకాం ఆనర్స్: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్
- బీఎస్సీ ఆనర్స్: కంప్యూటర్ సైన్స్-మేథ్స్, కంప్యూటర్ సైన్స్-ఫిజిక్స్, మేథ్స్-కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ

సీట్లు: బీఏ, బీకాం ప్రోగ్రామ్‌లో స్పెషలైజేషన్‌కు 20 సీట్లు; బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో మేథ్స్-కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-కంప్యూటర్ సైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లకు ఒక్కోదానిలో 25 సీట్లు మిగిలిన స్పెషలైజేషన్‌లకు ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొనే డిగ్రీ కోర్సును అనుసరించి ఎంపీసీ/బైపీసీ/ఏదేని గ్రూప్‌తో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు; మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో ఇన్‌స్టంట్/సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.600
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4
- అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్: జూన్ 11 నుంచి
- సిల్వర్ సెట్ 2024 తేదీ: జూన్ 16న
- వెబ్‌సైట్: sjgckurnool.edu.in

సిల్వర్ సెట్ 2024 వివరాలు

● దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. డిగ్రీ కోర్సులకు నిర్దేశించిన ప్రకారం మూడు పేపర్లు ఉంటాయి. అదనంగా ఇంగ్లీష్ పేపర్ అందరికీ కామన్‌గా ఉంటుంది. ఏపీ ఇంటర్ సిలబస్ ఆధారంగా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. పేపర్‌కు 25 మార్కులు చొప్పున మొత్తం మార్కులు 100. నెగిటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 100 నిమిషాలు.

● బీకాం ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్-1(ఎలిమెంట్స్ ఆఫ్ కామర్స్), కామర్స్-2(బుక్ కీపింగ్ అండ్ అకౌంటెన్సీ) సబ్జెక్టుల్లో; బీఏ ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల్లో; బీఎస్సీ ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది.

నీలిట్‌లో ఎంటెక్

కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, కాలికట్‌లో నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎలక్ట్రానిక్స్ డిజైన్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 18 సీట్లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో అయిదు సీట్లను స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో నాన్ గేట్ అభ్యర్థులకు అకడమిక్ ప్రతిభను అనుసరించి అవకాశాలు కల్పిస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు

ఎలక్ట్రానిక్స్ డిజైన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌కు ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బయోమెడికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్/బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఎలక్ట్రానిక్స్‌లో ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ప్రోగ్రామ్ ఉత్తీర్ణతతో పాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. వీరికి గేట్ స్కోర్ తప్పనిసరి కాదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 12
- **కౌన్సెలింగ్, అడ్మిషన్స్:** జూన్ 24
- **వెబ్‌సైట్:** https://nielit.gov. in/calicut



ఇండియన్ నేవీలో అగ్నివీర్ పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియామకానికి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024 బ్యాచ్‌తో శిక్షణ ఉంటుంది.

పోస్టు: అగ్నివీర్(సీనియర్ సెకండరీ రిక్రూట్- ఎస్ఎస్ఆర్)

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్(10+2)/రెండేళ్ల ఒకేషనల్ కోర్సు లేదా ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమొబైల్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన ఉండాలి.

వయసు: 2003 నవంబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 30 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

కనిష్ఠ ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళలు కనీసం 157 సెం.మీ. ఎత్తు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, స్టేజ్-1(ఇండియన్ నేవీ ఎంట్రెన్స్ టెస్ట్), స్టేజ్-2(రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష-పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ: అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో నవంబరులో శిక్షణ ప్రారంభం అవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరవాత సదరు విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీత భత్యాలు: ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేల వేతనం లభిస్తుంది.

దరఖాస్తు ఫీజు: రూ.550

దరఖాస్తు విధానం: అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభం: మే 13.

చివరి తేదీ: మే 27

శిక్షణ ప్రారంభం: 2024 నవంబరు

వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

పరిశోధనలకు జర్మనీ ఫండింగ్

పరిశోధనలకు పట్టం కట్టే సంస్థల స్థానంలో వాటికి ఊతం ఇచ్చే వ్యవస్థలూ ఉన్నాయి. అలాంటి వాటిలో 'ద మాక్స్ ప్లాంక్ సొసైటీ' ఒకటి. జర్మనీకి చెందిన ఈ సంస్థకు వంద సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. ఇండియాతో ఇరవై సంవత్సరాల అనుబంధం ఉంది. మంచి వర్కింగ్ కండిషన్స్‌కు తోడు అవసరమైన సిబ్బంది ఎంపికలో స్వేచ్ఛనిస్తున్న ఈ సంస్థ పరిశోధనలను కొత్త పుంతలు తొక్కిస్తోంది అంటే అతిశయోక్తి కాదు.

ద మాక్స్ ప్లాంక్ సొసైటీలో 31 మంది నోబెల్ గ్రహీతలు, పలువురు శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరికి తోడు ప్రపంచంలోనే ప్రసిద్ధ పరిశోధన సంస్థలతో భాగస్వామ్యం ఉంది. విశిష్ట పరిశోధనలను నిర్వచించే స్థాయిలో అలరారుతోంది. సంస్థకు చెందినవి, ఇతరత్రా కలిపి దీని గొడుగు కింద 84 ఉన్నాయి. నేచురల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లో పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. పలు దేశాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టొరల్ పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 1400 మంది విజిటింగ్ శాస్త్రవేత్తలు ఉన్నారు. ఇండియా నుంచి కూడా గుర్తించదగ్గ సంఖ్యలో శాస్త్రవేత్తలు ఈ పరిశోధనల్లో పాల్గొంటున్నారు. ఈ సంస్థ పరిధిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలకు తోడు ఇండియాలోని రీసెర్చ్ ఆర్గనైజేషన్స్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనే వీలు ఇక్కడ పరిశోధనలు కొనసాగించే రీసెర్చర్లకు ఉంటుంది. ఉమ్మడి యత్నాల్లో భాగంగా 85 వరకు పార్టనర్ గ్రూప్స్ ప్రపంచవ్యాప్తంగా దీనికి ఏర్పడ్డాయి. శాస్త్రీయ సంస్థలే కాకుండా సైంటిఫిక్‌గా ఎదగిన దేశాలు కూడా ఈ గ్రూపులో జతకట్టి ఉన్నాయి. తద్వారా పరిశోధనలను మరింత పటిష్టపర్చడం, అంతర్జాతీయ స్థాయిలో నెట్‌వర్క్‌ను నెలకొల్పటం ఈ చర్యలోని ప్రధాన ఉద్దేశం. అలాగే భాగస్వామ్యంలో ఉన్న గ్రూపులు విదేశాల్లో సంస్థలను పెట్టుకోవచ్చు. అదే సమయంలో మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ రెసిడెన్సీ ఉండాలి. తద్వారా పోస్ట్ డాక్టొరల్ అభ్యర్థులు తమ సొంత దేశంలో అత్యున్నత పరికరాలతో ప్రయోగశాలను సమకూర్చుకోవచ్చు. అలా తమకు నచ్చిన సబ్జెక్టులో పరిశోధనలను కొనసాగించవచ్చు. పార్టనర్ గ్రూప్స్ నెలకొల్పుకొనే ఇలాంటి వాటి వ్యవధి అయిదేళ్ళకు మించకూడదు.



మన దేశంలో

పార్టనర్ గ్రూప్ మరీ ముఖ్యంగా ఇండియాలో విజయవంతమైంది. ఈ ప్రోగ్రామ్ మనదేశానికి పరిచయమైన తరవాత 85 మంది ఇండియన్ సైంటిస్టులు ఈ అవార్డును పొందారు. మరేదేశంలో లేని విధంగా ఇండియాలో ఇందుకు సంబంధించి ఇరవయ్యో వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఫలితంగా మేధావలసకు బదులు మేధాపరంగా సర్క్యులేషన్‌కు వీలుపడుతోంది.

మాక్స్ ప్లాంక్ సంస్థల్లో నాలుగువేల మంది యువ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను కొనసాగిస్తున్నారు. వారిలో మూడోవంతు మంది ఇంటర్నేషనల్ మ్యాక్స్ ప్లాంక్ రీసెర్చ్ స్కూల్(ఐఎంపీఆర్ఎస్)లో భాగస్వాములు. ఈ స్కూల్స్, సెంటర్స్ పరిధిలోనే పలువురు పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఐఎంపీఆర్ఎస్ పూర్తిగా ప్రాంతీయ ఫోకస్ అంటే లోకల్ యూనివర్సిటీలు, రీసెర్చ్ సంస్థలతో కలిగి ఉంటుంది. పద్ధతిగా రూపొందించిన గ్రాడ్యుయేట్ శిక్షణకు అవకాశం కల్పిస్తుంది. ఒక్క జర్మనీలోనే 50 మంది పార్టనర్స్‌తో కలిసి అత్యున్నత స్థాయిలో పీహెచ్‌డీ చేసే వ్యక్తులకు తోడ్పాటును అందిస్తోంది. ప్రతి స్కూల్ యూనిట్‌లో బెస్ట్ స్కాలర్స్ ఉంటారు. వారే పరిశోధకులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. జర్మనీ అలాగే ప్రపంచవ్యాప్తంగా యూనివర్సిటీలు, వర్సిటీయేతర పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తుంటారు.

కాగ్నిషన్, మేటర్ ఆఫ్ లైఫ్, ఫొటానిక్స్‌లో మాక్స్ ప్లాక్ స్కూల్స్ ఉన్నాయి. కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, లా, క్వాంటమ్ మెటీరియల్స్‌లో 2018లో గ్రాడ్యుయేట్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేకించి కేంద్రీకృత దరఖాస్తు విధానం లేదు. ఏడాది పొడుగునా సంబంధిత డాక్టొరల్ ప్రకటనలు వస్తూ ఉంటాయి. సాధారణంగా సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ఆరంభమవుతుంది. సెంట్రల్ అప్లికెంట్ పోర్టల్ ద్వారా పనులన్నీ జరుగుతుంటాయి. డాక్టొరల్ విద్యార్థులకు గ్రాంట్ మంజూరవుతుంది. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్ ఉంటుంది. ఈ సొసైటీ ఇప్పటి వరకు 35 మంది డాక్టొరల్ అభ్యర్థులకు 'ఒట్టో హాన్ మెడల్'ను సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్‌కుగాను ప్రకటించింది.

ఫండింగ్

ఎంపీజీలో డాక్టొరల్ విద్యార్థులకు ఫండింగ్ కాంటాక్ట్‌ల ద్వారా రీసెర్చ్ విద్యార్థులకు నిధులు సమకూరుస్తారు. సైంటిఫిక్ ఫ్రీడమ్, సోషల్ సెక్యూరిటీ కలగలిసిన కాంట్రాక్ట్‌లు ఇవి. వర్కింగ్ టైమ్ వారానికి 39 గంటలు. కలెక్టివ్ వేజ్ అగ్రిమెంట్ కింద కనీసం 2700 యూరోలు చెల్లిస్తారు. సబ్జెక్టు, చేపట్టిన పరిశోధనను అనుసరించి వార్షిక బోనస్‌ను కూడా నిర్ణయిస్తారు. ఈ కాంట్రాక్ట్ కాలవ్యవధి మూడేళ్ళు. ఒక ఏడాది వరకు పొడిగింపునకు అవకాశం ఉంటుంది. డాక్టరేట్ ఫ్రేమ్ వర్క్‌లోనే విదేశీ పర్యటనలు ఉంటాయి. అందుకు ఫండింగ్ సపోర్ట్ ఉంటుంది.

సైంటిఫిక్ కెరీర్‌కు ఆలంబనగా మాక్స్ ప్లాంక్ ఇండియా మొబిలిటీ గ్రాంట్ ఉంటుంది. మేక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పని చేసేందుకు వీలు కల్పిస్తుంది. డాక్టరేట్ ఫైనల్ ఇయర్ లేదంటే డాక్టరేట్ పొంది పదేళ్ళు కూడా కాని వారు నామినీలుగా ఉండాలి. అలాగే సంస్థలకు అయిదు వేల యూరోలు ఇస్తారు. ఇండియన్ సైంటిస్టులకు అయ్యే ట్రావెల్ ఖర్చులు తదితరాలకు ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. అలాగే ఈ గ్రాంట్ పొందిన ఇండియన్ సైంటిస్టులు మూడేళ్ళ కాలంలో వరుసగా సంవత్సరానికి ఒక నెల వీటిలో పనిచేయాలి. అలాగే ఈ సంస్థ నిధులు పొందుతున్న అభ్యర్థులు ఇండియన్ రీసెర్చ్ సంస్థలో భాగస్వాములై ఉండాలి.

లిటిల్స్



ముంగిస విధేయత

ఒక ఊరిలో గోపాల్, మాధురి అనే జంట ఉండేది. వారికి ఓ కొడుకు పుట్టాడు. అతని పేరు శంకర్. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. గోపాల్ వ్యవసాయం చేస్తాడు. ప్రతి రోజూ చేనుకు వెళ్లేవాడు. ఉదయాన్నే చద్దన్నం కట్టించేది గోపాల్ భార్య. విచిత్రంగా వారింటికి ఒక రోజు ముంగిస వచ్చింది. సాధారణంగా ముంగిసను ఎవరైనా తరిమికొడతారు. శంకర్ చిన్న పిల్లవాడు దాని దగ్గరకు వెళ్లాడు. అదీ ఏమనలేదు. దీంతో శంకర్, ముంగిస స్నేహితులయ్యారు.

'కుక్కపిల్లతోనో, పిల్లితోనో ఆడుకోవాలి కానీ.. ఈ ముంగిస ఏంటీ?' అని పక్కింటి జనాలు అన్నారు. అయితే శంకర్ పట్టించుకోలేదు. ఆ ముంగిస ప్రతిరోజు ఇంట్లో వచ్చి కూర్చునేది. ఆహారం తినేది. ఒక రోజు యధావిధిగా గోపాల్ చేనుకు వెళ్తూ ఆలస్యంగా వస్తానని వెళ్లాడు. తన భార్య సరేనంది. మాధురి పక్క ఇంటిలో గాజుల వ్యాపారం చేసే ఆమె వస్తే అక్కడికి వెళ్లిపోయింది. పిల్లవాడిని ఊయలలో ఉంచి వెళ్లింది. ఆ ముంగిస ఇంట్లోనే కాపలా ఉంది. మాధురి పక్కింటికి వెళ్లి గాజులు తొడుక్కుని ఇంటికి వచ్చింది.

వచ్చి చూడగానే పిల్లవాడి ఊయల ముందు రక్తం. కచ్చితంగా ఇది ముంగిస పనే అనుకుంది మాధురి. పిల్లవాడిని చంపేసిందే అంటూ గట్టిగా అరిచింది. క్షణాల్లో కోపంతో కట్టె తీసుకుని ముంగిసను బాదింది. అది అక్కడికక్కడే రక్తం కక్కుకుని చచ్చింది. ఆలస్యంగా వస్తానన్న తన భర్త అప్పుడే ఇంటికి వచ్చాడు. ఏమైందని అడిగాడు. 'మన పిల్లవాడు లేడు. ఆ దొంగ ముంగిస కొరికేసింది. చచ్చిపోయాడు' అంటూ దీర్ఘాలు తీసింది. గోపాల్ చేతిలో కట్టె ఉంది. అలానే ముందుకు వెళ్లాడు. ఊయల వెనకాల ఓ పాము చచ్చిపడి ఉంది. ఊయల్లో శంకర్ హాయిగా నిద్రపోతున్నాడు. గోపాల్‌కి తన ప్రాణాలు తిరిగి వచ్చాయని అనిపించింది.



తన భార్యను పిలిచాడు. అసలే మనది ఊరి చివరి ఇల్లు. ఒక పాము వస్తే.. దాంతో ఈ ముంగిస పోరాడింది. పామును చంపేసింది. 'నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు. విధేయతతో ఉండే ముంగిసను చంపేశావెందుకూ? నీకు మతి ఉందా?' అంటూ తిట్టడం మొదలెట్టాడు గోపాల్. 'ఒక పని చేసేముందు ఆలోచించకపోతే ఎలా? పిల్లవాడిని ఈ ముంగిస కాపాడింది. ఇంతటి విధేయత గల దీన్ని చంపేయటానికి మనసెలా వచ్చింది?' అంటూ అరిచాడు. తన భార్య జరిగిన తప్పుకు బాధపడింది. ఆ తర్వాత ఆ రైతు కూడా బాధపడ్డాడు.


సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 302

			3					
		7		1	8	5		
	1						9	8
7					9		4	
	9	4	7		5	8	1	
	8		1					7
6	4						5	
		2	4	8		3		
					1			

సుడోకు - 301 సమాధానం

5	4	3	9	8	1	2	6	7
7	8	1	6	2	3	5	9	4
2	6	9	5	4	7	1	8	3
8	2	5	4	7	9	6	3	1
1	7	4	3	6	5	8	2	9
9	3	6	2	1	8	4	7	5
3	9	2	1	5	6	7	4	8
6	5	8	7	9	4	3	1	2
4	1	7	8	3	2	9	5	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.